


శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



'అమెరికన్ కాన్సులేట్ రోడ్డు'కు 'ట్రంప్' పేరు పెట్టాలన్న

ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

పేదలపై భారం మోపడమేనా.. వికసిత్ భారత్? 03



సంపుటి 09, సంచిక: 198 | గురువారం | 18-06-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## ఉన్నతస్థాయి న్యాయ విచారణ

రామ మందిరం నిధుల దుర్వినియోగంపై సిపిఐ డిమాండ్

**న్యూఢిల్లీ:** అయోధ్య రామ మందిరం నిర్వహణలో నిధుల దుర్వినియోగం జరిగిందని వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణలపై ఉన్నతస్థాయి న్యాయ విచారణ జరిపించాలని భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు. విచారణ పూర్తయ్యేవరకూ శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ బన్సాల్ సహా ఈ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతర నిర్వాహక మండలి సభ్యులను కూడా బాధ్యతల నుండి తొలగించాలని కోరారు. రామ మందిరం ప్రారంభించడానికి ముందు కూడా అయోధ్య రామాలయ నిర్వహణలో ప్రజల నుండి సేకరించిన నిధులు కాజేశారని ఆరోపణలు వచ్చాయని,ఈ విధమైన ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి కాదని డి.రాజా తన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాలరీత్యా చాలా న్యాయబద్ధంగా నిష్పాక్షికంగా విచారణ జరగాల్సి ఉందని కోరారు. ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిలకు సన్నిహితంగా ఉండే వ్యక్తులు రామాలయ నిర్వహణకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలలో వ్యవరిస్తున్న తీరుపై అనేక తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది భక్తులు రూపాయి–రూపాయి విరాళాలుగా ఇచ్చారని,

తరువాయి 8లో



ప్రభుత్వ పాఠశాలలతో

# మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం

- విద్యారంగంలో తెలంగాణను దేశంలో ఆదర్శంగా నిలుపుతాం
- 24 వేల ప్రభుత్వ స్కూళ్లలో 27 లక్షల మంది విద్యార్థులు
- తరగతి గదుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక టిపిఎస్ స్కూల్
- ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి
- పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం

ప్రజాపక్షం/రంగారెడ్డి

రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలంటే ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. మాజీ ప్రధాని పి.వి. నరసింహారావుతో పాటు తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సిఎం గుర్తు చేశారు. ప్రభుత్వ బడిలో చదివి ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నానని, విద్యార్థులు కూడా ఐఎఎస్‌లు, ఐపి ఎస్‌లు, అధికారులు, రాజకీయ నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వివక్ష నిర్మూలనకే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ డిజైన్ చేయడం జరిగిందని అన్నారు. విద్యారంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలుపుతామని సిఎం ఉద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్రంలో 24 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉంటే అందులో 27 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వారందరికి ఈ ఆరుట్ల గ్రామంలోని


తరువాయి 8లో



శాంతి ఒప్పందంలో నావికులకు

# రక్షణ నిబంధన

- ఈ అంశానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వండి
- నౌకాయాన స్వేచ్ఛ, రక్షణపై కలిసి పనిచేద్దాం
- ట్రంప్‌తో సమావేశంలో మోదీ విజ్ఞప్తి
- జులై 15 నుండి భారత్–బ్రిటన్ స్వేచ్ఛాఒప్పందం అమలు




**ఎవియన్–లెస్–బైన్స్ :** నావికులు, సముద్ర కార్మికులకు రక్షణ కల్పించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చెప్పారు. శాంతి ఒప్పందంలో ఈ అంశానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పశ్చిమాసియాలో యుద్ధం సందర్భంగా హోర్ముజ్ జలసంధిలో ప్రయాణించే నౌకలు,చమురు ట్యాంకర్లలో పనిచేసే కార్మికులు,ఉద్యోగులకు రక్షణ కొరవడిందని, వారికి రక్షణ కల్పించేవిధంగా అమెరికా–ఇరాన్ శాంతి ఒప్పందంలో ఒక నిబంధనను చేర్చాలని ట్రంప్‌ను మోదీ కోరారు. జి–7 శిఖరాగ్రసదస్సులో భాగంగా చివరిరోజు నిర్ణీత ప్రకారం ట్రంప్–మోదీ మధ్య ముఖాముఖీ సమావేశం జరిగింది. హోర్ముజ్ జలసంధిలో పలు భారతీయ నౌకలపై అమెరికా సెంట్‌కామ్ దళాలు దాడులు చేశాయి. పలు సందర్భాలలో నౌకలు దెబ్బతిన్నాగానీ, భారతీయ నావికులు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. కానీ యుద్ధం ముగియడానికి ముందు గడచినవారంలో 'పలావ్' జెండాతో వస్తున్న నౌకపై అమెరికా దళాలు దాడి చేయడంతో ముగ్గురు భారతీయ నావికులు మరణించారు. దీంతో సర్వత్రా సముద్రయాన కార్మికులు,ఉద్యోగుల భద్రతపై తీవ్ర ఆందోళన చెలరేగడంతోపాటు ప్రత్యేకించి మనదేశంలో అంతర్గతంగా సెంట్‌కామ్ తీరుపై, మోదీ ప్రభుత్వ నిష్క్రియాపరత్వంపై తీవ్ర ఆగ్రహావేశాలు పెరుగుతూ ఉండటంతో ముఖాముఖీ సమావేశంలో ట్రంప్‌కు మోదీ పైవిధంగా విజ్ఞప్తి చేశారు.

పశ్చిమాసియాలో యుద్ధం ముగించేందుకు శాంతి స్థాపనకు ట్రంప్ చేస్తున్న కృషిని మోదీ ప్రశంసించారు. అదేసమయంలో కీలక సముద్ర ప్రాంతాలలో, వాణిజ్యమార్గాలలో లక్షలాదిమంది భారతీయ కార్మికులు పనిచేస్తున్నందువల్ల వారి భద్రత విషయాన్ని ఆయన ప్రముఖంగా ట్రంప్ దృష్టికి తెచ్చారు. ఇరాన్‌తో కుదిరే ఒప్పందంలో సముద్రయాన కార్మికుల భద్రతపై కూడా తగిన నిబంధనలు ఉంటాయన్న ఆశాభావం

తరువాయి 8లో

వరి బోనస్

# ఏడు సన్నాలకే



- పరిశీలనలో రైతుల బ్యాంక్ ఖాతాల్లోకే నేరుగా విత్తన సబ్సిడీ
- ప్రభుత్వం సూచించిన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలి
- అధికారులకు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్


విత్తన సబ్సిడీపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుందని,వ్యవ సాయ యాంత్రీకరణ పథకం తరహాలో సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని పరిశీలిస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. విత్తనాల పంపిణీ కోసం అవసరమైతే రైతు వేదికలను ప్రత్యేక కేంద్రాలుగా వినియోగించుకునేందుకు అనుమతినిస్తామని, ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న 'ఏడు' వరి రకాలకే బోనస్ వర్తిస్తుందని తుమ్మల నాగేశ్వర్ రావు స్పష్టం చేశారు. విత్తన కంపెనీల ప్రతినిధులు, ఎరువుల డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు,కృషి వాస్ ప్రతినిధులతో విడివిడిగా సమావేశమై ఖరీఫ్ సీజన్ ఏర్పాట్లపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం సమగ్రంగా సమీక్షించారు. బిపిటి5204 (సాంబమసూరి), ఆర్‌ఎన్‌ఆర్15048 (తెలంగాణ సోన), హెచ్ ఎంటి సోనా,జై శ్రీరామ్, కెఎన్ఎం1638 (కూనారం సన్నలు), డబ్ల్యుజిఎల్44 (సిద్ధి),కెఎన్ఎం7715 రకాల విత్తనాలను రైతులకు విస్తృతంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. గతంలో దొడ్డు రకాల సాగు 60 శాతం, సన్న రకాల సాగు 40 శాతం ఉండేదని, ప్రస్తుతం సన్నాలకు బోనస్ ప్రకటించిన తర్వాత సన్న రకాల సాగు 60 శాతానికి చేరుకుందన్నారు. ప్రభుత్వం సూచించిన విత్తనాలను రైతులకు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని కంపెనీలను మంత్రి ఆదేశించారు. రైతులకు విత్తనాల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదని, ఈ రకాలను ఏ రైతు ఎంత విత్తనం కొనుగోలు చేశారు?, ఆయా

తరువాయి 8లో

# నాటకాలు ఆపండి

- పేపర్‌లీక్ మాఫియాను అడ్డుకోండి
- ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ మండిపాటు
- టెలిగ్రామ్‌పై నిషేధం దొంగను పట్టుకోవడానికి బదులు బాధితుడి ఇంటికే తాళం వేయడం లాంటిదేనని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలికంగా ఆంక్షలు విధించడంతో మోదీ ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. దొంగను పట్టుకోవడానికి బదులుగా బాధితుడి ఇంటికే తాళం వేయడం లాంటిదే ఈ 'కొత్త ఎత్తుగడ' అని మండిపడ్డారు. యాప్ లభ్యతను ప్రభుత్వం తాత్కాలికంగా నిరోధించడంతో, భారతదేశంలోని ప్రస్తుత



వినియోగదారులకు ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ పనిచేయడం ఆగిపోయింది. నీట్‌యుజి 2026 తిరిగి పరీక్ష నిర్వహించే ముందు టెలిగ్రామ్ యాప్ లభ్యతను నిరోధించాలన్న ప్రభుత్వ ఉత్తర్వుకు అనుగుణంగా, గూగుల్ మంగళవారం ఈ యాప్‌ను తొలగించగా, ఇప్పుడు యాపిల్ యాప్‌స్టోర్ కూడా దానిని తీసివేసింది. ఈ నేపథ్యంలో 'టెలిగ్రామ్ నిషేధం పేపర్ లీక్‌లను ఆపడానికి మోదీ ప్రభుత్వ

తరువాయి 12లో



# శాస్త్రీయ పద్ధతిలో ప్రాజెక్టుల పూడికతీత

- కేంద్రం రూపొందించిన మార్గదర్శకాలను, విధివిధానాలను అధ్యయనం చేయాలి
- గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల జలాశయాల్లో వాస్తవ నీటి నిల్వ సామర్థ్యం పునరుద్ధరణకు ప్రణాళిక
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులు, జలాశయాల్లో పూడిక తొలగింపు (డీసిల్టేషన్) ప్రణాళికను శాస్త్రీయ పద్ధతిలో రూపొందించాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. తక్షణ అవసరాలను తీర్చడంతో పాటు దీర్ఘకాలిక వరద నియంత్రణ అవసరాలకు ఉపయోగపడే విధంగా ఆచరణాత్మక, స్థిరమైన శాస్త్రీయ నమూనాను రూపొందించాలన్నారు. గోదావరి,

తరువాయి 12లో

# వనమహోత్సవానికి సర్వం సిద్ధం



- గుర్రంగూడలో సిఎం చేతుల మీదుగా నేడు ప్రారంభం
- రూ.35.50 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం 2026కు సర్వం సిద్ధమైంది. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ ఎకో పార్కులో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం నాగలింగం మొక్కను నాటి రాష్ట్రవ్యాప్త మొక్కల పండుగకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ సందర్భంగా గుర్రంగూడ ఎకో పార్కులో రూ.17.84 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రూ.17.66 కోట్ల విలువైన అటవీ, పర్యావరణ అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. దీంతో మొత్తం రూ.35.50 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. వనమహోత్సవం

తరువాయి 12లో

ఇహెచ్‌ఎస్ అమలుకు

## హెల్త్‌కేర్ ట్రస్ట్ బోర్డు

- సిఎస్ చైర్మన్‌గా 29 మందితో ఏర్పాటు
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని (ఇహెచ్‌ఎస్) క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం "ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్"(ఇహెచ్‌సిటి) బోర్డ్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా 29 మందితో బోర్డ్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బోర్డులో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో పాటు

తరువాయి 8లో

ప్రభుత్వ ఉద్యోగుల తరహా

# జర్నలిస్టులకు హెల్త్ కార్డులు

- ప్రభుత్వం సన్నాహాలు
- జర్నలిస్టుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రతే ధ్యేయంగా ప్రభుత్వం, మీడియా అకాడమీ కీలక అడుగులు
- మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వర్కింగ్ జర్నలిస్టులకు కూడా మెరుగైన వైద్య సౌకర్యాల నిమిత్తం హెల్త్‌కార్డులను అందించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రతే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం, మీడియా అకాడమీ సంయుక్తంగా కీలక అడుగులు వేస్తున్నాయన్నారు. "వృత్తి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన, తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకునేందుకు"

తరువాయి 8లో

సమాన ప్రపంచపాలనావ్యవస్థ నిర్మాణానికి

# చైనా 'శ్వేతపత్రం'

- పేద, ధనిక, బలమైన– బలహీన దేశాలన్నీ అంతర్జాతీయ వేదికపై సమానమే
- వివరాలు వెల్లడించిన చైనా విదేశీ వ్యవహారాల మంత్రి వాంగ్ యీ

ఐక్యరాజ్యసమితిలో ప్రతిధ్వనించిన గ్లోబల్‌సౌత్ గొంతు




**బీజింగ్:** ప్రపంచవ్యాప్తంగా ఏకపక్షవాదం, ఆధిపత్యవాదం గొంతెత్తి ఘీంకరిస్తున్న తరుణంలో ఐక్యరాజ్యసమితి ద్వారా ప్రపంచంలో సమాన న్యాయ పాలనా వ్యవస్థ నిర్మాణం కోసం చైనా ప్రభుత్వం ఒక శ్వేతపత్రాన్ని (వైట్‌పేపర్) విడుదల చేసింది. నూతన శకంలో, మానవాళి కోసం ఉమ్మడి భవిష్యత్తుతో కూడిన సమాజ నిర్మించాలనే దృక్పథాన్ని ఈ శ్వేతపత్రం ద్వారా చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ప్రపంచం ముందుకు తెచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఎప్పటికప్పుడు ఎదురవుతున్న సవాళ్ళకు సమర్థవంతమైన స్పందనలు ఉంటాయని, వీటిపై అంతర్జాతీయ ఏకాభిప్రాయం సాధించడమే ఈ శ్వేతపత్రం ప్రధాన లక్ష్యమని ఈ శ్వేతపత్రాన్ని విడుదల చేస్తూ చైనా విదేశీ వ్యవహారాలమంత్రి వాంగ్ యీ చెప్పారు. పశ్చిమాసియాలో సంక్షోభం నేపథ్యంలో ఇంకా ప్రపంచంలో పరిస్థితులు ఆందోళనకరంగానే ఉన్నాయన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో దేశాలకు సమాన ప్రాతినిధ్యం లేకుండాపోయిందని, గ్లోబల్ సౌత్ దేశాల ప్రాతినిధ్యం పెరగాలని,ఈ దేశాలు తమ గళాన్ని ఐక్యరాజ్యసమితిలో మరింత బలంగా వినిపించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా తీవ్రమవుతున్న రాజకీయ, ఆర్థిక సవాళ్ళ కారణంగా ఐక్యరాజ్యసమితిలో వర్ధమాన దేశాల మార్కెట్లకు సవాళ్ళు ఎదురవుతున్నాయని అన్నారు. దేశాలు చిన్నవైనా,పెద్దవైనా,అభివృద్ధి చెందినవైనా,అభివృద్ధి చెందుతున్నవైనా,బలహీనమైనవైనా,బలమైనవైనా, అంతర్జాతీయ సమాజంలో, అంతర్జాతీయ వేదికలో అన్నీ సమానమేనని ఈ శ్వేత పత్రం స్పష్టం చేసింది."వేగంగా వస్తున్న కొత్త సవాళ్ళు ఒకదానితో ఒకటి ముడిపడిన ప్రపంచ సంక్షోభాలను తీసకువస్తున్నాయి,పగడపు దిబ్బలలో ఉండే నాగరికత ఓడ ఇప్పుడు భయంకరమైన తుఫాను జలాల్లోకి ప్రవేశించింది,లోతుగా

తరువాయి 12లో

# ఆడలేక మద్దెల ఓడు..

విద్యా, ఉద్యోగ పరీక్షా పేపర్లు లీక్ కావడం ఆనవాయితీగా మారింది. బాధ్యత వహించాల్సిన విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను విద్యార్థిలోకం డిమాండ్ చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. సమస్య మూలాలను పట్టించుకోవడం లేదని మరోసారి రుజువైంది. జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) వంటి అత్యంత కీలకమైన పోటీ పరీక్ష పేపర్ లీక్‌కు కారణాలు లోతుగా వెతక్కుండా, కొన్ని అరెస్టులతో సరిపెట్టి వాటిని పంపడానికి ఉపయోగించిన 'టెలిగ్రామ్'పై పునఃపరీక్ష సందర్భంగా తాత్కాలిక కాలనిషేధం విధించడం విచిత్రం. నీట్ లాంటి పరీక్షలకు ఏటా లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తును పణంగా పెట్టి సిద్ధమవుతారు. ఒక మధ్యతరగతి కుటుంబం తమ పిల్లల వైద్య విద్య కలను సాకారం చేయడానికి సంవత్సరాల తరబడి ఆర్థికంగా, మానసికంగా ఎన్నో త్యాగాలు చేస్తుంది. విద్యార్థులు పగలు రాత్రి తేడా లేకుండా కష్టపడి చదువుతారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రశ్నాపత్రాల లీకేజీలు జరుగుతున్నాయనే వార్తలు బయటకు రావడం కేవలం ఒక పరీక్షా వ్యవస్థ వైఫల్యం మాత్రమే కాదు, దేశ యువత భవిష్యత్తుపై జరిగిన దాడిగా పరిగణించాలి. ఇటీవల నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంతో సంబంధం ఉందనే కారణంతో టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలిక నిషేధం విధించాలనే ప్రభుత్వ నిర్ణయం తీవ్ర చర్చకు దారి తీస్తున్నది. ఒక యాప్‌ను నిషేధించడం ద్వారా ప్రశ్నాపత్రాల లీకేజీ అనే మహమ్మారిని నిజంగా అరికట్టగలమా? అనేది ప్రశ్న. టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ చేసిన వ్యాఖ్యలు ఈ చర్చను మరింత విస్తృతం చేస్తున్నాయి. ఆయన వాదన ప్రకారం, టెలిగ్రామ్‌ను నిషేధించడం ద్వారా సమస్యకు మూలకారణాన్ని పరిష్కరించడం లేదు. ప్రశ్నాపత్రాలను లీక్ చేసిన వారిని పట్టుకోవడం బదులు, కోట్లాది మంది సాధారణ వినియోగదారులను ప్రభుత్వం శిక్షిస్తున్నది. ఈ వాదనలో ఒక ముఖ్యమైన సత్యం ఉంది. సాంకేతిక వేదికలు కేవలం సాధనాలు మాత్రమే. ఒక నేరం టెలిగ్రామ్‌లో జరిగితే అదే నేరం వాట్సాప్‌లో, సిగ్నల్‌లో, డిస్కార్డ్‌లో, ఇమెయిల్ ద్వారా లేదా సాధారణ ఫోన్ కాల్స్ ద్వారా కూడా జరగవచ్చు. ఒక వేదికను నిషేధించడం వల్ల నేరగాళ్లు అదృశ్యమవరు. వారు మరొక మార్గాన్ని ఎంచుకుంటారు. కానీ నిజాయితీగా చదువుకుంటున్న లక్షలాదిమంది విద్యార్థులు మాత్రం తమ చదువు సామగ్రిని, చర్చా వేదికలను, నోట్స్‌ను, వీడియోలను కోల్పోతారు. ఇక్కడ, సమస్యను దాని లక్షణాల ద్వారా చూస్తున్నాం గానీ మూలకారణాలను గుర్తించడంలో విఫలమవుతున్నాం. ప్రశ్నాపత్రం పరీక్షకు ముందే బయటకు రావడం అంటే అది ఏదో ఒక స్థాయిలో ఉన్న అధికారిక వ్యవస్థ నుంచే బయటకు వెళ్లిందని అర్థం. ప్రశ్నాపత్రం తయారీ, ముద్రణ, రవాణా, నిల్వ, పంపిణీ వంటి ప్రతి దశలో అనేక మంది వ్యక్తులు, సంస్థలు పాల్గొంటాయి. ఈ గొలుసులో ఎక్కడో ఒకచోట భద్రతా వైఫల్యం జరుగుతోంది. అటువంటి వైఫల్యాన్ని గుర్తించి సరిదిద్దకుండా కేవలం సమాచార మార్పిడి సాధనాలను నిందించడం సమస్యను మరింత సంక్లిష్టం చేస్తుంది. ప్రస్తుతం దేశంలో పోటీ పరీక్షల చుట్టూ ఏర్పడిన పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. నీట్ మాత్రమే కాదు, వివిధ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలు, పోలీస్ నియామక పరీక్షలు, ఉపాధ్యాయ నియామక పరీక్షలు, ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు, బ్యాంకింగ్ పరీక్షలు వంటి అనేక పరీక్షలు గత కొన్నేళ్లుగా లీకేజీల ఆరోపణలతో వార్తల్లో నిలుస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో పరీక్షలు రద్దయ్యాయి. మరికొన్ని సందర్భాల్లో మళ్లీ నిర్వహించారు. కానీ ప్రతి రద్దు వెనుక వేలాది కుటుంబాల ఆవేదన దాగి ఉంటుంది. పరీక్ష కోసం సంవత్సరాల పాటు సిద్ధమై, కోచింగ్ కేంద్రాల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసి, తమ జీవితంలోని అత్యంత విలువైన సమయాన్ని వెచ్చించిన విద్యార్థులకు పరీక్ష రద్దు అనేది అశనిపాతం. అది వారి జీవిత ప్రణాళికను ఛిద్రం చేసే దుర్మార్గం. ఈ పరిస్థితి విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఇప్పటికే భారతదేశంలో విద్యా పోటీ అత్యంత తీవ్రమైన స్థాయికి చేరుకుంది. వైద్య విద్యలో ఒక సీటు కోసం లక్షల మంది పోటీ పడుతున్నారు. విద్యార్థులు తీవ్ర ఒత్తిడిలో జీవిస్తున్నారు. ఇలాంటి సమయం లో పరీక్షా వ్యవస్థపై నమ్మకం కోల్పోతే వారి మానసిక స్థితి మరింత దెబ్బతింటుంది. కొన్ని సందర్భాల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. ఒక ప్రశ్నాపత్రం లీక్ కావడం వల్ల కేవలం పరీక్ష మాత్రమే దెబ్బతినదు... ఒక విద్యార్థి తన కష్టానికి విలువ లేదనే భావనకు లోనవుతాడు. నిజాయితీగా చదివినా, ప్రతిభ ఉన్నా, చివరికి అవినీతి, అక్రమాలే విజయం సాధిస్తున్నాయనే నిరాశ అతనిని మానసికంగా కుంగదీస్తుంది. ప్రజాస్వామ్యంలో పరీక్షా వ్యవస్థ అనేది సామాజిక న్యాయానికి అత్యంత ముఖ్యమైన సాధనం. పేదవాడు, ధనవంతుడు, గ్రామీణుడు, పట్టణవాసి అనే తేడా లేకుండా అందరికీ సమాన అవకాశాన్ని కల్పించే వేదికగా పరీక్షలు ఉండాలి. కానీ ప్రశ్నాపత్రాల లీకేజీలు జరుగుతున్నప్పుడు ఆ సమానత్వ సూత్రం పూర్తిగా కూలిపోతుంది. డబ్బు, రాజకీయ ప్రభావం లేదా అక్రమ నెట్‌వర్క్‌లకు ప్రాప్యత ఉన్నవారు ముందుకు వెళ్తారు. నిజాయితీగా కష్టపడిన విద్యార్థులు వెనుకబడిపోతారు. దీని ఫలితం గా సమాజంలో ప్రతిభ కంటే అవినీతి ఎక్కువ ఫలితాలను ఇస్తుందనే ప్రమాదకరమైన సందేశం వ్యాపిస్తుంది. టెలిగ్రామ్‌పై నిషేధం విషయంలో కూడా ఇదే ప్రశ్న తలెత్తుతుంది. ఒక వేళ లీక్ అయిన ప్రశ్నాపత్రాలు నిజంగానే టెలిగ్రామ్ ద్వారా వ్యాపించాయని అనుకుందాం. అయినప్పటికీ, ఆ ప్రశ్నాపత్రం మొదట బయటకు ఎలా వచ్చింది? ఎవరు దానిని లీక్ చేశారు? ఏ అధికారుల నిర్లక్ష్యం లేదా కుమ్మక్కు వల్ల అది సాధ్యమైంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు కనుగొనకుండా కేవలం పంపిణీ మాధ్యమాన్ని నిషేధించడం అనేది వ్యాధి మూలాన్ని వదిలి లక్షణాలకు మాత్రమే చికిత్స చేయడంలాంటిది. గాయం లోతుగా ఉన్నప్పుడు పైపైగా కట్టుకట్టడం వల్ల అది నయం కాదు. డిజిటల్ యుగంలో సమాచార ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకోవడం దాదాపు అసాధ్యం. కాబట్టి సాంకేతిక నిషేధాల కంటే వ్యవస్థాగత సంస్కరణలే ఎక్కువ ఫలితాలను ఇస్తాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి మొదటగా పరీక్షా వ్యవస్థలో సంపూర్ణ పారదర్శకత అవసరం. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి పరీక్షా కేంద్రాలకు చేరే వరకు ప్రతి దశను డిజిటల్ ట్రాకింగ్ పరిధిలోకి తీసుకురావాలి. కృత్రిమ మేధస్సు, బ్లాక్ చైన్ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి ప్రశ్నాపత్రాల భద్రతను మరింత బలోపేతం చేయవచ్చు. అదేవిధంగా, ప్రశ్నాపత్రాల లీకేజీని సాధారణ నేరంగా కాకుండా దేశ భవిష్యత్తుపై దాడిగా పరిగణించేలా కఠినమైన చట్టపరమైన చర్యలు అవసరం. లీకేజీలకు పాల్పడిన వ్యక్తు లు మాత్రమే కాకుండా, వారిని రక్షించే అధికారులు, మధ్యవర్తులు, కోచింగ్ మాఫియాలు, రాజకీయ ఆశ్రయం కల్పించే వ్యక్తులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలి. విచారణలు వేగంగా పూర్తయ్యే ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలి. సంవత్సరాల తరబడి కేసులు సాగితే నిరోధక ప్రభావం ఉండదు. ●



## టెలిగ్రామ్‌పై ఆంక్షల నిర్ణయం అసంబద్ధం

**నీట్-యుజి 2026 పునఃపరీక్షకు ముందు టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్‌కు ప్రాప్యతను తాత్కాలికంగా పరిమితం చేయాలన్న కేంద్రం నిర్ణయం అసంబద్ధం. ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. ఆర్మీ విమానాల్లో ప్రశ్నాపత్రాలను తరలించడం, టెలిగ్రామ్‌ను మూసివేయడం వంటి చర్యలు ప్రశ్నాపత్రాల లీకేజీలను ఆపుతాయా? అస్సలు ఆపలేవు.**

- ఆప్ జాతీయ కన్వీనర్
అరవింద్ కేజ్రీవాల్

## పుస్తకాల అట్టలపై స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు తెలిపే 'నేమ్ స్టిక్కర్లు'

భారత స్వాతంత్ర్య పోరాటంలో అపూర్వ త్యాగాలు, అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించి ఆంగ్లేయులతో పోరాడిన భారత స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలను భావి తరానికి ముఖ్యంగా విద్యార్థులకు తెలియజేసేందుకు ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ తెలుగు రాష్ట్రాలలో పాఠశాలల ప్రారంభం వేళ అక్షరాల లక్ష 'నేమ్ స్టిక్కర్ల' కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించడం హర్షణీయం. ఈ రకంగా ఆయన చేస్తున్న ఈ కృషి మూలంగా 'భారత స్వాతంత్ర్య సమరయోధుల పోరాట చరిత్రలను విద్యార్థులు సులువుగా అవగాహన చేసుకునేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయి. పాఠ్య పుస్తకాల అట్టల మీద అంటించుకునే లక్ష 'నేమ్ స్టిక్కర్ల' పంపిణీ కార్యక్రమాన్ని సయ్యద్ నశీర్ అహమ్మద్ మొదటగా 2018 లో ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు నాలుగేళ్ల పాటు ఆయన ఆరు లక్షల నేమ్ స్టిక్కర్లు ముద్రించి దేశంలోని వందలాది పాఠశాలలోని వేలాదిమంది విద్యార్థులకు అందజేసి భారతదేశంలోనే సరికొత్త చరిత్రను సృష్టించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఈ రకంగా ఆయన స్వాతంత్ర్య సమరయోధుల స్టిక్కర్లు అందజేయడం చాలా అరుదైన విషయం.

పుస్తకాల మీద వేసుకునే అట్టలు దాదాపు నాలుగు నెలల పాటు సురక్షితంగా ఉంటాయి. సహజంగా పాఠశాలల విద్యార్థులు తమకు ఇష్టమైన చలనచిత్ర నటులు, క్రికెట్ క్రీడాకారులతో కూడిన నేమ్ స్టిక్కర్లను పుస్తకాల అట్టలకు ఉపయోగిస్తుంటారు. కాని దీనికి భిన్నంగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, క్లుప్తంగా ఆ యోధుల పోరాటాల వివరాలను నేమ్ స్టిక్కర్ల మీద అంటించడం మూలంగా ఇటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అటు తల్లిదండ్రులు కూడా ఆ స్టిక్కర్లు మీద ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల వివరాలు తెలుసుకునే విధంగా సయ్యద్ నశీర్ అహమ్మద్ ముందుచూపుతో శ్రమించారు.

ఈ నేమ్ స్టిక్కర్ల మీద విద్యార్థుల పేర్లు, పుస్తకాల వివరాలు, పాఠశాల వివరాలు రాసుకోవడానికి మాత్రమే పరిమితం కాకుండా స్వాతంత్ర్య సమరయోధుల రంగుల చిత్రాలు, వారి జననమరణాల వివరాలు, స్వాతంత్ర్య సంగ్రామంలో వారు చేసిన కృషిని తెలియజేసే విధంగా సయ్యద్ నశీర్ అహమ్మద్ ఏక వాక్య సమాచారంతో 'సూక్ష్మంలో మోక్షం'లా రూపొందించిన తీరు అత్యద్భుతం. 'పుస్తకాల వైపు చూసినప్పుడు అసంకల్పితంగా విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు ప్రతిబింబించడం మూలంగా వారి పోరాటాల ఘట్టాలు విద్యార్థుల మస్తిష్కాలలో కలకాలం నిలిచిపోయే విధంగా ఆయన ఈ 'నేమ్ స్టిక్కర్ల'ను రూపొందించడం గమనార్హం. ఆ రకంగా భావి విద్యార్థులను అత్యద్భుతంగా ఆకట్టుకునే విధంగా 'నేమ్ స్టిక్కర్ల'ను రూపొందించడంలో ఆయన విశేషంగా కృషి చేశారు.

మాతృభూమి విముక్తి పోరాటంలో పాల్గొని అపూర్వ త్యాగాలు, అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శిస్తూ ఆంగ్లేయులతో పోరాడిన భారత స్వాతంత్ర్య సమరయోధులను పోరాట చరిత్రలను నేటి తరానికి సంక్షిప్తంగా తెలియజేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సయ్యద్ నశీర్ అహమ్మద్ ఈ కార్యక్రమాన్ని క్రమానుగతంగా కొనసాగిస్తూ ముందుకు సాగిపోతుండడం గొప్ప విషయం. అనేక అవాంతరాలు, అవరోధాలు సంభవించిననూ ఆయన వాటన్నింటిని దాతల ఆర్థిక చేయూతతో, సేవాసంస్థల, సామాజిక కార్యకర్తల క్రియాశీలక సహకారం తో అధిగమిస్తూనే ఈ నేమ్ స్టిక్కర్ల కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలవడం ప్రశంసనీయం. ఆయన నిర్వహిస్తున్న సేవాస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని మరెందరో సేవా దృక్పథాన్ని అలవరచుకుని ఆ దిశగా ముందుకు సాగాల్సిన అవసరం తప్పకుండా ఉంది. అలాగే సయ్యద్ నశీర్ అహమ్మద్ ప్రారంభించి న ఈ సరికొత్త 'నేమ్ స్టిక్కర్ల' కార్యక్రమాన్ని ముఖ్యంగా జర్నలిస్టులు ప్రజల దృష్టికి తీసుకురాల్సిన అవసరం తప్పకుండా ఉంది.

జె.జె.సి.పి. బాబూరావు
94933 19690

# ప్రతిఘటన, పునరుద్ధరణ, ఇండియా కూటమి భవిష్యత్తు



దీపాంకర్ భట్టాచార్య
ప్రధాన కార్యదర్శి సిపిఐ (ఎంఎల్) లిబరేషన్

ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్ (ఇండియా) కూటమి నాయకులతో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగాన్ని విడుదల చేయడం బహుశా ఇదే మొదటిసారి. భారతీయ గణతంత్ర పునాదులు, కోట్లాది భారతీయుల స్వేచ్ఛ, జీవనోపాధులపై సంఘ్ – భారతీయ జనతా పార్టీ(బిజెపి)ల దాడికి వ్యతిరేకంగా ఐక్య ప్రతిఘటన నిర్మించటంపై ఆయన దృష్టి సారించటం ఆహ్వానించదగిందే. అలాగే నిజమైన శక్తిమంతమైన సుస్థిర ప్రతిఘటనకు కొన్ని నిర్మాణాత్మక అభిప్రాయాలను ఆయన వ్యక్తం చేశారు.

ఇండియా పేరు నిర్ణయించేందుకు ముందు 2023 జూన్‌లో బిహార్‌లోని పట్నాలో జరిగిన ఆరంభ దశ సమావేశం సహా ఇండియా కూటమికి సంబంధించిన అన్ని సమావేశాలకు నేను (వ్యాసకర్త)కూడా హాజరయ్యాను. బిజెపి 'డబుల్– ఇంజిన్' / నేషనల్ డెమొక్రాటిక్ అలయెన్స్ (ఎన్‌డిఎ) ప్రభుత్వాలు 20కిపైగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో విస్తరించిన సమయంలో **రాహుల్ గాంధీ చేసిన ఉత్తేజపూరిత ప్రసంగం అటు అభయమిచ్చినట్లు, ఇటు కొంతవరకు ఆందోళన కలిగించినట్లు రెండు విధాలుగా ఉంది. ఈ ప్రసంగం కాంగ్రెస్ సమావేశంలో నైతే గట్టిగా ప్రతిధ్వనించి ఉండేది. అయితే, భారతదేశ సార్వభౌమత్వ, సామ్యవాద, లౌకిక, ప్రజాతంత్ర గణతంత్ర పరిరక్షణ కోసం విభిన్న సైద్ధాంతిక స్రవంతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 23 పార్టీలు ఒక్కటై వచ్చిన సమావేశంలో ఆయన ప్రసంగంలోని కొన్ని భాగాలు మాత్రం అసంబద్ధంగా ఉన్నవి.**

పూర్ణ స్వరాజ్ (సంపూర్ణ స్వాతంత్ర్యం) కాంగ్రెస్ అధికారిక లక్ష్యంగా మారిన తరువాత కాంగ్రెస్ ఒక ప్రతిఘటనా ఉద్యమంగా మారిందని రాహుల్‌గాంధీ చెప్పటం సరైందే. ఆ మేరకు 1927లో మద్రాస్ సమావేశంలో తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, రెండేళ్ళ తరువాత 1929లో లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో అది ఆమోదం పొందింది. తద్వారా కాంగ్రెస్ పార్టీ భారత స్వాతంత్ర్యోద్యమంలో నాయకత్వ స్థానంలోకి ముందుకు వెళ్ళగా, కమ్యూనిస్టులు, సోషలిస్టులు, ప్రస్తుత ఫూలే– అంబేద్కర్– పెరియార్ స్రవంతులు సైతం అందులో ఇతర ప్రధాన భాగస్వాములుగా ఉన్నారు. 1921లో అహ్మదాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో తొలిసారిగా మౌలానా హస్రత్ మొహానీ, స్వామి కుమారానంద అనే ఇద్దరు కమ్యూనిస్టు ప్రతినిధులు పూర్ణ స్వరాజ్య భావనను తొలిసారిగా వ్యక్తం చేసిన విషయాన్ని మనం మరవరాదు. భగత్‌సింగ్, ఆయన ఇతర సహచరులు 1928లో హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా స్పష్టంగా, నిర్భీతిగా సైద్ధాంతిక ప్రకటన వెలువడింది.

### నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం

స్వాతంత్ర్యోద్యమానికి దూరంగా ఉన్న, తరచూ వ్యతిరేకించిన ఏకైక సైద్ధాంతిక స్రవంతికి, పోరాటం ద్వారా భారత స్వాతంత్ర్యాన్ని సాధించిన విభిన్న సైద్ధాంతిక స్రవంతులకు మధ్య నేడు పోరాటం జరుగుతోంది. తమ సైద్ధాంతిక ఎజెండాను ముందుకు తీసుకెళ్ళే విధంగా ప్రభుత్వ వ్యవస్థలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నిర్మాణాన్ని మార్చాలని కోరుకుంటున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) — బిజెపికి సంబంధించిన హిందూత్వ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పునఃసమీకృతమైన శక్తులకు ఇండియా కూటమి ప్రాతినిధ్యం వహిస్తోంది.

బిజెపికి 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అమలుకు అధికారం లభిస్తే, ఏ ఇతర రాజకీయ పార్టీలకన్నా కాంగ్రెస్ పార్టీకి జరిగే నష్టం తక్కువేమీ కాదు. నిజానికి కాంగ్రెస్ మరింత దుర్బలమైనదని తరచూ నిరూపించబడింది. **పూర్తిస్థాయి ఫాసిస్టు దాడి, సైద్ధాంతిక దాడి జరుగుతున్న ప్రస్తుత తరుణంలో స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఉజ్వల అధ్యాయాల కలిగిన మనలోని ఏ పార్టీకి ఎలాంటి సమీకృతమైన సైద్ధాంతిక కవచం, లేదా రక్షణ ఉండబోదు. నిన్న మొన్నటి వరకు కాంగ్రెస్‌లో ఉన్న నాయకులతో బిజెపి నిండిపోయింది.** బిజెపిని ప్రతిఘటించాల్సిన ఆవశ్యకతను రాహుల్‌గాంధీ నొక్కి చెబుతున్నప్పటికీ, తెలంగాణలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి మాత్రం వివాదాస్పదమైన కూల్చివేతల పర్వాన్ని సమర్థించుకునేందుకు హిట్లర్‌ను గర్వంగా గుర్తు చేసుకుంటున్నారు.

ఒకవేళ వ్యవస్థలను స్వాధీన పరుచుకుంటే, ఓటర్ల జాబితాల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటించే వరకు ఎన్నికల వ్యవస్థను దుర్వినియోగపరిస్తే, భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాతంత్ర గణతంత్రం అని చెప్పే రాజ్యాంగాన్ని వారసత్వంగా పొందిన ప్రజలకు ఇంకా ఏ ప్రత్యామ్నాయం మిగిలి ఉంటుంది? దీనికి జవాబు ప్రతిఘటన మాత్రమేనని రాహుల్‌గాంధీ చేసిన వాదన అత్యంత వాస్తవమైనది. అయితే, అది చెదురుమదురుగా లేదా సంకేతాత్మక వ్యతిరేకత మాదిరిగా కాకుండా, విస్తృత ప్రాతిపదికన, నిర్దిష్టమైన ప్రజాస్వామ్య ప్రతిఘటనగా ఉండాలి.




### న్యాయమైన గణతంత్రం దిశగా

దేశానికి, విశాల ప్రజానీకానికి వినాశకరంగా నిరూపితమైన విధానాలను ఇక ఏమాత్రం మనం భరించలేము. భారతదేశ వనరులను గుప్పెడు కార్పొరేషన్‌లకు బదిలీ చేసి, జనసమూహాలను పేదరికంలోకి నెట్టేవేసే, పర్యావరణాన్ని ధ్వంసం చేసే ఆశ్రిత పెట్టుబడిదారి ఆర్థిక నమూనా పోవాల్సిందే. అమెరికా క్షిపణులకు భారతీయ నావికులు బలైనప్పటికీ, అమెరికా – ఇజ్రాయెల్ దురాక్రమణ కూటమికి భారతదేశ స్వయంప్రతిపత్తిని తాకట్టు పెట్టిన విదేశాంగ విధానం తక్షణమే మారాల్సిన అవసరం ఉంది. ఆదివాసీ భూములు, అటవీ హక్కులపై దాడులు, వారి రాజ్యాంగ రక్షణలను లాగేసుకునే యత్నాలు తప్పక ఆగిపోవాలి. బుల్‌డోజర్‌లను, ఎన్‌కౌంటర్‌లను గొప్పగా చూపిస్తూ, అసమ్మతిని నేరంగా మార్చేసిన పరిపాలన నమూనాకు ప్రజాస్వామ్య గణతంత్రంలో స్థానం లేదు. అదే స్థాయిలో, మతపరమైన ఆధిపత్యం, వెలివేత ద్వారా జాతీయతను నిర్వచించే సాంస్కృతిక జాతీయవాద సిద్ధాంతాన్ని తప్పక తిరస్కరించాలి. చివరగా, విశ్వసనీయత, పారదర్శకతలను త్యజించిన ఎన్నికల వ్యవస్థను తక్షణమే, సమగ్రంగా సంస్కరించాలి.

నిజానికి ఇప్పటికే ఇలాంటి ప్రతిఘటన మొదలైంది. 2014లో భూసేకరణ ఆర్డినెన్స్‌ను వదిలి వేసేలా, ఏడేళ్ళ తరువాత మూడు సాగు చట్టాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం వెనక్కితీసుకునేలా రైతులు చేయగలిగారు. రాజ్యాంగ విలువలకు వ్యతిరేకమని అనేకమంది భావించిన పౌరసత్వ (సవరణ) చట్టానికి (సిఎఎ) వ్యతిరేకంగా 2019లో షహీన్‌బాగ్ నేతృత్వం వహించిన ఉద్యమం జాతీయస్థాయి వ్యతిరేకతను రాజేసింది. ఈ మధ్య కాలంలో పెరుగుతున్న పనిభారం, తగ్గుతున్న వేతనాలకు వ్యతిరేకంగా ఉత్తర భారతదేశంలో జరిగిన కార్మికుల నిరసనలు పెరుగుతున్న ఆర్థిక దురవస్థలను ఎత్తిచూపింది. నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యుఐ) మొదలు లేదా ఎఐఎస్‌ఎ, ఎస్‌ఎఫ్‌ఐ తదితర వామపక్ష విద్యార్థి సంఘాలు లేదా కొత్తగా డిజిటల్ లక్షణంగా ముందుకు వచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నాయకత్వంలో విద్యార్థుల ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఇవి విద్య, పరీక్షా వ్యవస్థలో గంభీరమైన సంక్షోభంపై జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

ఇందుకు ప్రజలు చెల్లించుకున్న మూల్యాన్ని మనం గుర్తించాలి. ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చారిత్రాత్మక రైతు ఆందోళన సందర్భంగా 700 మందికి పైగా రైతులు మరణించారు. ఫాదర్ స్టాన్ స్వామి కస్టడీలో చనిపోయారు. ఎల్గార్ పరిషద్, సిఎఎ నిరసనలకు సంబంధించిన సురేందర గాడ్లింగ్, ఉమర్ ఖాలీద్, షర్జీల్ ఇమామ్ వంటి ఉద్యమకారులు ఏళ్ళ తరబడి జైళ్లలో కొట్టుమిట్టాడుతున్నారు. కనీస హక్కులు, మెరుగైన వేతనాలు డిమాండ్ చేసినందుకు కార్మికులు, ఉద్యమకారులు నిర్బంధాలను ఎదుర్కొంటున్నారు. ఎలాంటి స్పష్టమైన వివరణ లేకుండా జాతీయ భద్రతా చట్టం కింద నిర్బంధించబడిన ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ , అనేక మాసాల తరువాత విడుదల కావడం అరుదైన మినహాయింపు. జర్నలిస్టులు సైతం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్నారు. ప్రబీర్ పురకాయస్థ సుదీర్ఘ న్యాయ పోరాటం తరువాత ఊరట పొందారు.

**ప్రజల్లో కనబడుతున్న ధైర్యం, పట్టుదలల కు భిన్నంగా బెదిరింపులు, ఒత్తిళ్ళు లేదా అధికార ప్రలోభాల కారణంగా చీలికలు లేదా అంతర్గత విచ్ఛితి చెందడం వంటి కలవరపాటుకు గురిచేసే స్థితి రాజకీయ పార్టీల్లో నెలకొంది. ప్రతిఘటనను నిర్మించటంపై మాట్లాడే సమయంలో మనం ఎంత వినయంగా ఉండాలనేది ఇది గుర్తు చేస్తుంది.** ఇటువంటి పోరాటాలను కలుపుకొని, ప్రజల్లో కుతకుతమంటున్న ఆగ్రహం, ఆకాంక్షలు, వీడిపోయిన భ్రమలను ఉపయోగించుకొని, న్యాయం కోసం చేసే డిమాండ్‌లను విస్తృత పరచి, ప్రజాస్వామ్యం కోసం ఉమ్మడి పోరాటాన్ని బలోపేతం చేయడమే ఇండియా కూటమి ఎదుట ఉన్న సవాలు.

### ప్రతిపక్షాన్ని పునరుత్తేజపరచటం

సమాన పౌరసత్వంకోసం ప్రచారం, చారిత్రక రైతుల ఉద్యమం అనే రెండు వరుస శక్తిమంతమైన పోరాటాల ప్రభావం, భారత్ జోడో యాత్ర సందేశం, బిజెపికి 2020లో బిహార్‌లో తృటిలో తప్పిన ఓటమి, పశ్చిమ బెంగాల్(2021), కర్నాటక (2023)లో పరాజయాలు వంటి వరుస ఎన్నికల ఫలితాలు.. 2023లో ఇండియా కూటమి ఆవిర్భావానికి ఆదర్శవంతమైన నేపథ్యాన్ని సృష్టించాయి. జనతాదళ్ (యునైటెడ్), రాష్ట్రీయ లోక్‌దళ్ బైటికి వెళ్ళిపోయినప్పటికీ, పశ్చిమ బెంగాల్, కేరళ, పంజాబ్ రాష్ట్రాలలో ఎన్నికల సమన్వయం లేకపోయినప్పటికీ 2024లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎను ఇండియా కూటమి దాదాపు ఓటమి అంచులకు తీసుకెళ్ళింది. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కొంతవరకు బిహార్ ఫలితాలు ఇండియా కూటమి సామర్థ్యాన్ని చాటిచెప్పటమే కాకుండా కాంగ్రెస్ సంఖ్యను 100 సీట్లకు, కూటమి మొత్తం బలాన్ని 234కు పెంచాయి.

నాటినుంచి 2024లో మహారాష్ట్ర, హర్యానాలలో ఓటములతో మొదలై, 2025లో ఢిల్లీలో పరాజయంతో ఎన్నికల ఎదురుదెబ్బలు ఇండియా కూటమి శక్తిని, ప్రభావాన్ని క్షీణింపజేశాయి. ఈ తిరోగమనాలు, బహుముఖ ఎన్నికల మోసాలు భారత ఎన్నికల ప్రజాస్వామ్యం అవశేషాలపై బిజెపి పట్టును మరింత బిగించాయి. **ఇండియా కూటమికి కచ్చితంగా కొత్త ఊపు, సమూల మార్పు అవసరం. దీనికి కాంగ్రెస్ పునరుత్తేజీకరణతో పాటు, పరస్పర మర్యాద, విశ్వాసం ఉండేలా చూడటం, వైవిధ్య చరిత్రలు, సైద్ధాంతిక ధోరణులు కలిగిన పార్టీలను సర్దుబాటు చేసుకునే విస్తృత ఇండియా వేదిక కోసం దోహదకారిగా రాహుల్‌గాంధీ కీలకమైన రెండు పాత్రలను పోషించాలి.** భారతదేశం ఒక దేశంగా భిన్నత్వంలో ఏకత్వం ఆధారంగా లేదా దాని ద్వారానే ఎదిగినప్పుడు, ఒక రాజకీయ కూటమిగా 'ఇండియా'కు ఇదే సూత్రం వర్తిస్తుంది.

**సౌజన్యంః 'ది హిందూ' దినపత్రిక, (15.6.2026)**

# 'మా వాడలో మా రాజ్యం'

చరిత్రలో అత్యంత ప్రమాదకరమైన విషయం అన్యాయం కాదు. అన్యాయాన్ని సహజమని నమ్మడం. అత్యంత విషాదకరమైన విషయం పేదరికం కాదు. పేదరికాన్ని విధి అనీ అంగీకరించడం..అత్యంత పెద్ద రాజకీయ సమస్య అధికారం లేకపోవడం కాదు. అధికారం మనకోసం కాదని తరతరాలుగా నమ్మించడం. అందుకే కొన్ని నినాదాలు ఎన్నికలకోసం పుట్టవు. అవి ఒక సమాజం తన గురించి తాను తిరిగి ఆలోచించడం ప్రారంభించినప్పుడు పుడతాయి. 'మా వాడలో మా రాజ్యం' కూడా అలాంటి ప్రశ్నే. ఇది కేవలం పాలకులను మార్చే కోరిక కాదు. పాలితుల మనస్తత్వాన్ని మార్చే ప్రయత్నం. మనోవిజ్ఞాన శాస్త్రం (psychology) చెబుతున్న ఒక లోతైన సత్యం ఏమిటంటే ఏ అణిచివేత అయినా ముందుగా మనిషి మనసులో స్థిరపడుతుంది. తర్వాతే అది సమాజం లో వ్యవస్థగా మారుతుంది. చాలాకాలం పాటు అంచుల్లోకి నెట్టివేయబడిన వర్గాలు ఒక దశలో తమ స్థితిని సహజంగా భావించడం ప్రారంభిస్తాయి. అదే అణిచివేతయొక్క అత్యంత ప్రమాదకర రూపం. ఎందుకంటే అక్కడ సంకెళ్లు చేతులకు ఉండవు. ఆలోచనలకు ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో పుట్టే రాజకీయ నినాదాలు కేవలం అధికారాన్ని అడుగవు. ముందుగా ఆత్మవిశ్వాసాన్ని తిరిగి కోరుకుంటాయి. అందుకే 'మా వాడలో మారాజ్యం' అనే భావనను కేవలం రాజకీయ అధికార కోరికగా అర్థం చేసుకోవడం సరిపోదు. ఇది ప్రాతినిధ్యం గురించిన ప్రశ్న. నిర్ణయాలు తీసుకునే చోట మన ఉనికి ఉందా లేదా అనే ప్రశ్న. మనగురించి మాట్లాడేవారు ఉన్నారు; కానీ మనతో మాట్లాడేవారు ఎంతమంది ఉన్నారు అనే ప్రశ్న. ప్రజాస్వామ్యం యొక్క అసలు పరీక్ష కూడా ఇక్కడే ఉంటుంది. ఎన్నికలలో ఓటు వేయడం ఒక భాగం మాత్రమే. నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం కావడం మరొక భాగం.

చరిత్రను పరిశీలిస్తే ఒక ఆసక్తికరమైన విషయం కనిపిస్తుం ది. పెద్ద మార్పులు ఎప్పుడూ సంఖ్యలవల్ల జరుగలేదు. ఆ సంఖ్యలు తమ ఉమ్మడి అనుభవాన్ని గుర్తించినప్పుడు మాత్రమే మార్పు జరిగింది. బాధ ఒకటే కావచ్చు. కానీ ఆ బాధకు రాజకీయ భాష దొరికినప్పుడే అది ఉద్యమంగా మారుతుంది. ఆకోణంలో చూస్తే 'మా వాడలో మా రాజ్యం' అనే నినాదమొక రాజకీయ ప్రకటన కంటే ఎక్కువ. అది ఒక సామాజిక ప్రశ్న. ఒక చారిత్రక అసంతృప్తికి దొరికిన భాష. ఈ సందర్భంలో 1997 సంవత్సరంలో మారోజు వీరన్న ఏర్పాటుచేసిన CPUSI (ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ)లో గత 20 సంవత్సరాలుగా ఆ పార్టీలో నిజాయితీగా పనిచేస్తున్న ప్రముఖ కవిగాయకుడు, అధ్యయనశీలి, ఉద్యమకారుడు, యువ మేధావి డాక్టర్ గుడిపెల్లి రవి జోక్యం గమనించదగ్గది. ఎందుకంటే ప్రతి ఉద్యమానికి రెండు కాళ్ళు అవసరం. ఒకటి ప్రజల అనుభవం. రెండో ది ఆ అనుభవానికి దిశనిచ్చే ఆలోచన. వీధిలో వినిపించే ఆవేదనకు ఒక రాజకీయ అర్థం ఇవ్వడం, విడివిడిగా ఉన్న అనుభవాలను ఒక సామూహిక చర్చగా మార్చడం, సంఖ్యలను సామాజిక శక్తిగా చూడడం. ఇవి కేవలం నినాదాలతో సాధ్యం కావు. వాటికి ఆలోచన, అధ్యయనం, సంభాషణ అవసరం అని గుర్తించిన వ్యక్తి. అయితే ఇక్కడ ఒక తాత్విక హెచ్చరిక కూడా ఉంది. 'మా రాజ్యం అంటే కేవలం మనవాళ్ళు అధికారంలోకి రావడం మాత్రమే కాదు, చాలాసార్లు పాలకులు మారారు కానీ పాలనా సంస్కృతి మారలేదు. అందుకే అసలు ప్రశ్న'ఎవరు పాలిస్తున్నారు? కాదేమో'ఎలా పాలిస్తున్నారు'?అనేదే. గౌరవం, సమానత్వం, భాగస్వామ్యం అనే విలువలు అధికారంలో ప్రతిబింబించకపోతే, నినాదాలు మారినా జీవితాలు మారవు.

చివరికి 'మా వాడ లో మా రాజ్యం' అనే నినాదం యొక్క బలం దాని పదాల్లో లేదు. అది మనుషులలో రేపే ఆత్మగౌరవంలో ఉంది. తన జీవితానికి విలువ ఉందని ఒక వ్యక్తి భావించినపుడు, తన భవిష్యత్తును తానే నిర్మించగలనని ఒక తరం నిర్ణయించుకున్నప్పుడు, అక్కడినుండే అసలు మార్పు ప్రారంభమవుతుంది. ఎందుకంటే చరిత్ర చివరికి ఒక ప్రశ్న అడుగుతుంది 'మీరు ఎంతమంది ఉన్నారు? అనికాదు. 'మీ సంఖ్యను సామాజికంగా మార్చుకోగలరా? అని. ఈ ప్రశ్నకు సమాధానం వెతికే ప్రతి ప్రయాణం సంఖ్యలనుంచి శక్తిగా మారే ప్రయాణమే.

ఆయిరబోయిన బిక్షపతి
(అగల్ జోయా)
7993248717




# పేదలపై భారం మోపడమేనా.. వికసిత్ భారత్?

- కార్మిక హక్కులు కాలరాస్తున్న మోదీ సర్కార్
- పేదలకు, కూడు, గూడు, బట్ట కల్పించటమే సిపిఐ లక్ష్యం
- కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులు తిప్పికొట్టాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/ సిద్దిపేట :** పేదలకు కూడు, గూడు, బట్ట కల్పించటమే లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందని సిపిఐ మాజీ శాసనసభ పక్షనేత, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ పేరిట ప్రగల్భాలు పలుతున్నారన్నారు. బడా పారిశ్రామికలకు రెడ్ కార్పెట్ పరిచి దేశ సంపదను కట్టబెడుతూ..పేద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపటమేనా వికసిత్ భారత్ అని సూటిగా ప్రశ్నించారు. బడా పారిశ్రామిక వెత్తలకు రూ.14లక్షల కోట్లు రుణామాఫీ చేసాడని, దీంతో ప్రపంచంలో కోటీశ్వరులుగా ఎదిగారన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో శక్తిగార్డెన్‌లో ఎఐటియుసి జిల్లా 4వ మహాసభలకు చాడ వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే కార్మికుల హక్కుల సాధన లక్ష్యంగా ఎఐటియుసి ఆవిర్భవించిందన్నారు. దేశ స్వాతంత్ర్యం, తెలంగాణ సాయుధ పోరాటంలో ఎఐటియుసి కీలక పాత్ర పోషించదన్నారు. ప్రధానిమోదీ కార్మిక వ్యతిరేకి అని.. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను మోదీ కాలరాశడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నాలుగు కోడ్‌లకు కుదించారని విమర్శించారు. పెట్రోల్, డిజిల్ ధరల పెంపుతో నిత్యవసర ధరలు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడిందన్నారు.అమరవీరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. రాష్టానికి మెట్రో ఫేజ్ 2 నిధుల మంజూరులో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టవద్దన్నారు. రాష్ట్రాభివృద్ధికి అందరూ కలసివచ్చి కృషిచేయాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైపల్యాలపై సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను పోరాటాల ద్వారా కార్మికవర్గం తిప్పికొట్టాలని చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బాలరాజు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకై 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన ఎఐటియుసి కార్మిక వర్గం కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న ఏకైక సంస్థ అన్నారు. కార్మికుల కనీస వేతనం, ఎనిమిది గంటల పనివిధానంపై పోరాటం చేసి సాధించిన ఘనచరిత్ర ఏఐటియుసికే దక్కిందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మగాంధీ పేరునుతొలగించి బిజెపి ప్రభుత్వం విబిజీ రామ్ పథకాన్ని తీసుకొచ్చేయత్నం చేసిందన్నారు. కేంద్రం గతంలో 90శాతం నిధులు చెల్లిస్తే, రాష్ట్ర ప్రభుత్వం40శాతం నిధులను భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులకు శాపంగా మారిన రాంజీ పథకాన్ని రద్దు చేసి మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెట్రోల్,డిజిల్ వంట గ్యాస్ ధరలను తగ్గించి, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఆది రంగారెడ్డి, ప్రధానకార్యదర్శి కిష్టపురం లక్ష్మ ణ్, రాష్ట్ర సమితి సభ్యులు కనుకుంట్ల శంకర్,సిపిఐ జిల్లాకార్యదర్శి గడిపే మల్లేశ్,జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద్ రెడ్డి. అందే అశోక్, ఎడల వనేశ్, ఏఐటియుసి జిల్లా నాయకులు శివలింగు, కృష్ణ. తవుసుపల్లి బిక్షపతి, కర్నాల చంద్రం, పిట్టల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో ఎఐటియుసి భారీ ర్యాలీ

సిద్దిపేట జిల్లా ఎఐటియూసి 4వ మహాసభలను పురస్కరించుకొని స్థానిక మోడ్రన్ బస్టాండ్, శక్తి గార్డెన్ వరకు ఎఐటియుసి కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో ఎఐటియుసి కార్మికులు ఎర్ర జెండాలతో నినాదాలు చేస్తూ కదం తొక్కారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బాలరాజు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి. సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్. ఎఐటియుసి కార్మికులు అంబేద్కర్ చౌరస్తా నుండి హైదరాబాద్ రోడ్డు మీదుగా శక్తి గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు దారి పోడవున ఎఐటియుసికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్, కిష్టపురం లక్ష్మ ణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.






## ‘అమెరికన్ కాన్సులేట్ రోడ్డు’కు ట్రంప్’ పేరు పెట్టాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

**వామపక్ష పార్టీలు డిమాండ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ‘అమెరికన్ కాన్సులేట్ రోడ్డు’కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరును ప్రతిపాదించడాన్ని నిరసిస్తూ ఈ నెల 20న(జూన్)ఉదయం 10గంటలకు హైదరాబాద్,బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో వామపక్ష నాయకులు, ప్రగతిశీల మేధావులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వామపక్ష పార్టీలు ప్రకటించాయి. ఈ నెల(జూన్) 21న ఉదయం 10 గంటలకు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టనున్నట్టు వెల్లడించాయి. హైదరాబాద్‌లోని ఎం.బి భవన్‌లో బుధవారం వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు డి.జి నరసింహారావు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాదినేని వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు రమ, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఆర్ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ఎస్‌యుసిఐ(సి) హైదరాబాద్ జిల్లా కార్యదర్శి తేజతో పాటు బండారి రవికుమార్, సూర్యం తదితరులు పాల్గొన్నారు. ‘డోనాల్డ్ ట్రంప్’ పేరు పెట్టాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలు, ఆధిపత్య రాజకీయాలను ప్రోత్సహిస్తున్న ట్రంప్ పేరును హైదరాబాద్ నగరంలోని రోడ్డుకు పెట్టడం ప్రజాస్వామ్య, ప్రగతిశీల విలువలకు విరుద్ధమని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వామపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. ట్రంప్ ప్రపంచ దేశాలపై ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఇరాన్, క్యూబా, వెనిజులా వంటి దేశాల విషయంలో ఆయన విధానాలు ప్రజాస్వామ్య వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. అలాంటి వ్యక్తి పేరును హైదరాబాద్ నగరంలోని రోడ్డుకు పెట్టడం సమర్థనీయం కాదన్నారు.

## తెలంగాణ యువతకు అంతర్జాతీయ విద్యావకాశాలపై చర్చ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువతకు ప్రపంచ స్థాయి విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రతిష్ఠాత్మక చిచెస్టర్ విశ్వవిద్యాలయం ప్రతినిధులతో యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యా సహకారం, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, ఉన్నత విద్యా అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం మరియు చిచెస్టర్ విశ్వవిద్యాలయం మధ్య విద్యా, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పరస్పర సహకార అవకాశాలను పరిశీలించారు. రాష్ట్ర యువత అంతర్జాతీయ స్థాయి విద్యను అందిపుచ్చుకుని ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌లో పోటీపడేలా భాగస్వామ్య కార్యక్రమాలు రూపొందించాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రతినిధులు తమ విద్యా కార్యక్రమాలు, పరిశోధన అవకాశాలు, అంతర్జాతీయ విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ప్రత్యేక పథకాలు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాల గురించి వివరించారు.



## డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలి

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ,అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పేదలు కూడా సన్న బియ్యం తినాలని, రైతులను ఆర్థికంగా ఆదుకోవాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు హాజరయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు తదితర అంశాలపైన చర్చించారు. ఈ సందర్భంగా రైతులకు లాభదాయకమైన బిపిటి 5204, తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్15048), కెఎన్ఎం 1638, జై శ్రీరామ్, హెచ్ఎంటి రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆయా పంటలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉండడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని కమిషన్ తెలిపింది. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్య పరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని తెలిపింది. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ కమిషన్ కేబినెట్ సబ్ కమిటీకి నివేదించింది. ఈ సమావేశంలో కమిషన్ చైర్మెన్ ఎం.కోదండరెడ్డి, సీడ్ కార్పోరేషన్ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జాతీయ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ‘ఇందిరమ్మ ఇండ్ల’ మంజూరులో గుడిసెవాసులకే మొదటి ప్రాధాన్యం

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో రెండవ విడత ‘ఇందిరమ్మ ఇండ్ల’ మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసిన తర్వాతనే ఇతర దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, వార్డు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గుడిసెలను యుద్ధప్రాతిపదికన గుర్తించేందుకు సమగ్ర సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత అమలు, గుడిసెల గుర్తింపు, రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం, అసంపూర్తి గృహాల వివరాల సేకరణ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. రాష్ట్రంలో ఒక్క నిరుపేద కుటుంబం కూడా గుడిసెల్లో జీవించకుండా, ప్రతి కుటుంబం సురక్షితమైన సొంత ఇంట్లో గౌరవప్రదంగా జీవించేలా చూడడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. రెండవ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండువేల చొప్పున ఇండ్లను మంజూరు చేసిన క్రమంలో పూర్తి పార దర్శకతతో అర్హుల ఎంపికను చేపట్టాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నట్టు దరఖాస్తు చేసుకున్నారని, ఆ దరఖాస్తులన్నింటినీ ప్రత్యక్షంగా పరిశీలించి, అందులో వాస్తవ అర్హులను గుర్తించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ఎంపిడిఒ స్థాయిలో అర్హుల జాబితాను సిద్ధం చేసి, సంబంధిత ఇన్‌చార్జ్ మంత్రుల ఆమోదానికి పంపించాలని సూచించారు. బిఎల్‌సి (బెనిఫిషియరీ లెడ్ కన్స్ట్రక్షన్) విధానంలో లబ్ధిదారుడే తన ఇంటిని నిర్మించుకునే అవకాశం కల్పించామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో స్థలాల కొరతను దృష్టిలో పెట్టుకొని చిన్న స్థలాలు కలిగిన లబ్ధిదారులకు అవసరాన్ని బట్టి గ్రౌండ్ ప్లస్ వన్ నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో గుడిసెల్లో నివసిస్తూ గతంలో ప్రజాపాలన లేదా ఇతర కార్యక్రమాల్లో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని నిరుపేద కుటుంబాలు ప్రస్తుతం స్థానిక ఎంపిడిఒ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అటువంటి దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి అవకాశం కల్పిస్తామన్నారు.

### రూఫ్ రీప్లేస్మెంట్ పథకానికి ప్రత్యేక ప్రాధాన్యత

పేదల నివాస భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెండో విడతలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఇళ్లను ఈ పథకం కింద ఎంపిక చేస్తామన్నారు. గోడలు, పునాదులు బలంగా ఉన్నప్పటికీ పైకప్పులు టార్పాలిన్ షీట్లు, రేకులు, నాపరా ళ్లు లేదా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పైకప్పుల కింద నివసిస్తూ ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను కూడా గుర్తించి, వారికి ఆర్‌సిసి స్లాబ్ నిర్మాణానికి రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తామని వివరించారు. గతంలో వివిధ గృహ నిర్మాణ పథకాల కింద మంజూరై ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. పాత ఇందిరమ్మ పథకం కింద మంజూరై బేస్‌మెంట్ స్థాయి లేదా పైకప్పు స్థాయిలో నిలిచిపోయిన ఇళ్లను కూడా ఈ పథకంలో చేర్చవచ్చున్నారు. గృహలక్ష్మి పథకం కింద నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయిన గృహాలను కూడా గుర్తించి, రూఫ్ అప్‌గ్రేడేషన్ కార్యక్రమం ద్వారా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## సంక్షేమం దారి తప్పింది

- రాష్ట్ర ఆదాయం తగ్గి మంత్రుల ఆదాయం పెరిగింది
- వచ్చే ఎన్నికల్లో గెలుపు మనదే : కెటిఆర్



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** రాష్ట్రంలో సంక్షేమం ఆగమైందని అదే సందర్భంలో అభివృద్ధి పూర్తిగా ఆగి పోయిందని బిఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు, మాజీ మంత్రి కెటి రామారావు తెలిపారు. మంత్రులు రాష్ట్ర ప్రజల గురించి పట్టించుకోకుండా సొంత ఆదాయాల పెంపుపై దృష్టిసారించారని ఖమ్మం జిల్లాలో ఉన్నది ముగ్గురు మంత్రులు కాదని వారు మోసగాళ్లని ఆయన ఆరోపించారు. బుధవారం పాలేరు నియోజక వర్గం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని హర్ష ఫంక్షన్ హాల్‌లో జరిగిన పాలేరు నియోజక వర్గ బూత్ స్థాయి ప్రతినిధుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కెసిఆర్ అప్పు చేసి రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు నిర్మించడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేశారని కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిట్లర్ తనకు ఆదర్శమని చెబుతున్నారని అదే స్ఫూర్తితో రాష్ట్రంలో పేదల ఇండ్లను కూల్చివేస్తున్నారని కేటిఆర్ ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాన్ని మరిచి తమ ఆదాయాన్ని పెంచుకుంటూ స్వలాభాలకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో భూవివాదానికి సంబంధించి పొంగులేటి కుమారుడు ఉన్నాడని కేసు నమోదైతే అక్కడి పోలీస్ అధికారిని సైతం బదిలీ చేయించారని ఆయన తెలిపారు. ఆయన బిసి మంత్రులను, అధికారులను లెక్కచేయడం లేదని ఉన్నతాధికారులను సైతం నాన్సెన్స్ అంటూ వ్యాఖ్యానిస్తున్నారని కెటిఆర్ తెలిపారు. కాంగ్రెస్ మీద వ్యతిరేకతతో కాకుండా పార్టీ సంస్థాగతంగా బలపడటం ద్వారా అధికారంలోకి రావాలని కెటిఆర్ సూచించారు. ప్రతి కార్యకర్త సైనికులా పని చేయాలని కోరారు. సర్‌కు సంబంధించి డిజిటల్ ప్రదర్శన ద్వారా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, ఉమ్మడి జిల్లా ఇంచార్జి తక్కెళ్లపల్లి రవీంద్రరావు, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు కందాళ ఉపేందర్‌రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఫెమా ఉల్లంఘనల కేసులో అపోలో హాస్పిటల్స్‌కు జరిమానా

**రూ.17.76 కోట్ల కాంపౌండింగ్ ఫీజు విధించిన ఆర్‌బిఐ..**

**ఐదుగురు డైరెక్టర్లపై కూడా చర్యలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) భారీ జరిమానా విధించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దర్యాప్తు అనంతరం, ఆర్‌బిఐ ఫెమా చట్టంలోని సెక్షన్15 ప్రకారం కాంపౌండింగ్ ఆర్డర్ జారీ చేసి కంపెనీపై రూ.17.76 కోట్ల కాంపౌండింగ్ ఫీజు విధించింది. అలాగే సంస్థకు చెందిన ఐదుగురు డైరెక్టర్లు, అధికారులపై ఒక్కొక్కరికి రూ.18 లక్షల చొప్పున జరిమానా విధించింది.ఈ మేరకు ఇడి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఫెమా నిబంధనల ఉల్లంఘనలపై ఇడి దర్యాప్తు చేపట్టి, అనంతరం అడ్జుడికేటింగ్ అథారిటీ ముందు ఫిర్యాదు దాఖలు చేసింది. తర్వాత అపోలో హాస్పిటల్స్ ఆర్‌బీఐని ఆశ్రయించి కాంపౌండింగ్‌కు దరఖాస్తు చేసుకోగా, ఇడి నుంచి ‘నో అబ్జెక్షన్‘ లభించిన నేపథ్యంలో ఆర్‌బిఐ తుది నిర్ణయం తీసుకుంది.దర్యాప్తులో కంపెనీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించారు. రిటైల్ ట్రేడింగ్ రంగంలో ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ పెట్టుబడులు స్వీకరించడం, ఫారిన్ కరెన్సీ కన్వర్టిబుల్ బాండ్స్ (ఎఫ్‌సిసిబి) జారీ చేయడం, ఎఫ్ఐఐపిఐఎస్ మార్గంలో అనుమతించిన పరిమితికి మించి విదేశీ పెట్టుబడులు పొందడం, అలాగే విదేశీ వాటాదారుల పరిమితి 51 శాతాన్ని మించటం వంటి ఉల్లంఘనలు జరిగినట్లు ఇడి వెల్లడించింది. ఈ కేసులో అపోలో హాస్పిటల్స్ చైర్‌పర్సన్ ప్రీతా రెడ్డి, సునీత రెడ్డి, ఎస్.కే. వెంకటరామన్, అఖిలేశ్వరన్ కృష్ణన్, ఎస్ఎం కృష్ణన్‌ల పేర్లు ప్రస్తావించబడ్డాయి. కాంపౌండింగ్ ఫీజు చెల్లింపుతో కంపెనీపై కొనసాగుతున్న అడ్జుడికేషన్ ప్రక్రియలు, తదుపరి న్యాయపరమైన చర్యలు ముగిసినట్లు ఆర్‌బిఐ ఉత్తర్వుల్లో పేర్కొంది.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, కాప్రా సర్కిల్-7, ఎంఎంసి.
‘ఇ’-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

NIT.No. MMC/KC-7/E/5/2026-27, Date: 16.06.2026

క్ర.సం.1, NIT.No. MMC/KC-7/E/5/2026-27, తేది: 16.06.2026, పని పేరు: ఎంఎంసి, కాప్రా సర్కిల్-7లో నిర్వహణ పనులు (మొత్తం 3 సంఖ్యలు), మొత్తం విలువ: రూ.22.67 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 17.06.2026 మ.3.00గం.లకు, బిడ్ దాఖలుకు ఆఖరి తేది: 20.06.2026 మ.3.00గం.ల వరకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 20.06.2026 మ.3.00గం.ల వరకు, ప్రైస్ బిడ్ ప్రారంభ తేది: 20.06.2026 మ.3.01గం.లకు. అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కాప్రా సర్కిల్-7, ఎంఎంసి, ఇసిఐఎల్, హైదరాబాద్. సెల్ నెం. 8790374055. మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కాప్రా సర్కిల్-7, ఎంఎంసి.
DIPR R.O. No. : 4395-PP/CL/ADVT/2026-27, Date: 17-06-2026

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
hmda Growing Global
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.
TELANGANA RISING

HMDA Act. 2008లోని సెక్షన్ 15 (3) ప్రకారం బహిరంగ ప్రకటన
(Lr.No.SML0060012145309/CLU/Plg/TG-iPASS/HMDA/2026. dt: 23.05.2026)

HMDA చట్టం 2008లోని సెక్షన్ 15 యొక్క సబ్‌సెక్షన్-3 ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించి G.O.M.S No.33 MA&UD, dt : 24.01.2013 ద్వారా నోటిఫై చేయబడిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (HMR) కొరకు నోటిఫైడ్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్ (MDP) 2031లో భూవినియోగానికి ఈ క్రింది మార్పులు చేయడానికి ప్రతిపాదించబడింది.

**రంగారెడ్డి జిల్లా కొత్తూరు (మండలం), కొత్తూరు (గ్రామం) Sy.No.92/Pలో గల 12140.27 చదరపు మీటర్ల స్థలాన్ని ప్రస్తుతం G.O.Ms.No.33 MA&UD, Dt.24.01.2013ద్వారా నోటిఫై చేయబడిన మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్ MDP–2031లో రెసిడెన్షియల్ యూజ్ జోన్-1 (R1)గా కేటాయించారు. ఈ స్థలాన్ని ఇప్పుడు ‘గ్రీన్’ కేటగిరీ కింద నాన్ డైరీ విప్ టాపింగ్స్ బేకరీ ప్రీ మిక్చర్స్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి మాన్యుఫాక్చరింగ్ యూజ్ జోన్‌గా నియమించాలని ప్రతిపాదించారు.**

పైన తెలిపిన వాటికి సంబంధించిన వాటి వివరాలు వెబ్‌సైట్లు http://gazette.telangana.gov.in// and http://hmda.gov.in//.

సదరు ప్రతిపాదనలపై ఏ వ్యక్తి గానీ లేదా సంస్థ నుండి అభ్యంతరాలు / సూచనలు పరిగణలోకి తీసుకోబడతాయి. వారు ఈ నోటీస్ ప్రచురించబడిన తేదీ నుంచి **ఏడు (7) రోజులలోపు** మెట్రోపాలిటన్ కమిషనర్ హెచ్ఎండిఎ లేదా ప్రభుత్వ ప్రధానకార్యదర్శి MA&UD విభాగం, తెలంగాణ సచివాలయం హైదరాబాద్‌కు అభ్యంతరాలు లేదా సూచనలను వ్రాత పూర్వకంగా సమర్పించవచ్చు.

భవదీయుడు
సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (PR), HMDA.
DIPR R.O. No. : 4423-PP/CL/ADVT/2026-27, Date: 17-06-2026

**సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, STSQM (HQ), CMC, 4వ అంతస్తు,
సైబరాబాద్ మునిసిపల్ ఆఫీస్, మణికొండ-500 089.

RFQ No.01/SE/STSQM/CMC/2026-27, Dt : 17.06.2026

పారిశుద్ధ్య వస్తువుల సేకరణ కొరకు కొటేషన్లు పొందాలని CMC కోరుతున్నది. ఆసక్తి గల సంస్థలు నిర్దేశించిన ‘కొటేషన్ కోసం అభ్యర్థన ఫారం’లోని అంశాల కొరకు తమ పోటీ కొటేషన్లను సీల్డ్ కవర్ ద్వారా సూపరింటెండింగ్ ఇంజినీర్ (STSQM), సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ భవనం, 4వ అంతస్తు, మణికొండ వారి కార్యాలయానికి గానీ లేదా ఇ–మెయిల్: se.stsqm@gmail.com ద్వారా గానీ సమర్పించవలసిందిగా కోరనైనది.

| క్ర.సం. | ఐటెం స్పెసిఫికేషన్ | క్వాంటిటీ |
|---|---|---|
| 1 | కొబ్బరి చీపుర్లు | 1 సంఖ్య (ఒక్కో దానిలో 2 కేజీలు) |
| 2 | చెక్క హ్యాండిల్‌తో 2 ఇనుప పారలు | 1 సంఖ్య (ఒక్కొక్కటి 1.4 కేజీలు) |
| 3 | ఐరన్ స్క్రాపర్లు (22గేజ్ MS షీట్ దీర్ఘచతురస్రాకారంలో నలుపురంగులో పెయింటింగ్ చేయబడింది) | 1 జత |
| 4 | ప్లాస్టిక్ గమేలా (పెద్దది) 45సెం.మీ.డయామీటర్ | 1 సంఖ్య |
| 5 | డబుల్ వీల్ బారో 3 క్యూబిక్ ఫీట్ 85లీటర్ల సామర్థ్యం 18గ్రామ్స్ షీట్ L–34' X డీప్ 121/2' MS పైపుతో తయారుచేయబడిన బాక్స్ CMC మోనోగ్రామ్‌తో డెలివరీ అరేంజ్‌మెంట్, ఆలివ్ గ్రీన్ రంగు, హార్డ్ పాలిమర్ చక్రాలతో | 1 సంఖ్య |
| 6 | నిమ్మపొడి 50శాతం కాల్షియం | 1 బ్యాగ్ (ఒక్కోటి 25కేజీలు) |
| 7 | బ్లీచింగ్ పౌడర్ (ISI మార్క్ గ్రేడ్–1 కంటెంట్‌తో 33శాతం క్లోరిన్ | 1 బ్యాగ్ (ఒక్కోటి 25 కేజీలు) |
| 8 | ఇనుప కొడవలి టాటా బ్రాండ్ | 1 సంఖ్య |
| 9 | వెదురుకర్రలు (10అడుగుల పొడవు) | 1 సంఖ్య |
| 10 | ఇనుప గొడ్డళ్లు టాటా బ్రాండ్ 900 గ్రాములు | 1 సంఖ్య |
| 11 | ఇనుప క్రోబార్ 150సెం.మీ.పొడవు, టాటా బ్రాండ్ | 1 సంఖ్య |
| 12 | 40అడుగుల పొడవైన హ్యాండిల్ గల బరువైన, నాణ్యమైన లోహంతో తయారుచేయబడిన ఇనుప ఫోర్క్ | 1 సంఖ్య |
| 13 | చీపురు పుల్లలు (చెక్కతో చేసినవి) | 1 సంఖ్య |

RFQ షరతులు :
1. చెల్లుబాటు అయ్యే ఫర్మ్ రిజిస్ట్రేషన్, జిఎస్‌టి రిజిస్ట్రేషన్ మరియు పాన్ కార్డు ఉన్న తయారీదారులు /సరఫరాదారులు / ఏజెన్సీలు లేదా కాంట్రాక్టర్లు మాత్రమే RFQను సమర్పించడానికి అర్హులు.
2. CMC ద్వారా టెండర్లను పిలవడం కోసం సంస్థలు వర్తించే అన్ని పన్నులతో సహా తమ పోటీ ధరలను కోట్ చేయాల్సి ఉంటుంది. ఉదహరించిన ధరలను ధృవీకరించిన తర్వాత RFQను ఆమోదించే లేదా తిరస్కరించే హక్కు CMCకి ఉంటుంది.
3. కొటేషన్లను 22–06–2026న ఉదయం 11 : 00 గంటలకు లేదా ముందుగా సమర్పించాలి.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ STSQM, CMC
DIPR R.O. No. : 4448-PP/CL/ADVT/2026-27, Date: 17-06-2026

ప్రజాపక్షం
Telugu National Daily

మహబూబ్‌నగర్
గురువారం
18-06-2026
www.prajapaksham.in

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల



## అనాథ విద్యార్థులను విద్యకు దూరం కానివ్వం

**ప్రజాపక్షం/ మాగనూర్:** ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ విద్యార్థి చదువు ఆగకూడదన్న ఉద్దేశంతో ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ మానవతా కార్యకరమం చేపట్టింది. కొత్తపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న అనాథ విద్యార్థులను గుర్తించి, వారికి అవసరమైన స్కూల్ సామాగ్రి బుధవారం అందజేశారు. పివైఎల్ కోశాధికారి మల్లేష్ ఆధ్వర్యంలో నాయకులు వెంకటేష్, ఆనంద్, గణేష్, అంజి, వెంకటప్ప, పిల్లలకు డ్రెస్సులు, స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రగతిశీల యువజన సంఘం ఎప్పుడూ పేదల పక్షానే ఉంటుందని పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా మా సంఘం అన్ని విధాలా ఆదుకుంటుందని చదువులో, జీవితంలో ప్రతి అడుగులో మీకు తోడుగా ఉంటామని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రత, విద్యాభివృద్ధికి పెద్దపీట

**ప్రజాపక్షం/జడ్చర్ల :** విద్యార్థుల భద్రత విద్యాభివృద్ధికి పెద్దపీట వేశామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం జడ్చర్ల నియోజకవర్గంలోని రంగారెడ్డి గూడలో బడిబాట కార్యక్రమంలో పాల్గొని పదోతరగతి విజేతలకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సన్మానం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జెడ్‌పిహెచ్‌ఎస్‌లో 36 లక్షల రూపాయల ముడా నిధులతో నిర్మించనున్న నూతన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు నేడు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు.పాఠశాలల్లో ఇంకా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్‌టిఇ చట్టాన్ని అమలు చేయాలి




**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ప్రైవేట్ పాఠశాలల్లో విద్య హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని నారాయణపేట జిల్లా విద్య శాఖ అధికారి ఎం.గోవిందరాజుకి బిసి జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల కుర్మయ్యలు మెమోరాండం అందజేశారు. వెంకటేష్ యాదవ్ బిసి జాగృతి సేన నారాయణపేట జిల్లా అధ్యక్షులు ఎడ్ల కుర్మయ్యలు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలోని చాలా ప్రైవేట్ పాఠశాలల్లో విద్య హక్కు చట్టం ప్రకారం పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు కల్పించాల్సిన 25 శాతం ఉచిత ప్రవేశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్య హక్కు చట్టం నియమ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నిర్వహిస్తూ అధిక ఫీజులను వసూలు చేయడంతో పాటు, కనీస మౌలిక వసతులు కల్పించకుండా, పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లు కూడా అమ్ముతు వ్యాపారం చేస్తున్నారని, విద్య ప్రాథమిక హక్క అని, ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఏ విద్యార్థి కూడా నాణ్యమైన విద్యకు దూరం కాకుండా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఆర్టీఈ నిబంధనలను సక్రమంగా అమలు చేయడం లేదని, ఆట స్థలం లేకుండా మొదటి అంతస్తుల్లో తరగతులను నిర్వహిస్తున్నారని, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అన్ని ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి పర్యవేక్షించాలని, నిబంధరనలను ఉల్లంఘించిన విద్యసంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేన నారాయణపేట జిల్లా అధ్యక్షులు ఎడ్ల కుర్మయ్య, నియోజకవర్గం అధ్యక్షులు గణేష్, భగవంతు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌ల క్లెయిమ్స్ ఖాతలో వేయాలి



**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా నమోదు చేసుకున్న క్లెయిమ్స్ నెలలు గడుస్తున్న కార్మికుల ఖాతాలో నిధులు జమకాలేదని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ సత్వరమే కార్మికుల ఖాతాలో విధులు మంజూరు చేయాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బిఆర్‌ఎస్ అనుబంధం) కార్మిక సంఘం జిల్లా నాయకులు గంజిపేట రాజు డిమాండు చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భవన, ఇతర నిర్మాణ కార్మికుల బాధితులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంజిపేట రాజు మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. వారికి ఇవ్వవలసిన నిధులను ఇతర పథకాలకు మళ్లిస్తున్నారని అన్నారు. భవన, ఇతర నిర్మాణ రంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమను కనుపరుస్తున్నాయని, నిర్మాణ రంగ కార్మికుల శ్రమ మూలంగా జమ అవుతున్న కోట్ల రూపాయలను ప్రభుత్వాలు పక్కదారి పట్టిస్తున్నాయని దీని వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మిక చట్టం ప్రభుత్వ సూచనల ప్రకారం నమోదు చేసుకున్న వారికి లేబర డిపార్ట్‌మెంట్ గుర్తింపు కార్డులు ఇచ్చిందన్నారు. కార్మికురాలు నమోదైన కార్మికులు ఆడపిల్లలు (ఇద్దరికి) పెళ్లి కానుకగా, ప్రసుతి సహాయం కోసం నమోదు చేసుకుని నెలలు గడుస్తున్న కార్మికుల ఖాతాలో డబ్బులు జమ కాలేదన్నారు. ఇట్టి విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా సంక్షేమ బోర్డులోనే పెండింగులో ఉన్నాయి. అంటూ సమాధానం చెపుతూ వస్తున్నారని ఆరోపించారు. కావున పెండింగులో ఉన్న నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు బాధితులు, కార్మిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కొంకనీవానిపల్లి పాఠశాల అప్‌గ్రేడ్ చేయాలి



**ప్రజాపక్షం/ అమరచింత :** అమరచింత మండలం కొంకన్వాని పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్‌చేయాలనీ ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి. కుతుబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో కొంకనివానిపల్లె ప్రభుత్వ పాఠశాల దగ్గర విద్యార్థులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుతుబ్ మాట్లాడుతూ గ్రామంలో విద్యార్థులకు ఐదవ తరగతి నుండి ఏడో తరగతి వరకు పెంచుతూ ప్రాథమిక పాఠశాలను అప్గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రజా సంక్షేమమే ప్రజాపాలన లక్ష్యం

రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం
అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు





**ప్రజాపక్షం/వీపనగండ్ల :** గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా అధోగతి పాలై అప్పుల ఊబిలో చిక్కుకుపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం వీపనగండ్ల మండల పరిధిలోని గోపాల్‌దిన్నే, వీపనగండ్ల, పుల్గర్‌చర్ల గ్రామాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనాలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అలాగే ఇందిరమ్మ గృహాల లబ్దిదారులతో కలిసి గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాల్‌దిన్నే గ్రామ శివారులో సుమారు రూ.2.12 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన 33/11 కెవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం గోపాల్‌దిన్నేలో ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో రాష్ట్రానికి రూ.65 వేల కోట్ల అప్పులు మాత్రమే ఉండగా, బిఆర్‌ఎస్ పాలనలో రాష్ట్ర అప్పులు రూ.8 లక్షల కోట్లకు చేరాయాని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతి ఏడాది రూ.6,800 కోట్ల వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఉన్నప్పటికి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. గోపాల్‌దిన్నే గ్రామ శివారులోని సర్వే నెంబర్ 357 భూమికి సంబంధించిన సమస్యను త్వరలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చట్టబద్ధంగా అర్హులను గుర్తించి భూ పంపిణీ చేపడతామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాగే రంగవరం, గోపాల్‌దిన్నే గ్రామాల అభివృద్ధి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని చెప్పారు. అనంతరం వీపనగండ్ల మండల కేంద్రంలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతన ఎక్స్‌రే యంత్రాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆసుపత్రి కోఆర్డినేటర్ చైతన్య గౌడ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆసుపత్రిలో రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి రాత్రి సమయంలో కూడా వైద్యులు విధుల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామని, వారికి అవసరమైన వసతి సౌకర్యాల కల్పనకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో రూ.42 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి మంత్రి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ కిమ్యానాయక్, డిఆర్డిఓ ఉమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాయినాథ్‌రెడ్డి, ఆర్డి సుబ్రహ్మణ్యం , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, తాసిల్దార్ ఖాజా మైనుద్దీన్, ఎంపిడిఓ శ్రీనివాసరావు, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ, వీపనగండ్ల సర్పంచు మీసాల పార్వతమ్మ, గోపాల్ దిన్నే సర్పంచు దొడ్ల కవిత, రంగవరం సర్పంచు శివకుమార్, తూముకుంట సర్పంచు రామన్ గౌడ్, కల్వరాల సర్పంచు రాముడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, సమ్మిరెడ్డి రవీందర్ రెడ్డి, గోదాల భీరయ్య, ఇంద్రకంటి వెంకటేష్, గోపి, రఘునాథ్‌రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మహిళా సమాఖ్య బస్సును ప్రారంభించిన మంత్రి

**ప్రజాపక్షం/చిన్నంబావి:** చిన్నంబావి మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య కొనుగోలు చేసి ఏర్పాటు చేసిన ఆర్‌టిసి బస్సును మంత్రి జూపల్లి జెండా ఊపి బస్సులో మహిళలను ఎక్కించుకుని స్వయంగా బస్సును నడిపారు. జూపల్లి మహిళలు వంటింటికె పరిమితం కాకుండా వ్యాపారాలలో రాణించాలని ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి వ్యాపార రంగంలో ఇతరులతో పోలిస్తే మేము తక్కువ కాదనే విధంగా మహిళా సంఘాలు పెట్రోల్ బంకులు క్యాంటిన్లు బస్సులు ఏర్పాటు చేస్తూ వివిధ రంగాలలో రాణించాలన్నారు. ప్రభుత్వం మహిళలను ప్రోత్సాహిస్తుందని ఆదిలాబాద్ జిల్లాలో మంచానికే పరిమితమైన వెంకటరమణ బడికి వెళ్లి చదువుకోకపోయినా ఒంటి చేత్తో చరవాణి ద్వారా సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి ఉపాధి పొందుతున్న వీడియోను మంత్రి ఈ సందర్భంగా మహిళా సం ఘాలకు ప్రజలకు చూపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు మహిళా సంఘాలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గల కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్, ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎఐటియుసి రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ వస్తున్నట్లు ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఆనాడు ఎఐటియుసి సంఘం ద్వారా 44 కార్మిక చట్టాలను సాధిస్తే కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను తీసేయడం చట్ట విరుద్ధమని ప్రతి ఏ రంగంలోనైనా కార్మికులు పనిచేస్తున్నప్పుడు ప్రతి నెల ఒకటో తారీకున జీతాలు వెయ్యాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి రాకముందు ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇస్తారే తప్ప అమలు పట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెందాయి.
రానున్న భవిష్యత్తులో కార్మిక హక్కుల కో సం పోరాటాల ద్వారా సాధించుకున్నటువంటి కార్మిక చట్టాలను మళ్లీ పోరాటాల ద్వారా కార్మిక చట్టాలు సాధించుకుంటామని తదితర కార్మికుల సమస్యల మీద కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా కార్యవర్గ సమావేశానికి కార్యవర్గ సభ్యులు తప్పకుండా హాజరు కాగలరని మారేడు శివశంకర్ కోరారు.

## కల్వకుర్తి స్కిల్ హాల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ , టాస్క్ సిఓఒ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి నియోజకవర్గ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి యువత కోసం ఉచిత ఎఐ, ఐటి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం అమెరికాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ సంస్థ ఇన్ఫోడాట్ గ్లోబల్ ఇంక్‌కు ఐక్యత ఫౌండేషన్ మధ్య భాగస్వామ్యంతో కల్వకుర్తి నియోజకవర్గ యువత కోసం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని ఈ అవకాశాలను కల్వకుర్తి ప్రాంత యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో 5000 మంది యువతకు ఎఐ, ఐటి డాటా ఆనాలసిస్, డిజిటల టెక్నాలజీస్, సాఫ్ట్‌వేర్ స్కిల్స్ భవిష్యత్ ఉద్యోగ అవకాశాకాలకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలపై శిక్షణ అందించడమే లక్ష్యంగా నిర్ణయించామని, ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ రంగం వేగంగా మారుతోంది. ఒకప్పుడు డిగ్రీ ఉంటే ఉద్యోగం దొరికే పరిస్థితి ఉండేది, కాని నేడు నైపుణ్యాలే ఉద్యోగాలకు ప్రధాన అర్హతగా మారాయి. ఎఐ, ఐటి రంగాల్లో ప్రాథమిక, ఉన్నత స్థాయి అవగాహన ఉద్యోగాలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ ఇంటర్వ్యూ స్కిల్స్ డిజిటల్ టూల్స్ వినియోగంపై అవగాహన, జాతీయ, అంతర్జాతీయ కంపెనీల అవసరాలకు అనుగుణమైన శిక్షణ, ఫ్రీ లాన్సింగ్, రిమోట్ వర్క్, అవకాశాలపై మార్గదర్శకత్వం, స్టార్టప్‌లు, స్వయం ఉపాధిపై అవగాహన, కెరీర్ గైడెన్స్, మెంటరింగ్, వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందించనున్నామన్నారు. ఈ భాగస్వామ్య కార్యక్రమంలో ఫౌండర్ సీఈఓ ఎం.మల్లారెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ యువతకు ప్రపంచస్థాయి సాంకేతిక నైపుణ్యాలు అందించి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను వారిని సిద్ధం చేయాలని సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆలోచనకు మేము కూడా తోడ్పాటును అందించేందుకు ఐక్యత ఫౌండేషన్‌తో కలిసి పనిచేయడానికి ముందుకు వస్తున్నామని, గ్రామీణ యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించవచ్చని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంల్లో ఇన్ఫోడాట్ గ్లోబల్ ఇంక్ ఫౌండర్ ప్రతినిధుల బృందం, తదితరులు పాల్గొన్నారు.

## వంద పడకల ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని ఉన్న వంద పడకల ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల ఆసుపత్రిలో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించే విధంగా డాక్టర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు , డిసి హెచ్ ఎస్ రమేష్ చంద్రతో కలిసి ఆసుపత్రిని పరిశీలించారు. పరిశీలించిన అనంతరం ఆయన ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలకు అవసరమైన అన్ని వైద్య సేవలను అందుబాటులో ఉండాలని డాక్టర్లకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఆసుపత్రిలో ప్రధానంగా మిషన్ భగీరథ తాగు నీరు విద్యుత్ సమస్య, ఇన్వర్టర్లు కొనుగోలు, కంప్యూటర్స్ కొనుగోలు ఇఎన్‌టి మిషన్ ఎండోస్కోపీ మిషనరీ మైక్రోస్కోప్ బ్లడ్ బ్యాంక్ డయాలసిస్ కేంద్రం, ఆసుపత్రికి కాంపౌండ్ వాల్ నిర్మాణం ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థ, మార్చురీకి సంబంధించిన వస్తువులను సమకూర్చాలని డిసిహెచ్‌ఎస్ రమేష్ చంద్ర ఎమ్మెల్యేని అదనపు కలెక్టర్‌ని కోరారు. అలాగే ఆరోగ్యశ్రీ 38 ల క్షల రూపాయలు వివిధ అభివృద్ధి పనులకు మంజూరైనట్లు డి.సి.హెచ్.ఎస్ పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఆసుపత్రి సైన్సు బోర్డు సెక్యూరిటీ గార్డు గదులు బ యో వేస్టేజ్ గది వంటి వాటిని ఆసుపత్రిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే ముగింపు అనం తరం జిల్లా అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు, మాట్లాడుతూ ఆసుపత్రి తనిఖీల్లో భాగంగా కలెక్టర్ పలు సూచనలు సలహాలు, వైద్యులకు తెలియజేశారు. మరి ముఖ్యంగా వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఓపీ, ల్యాబ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, మందుల నిల్వలపై ఆరా తీశారు. ఆసుపత్రి అభివృద్ధిపై ప్రతి మూడు నెలలకోసారి సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తీర్మానించిన అంశాలు అభివృద్ధి పనులు వచ్చే మూడు నెలల్లో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సంధ్యా కిరణ్ మై, అలంపూర్ మున్సిపాలిటీ చైర్మన్ పిండి జయరాములు, సింగిల్ విండో అధ్యక్షులు గజేందర్‌రెడ్డి, పుల్లూరు రఘురెడ్డి, గ్రామ సర్పంచు సునీత, వివిధ వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు రాక ఇబ్బంది పడుతున్న 108 ఉద్యోగులు

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఆపదలో ప్రతి ఒక్కరికి మొదట గుర్తొచ్చే 108 వాహనం అలాంటి వాహనంలో పనిచేస్తున్న ఉద్యోగులకే ఆపద కాలం వచ్చింది. కాల్ చేసిన 15 నిమిషాల లోపల సంఘటన స్థలానికి చేరుకొని ఎంతోమందికి వైద్య సహాయాన్ని అందిస్తూ ఆపద్భాందవులుగా 108 సిబ్బందికి పేరు ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 అంబులెన్సులు మొత్తం 71 ఉన్నాయి. దాదాపుగా 300 మంది వరకు సిబ్బంది ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 108 ఉద్యోగులకు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, డ్రైవర్లకు రెండు నెలల నుండి జీతాలు లేక ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈనెల 15వ తేదీ నుండి పాఠశాలలో పునః ప్రారంభం కావడంతో తమ పిల్లలకు స్కూల్ ఫీజులు పుస్తకాలు స్కూల్ యూనిఫామ్ కూడా డబ్బులు చెల్లించలేని స్థితిలో ఉన్నామని పలు ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారు. గత కొంతకాలంగా ప్రభుత్వం నుండి నిధులు సకాలంలో విడుదల కాకపోవడం వలన సిబ్బందికి జీతభత్యాలు ఇవ్వడం కష్టంగా ఉంది. ప్రభుత్వం నుండి సకాలంలో నిధులు రాకపోయినా సర్వీస్‌లకు ఎటువంటి ఆటంకం లేకుండా వైద్య సేవలను అందిస్తున్నారు. ఇటు ప్రభుత్వం సకాలంలో 108 కు బడ్జెట్ విడుదల చేయకపోవడంతో పలు వాహనాల్లో పనిచేసే సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఒకవేళ ఇలాగే కంటిన్యూ అవుతే సిబ్బంది మొదట నిరసనతో తమ ఆందోళన కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇకనైనా ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాలని పలు ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి కోరుతున్నారు. ప్రతినెల ఒకటో తారీఖున జీతాలు వచ్చే విధంగా చూడగలరని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## ఉపాధి హామీని కొనసాగించాలి

**ప్రజాపక్షం/మాగనూర్ :** మాగనూరు మండల కేంద్రంలోని ఉపాధి హామీ కేంద్రాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పుంజనూర్ ఆంజనేయులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ, కూలీలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. వీబీజీ రామ్ జి చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని పిలుపునిచ్చారు. ఉపాధి కూలీలకు గత ఏడాది పెండింగ్ బిల్లులు వెంట నే చెల్లించాలని, పని ప్రదేశంలో రెండు పూటల ఫోటో క్యాప్చర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొలతల పద్ధతి రద్దు చేసి రోజు కూలీ రూ. 600 చెల్లించి, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని కోరారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలు జూన్ 20,21,22 తేదీల్లో మహబూబ్‌నగర్ పట్టణంలో జరగనున్నాయన్నారు. జూన్ 20న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీ, బహిరంగ సభకు త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు భరత్ కుమార్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.



## స్కూల్ బస్సులు తనిఖీ



**ప్రజాపక్షం/అయిజ :** అయిజ పట్టణంలో బుధవారం నాడు గద్వాల రవాణా శాఖ అధికారులు స్కూల్ బస్సులు తనిఖీ చేశారు. కాకతీయ, వైష్ణవి పాఠశాలల బస్సులను తనిఖీ చేసి, ఫిట్నెస్ లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కే తరలించినట్లు గద్వాల ఎంవీఐ రామ్ చరణ్ తెలిపారు. జిల్లా రవాణా శాఖ అధికారి రాధిక ఆదేశంతో పాఠశాలల బస్సులు తనిఖీ చేశామన్నారు. తనిఖీలలో కార్యాలయ సిబ్బంది, గోవర్ధన్, రిషి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## అడవి సత్యవార్ ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/ మాగనూర్ :**మన ఊరు మన ప్రభుత్వ బడి కార్యక్రమంలో భాగంగా అడవి సత్యవార్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ తిరుపతి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తులు, ప్రజా ప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆనందమ్మా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద గౌడ్, శివరామ్ రెడ్డి, విద్యార్థులు, డబ్బ రాములు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/వంగూర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు బుధవారం మండల కేంద్రంలో సర్పంచ పురుగుల యాదయ్య చేతుల మీదుగా విద్యా కమిటీ సభ్యులతో కలిసి పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచు యాదయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదివినట్లయితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , వార్డు మెంబర్లు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడులు, ఇద్దరి అరెస్ట్, ఏడుగురు బైండోవర్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్, తర్నికల్ తాండ, రాచూర్ తండా, చారకొండలలో అక్రమంగా నాటకార విక్రయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేయడంతో పాటు మరో ఏడు మందిని చేయడం జరిగిందని ఎక్సైజ్ సిఐ వెంకట్ రెడ్డి తెలిపారు. రాచూర్ తండాలో జరిపిన దాడులో (180)కేజీల నల్ల బెల్లం(20)ల పటిక, చారకొండలో 300కిలోల బెల్లం పానకం ధ్వంసం చేసి 12 లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ దాడులలో డిటిఎఫ్ టీం ఎస్ఐ అరుణ, కల్వకుర్తి ఎస్ఐ శ్రావణి, ట్రైయిని ఎస్ఐ చంద్రకిరణ్, సిబ్బంది జనార్దన్ రెడ్డి ముసౌందర్ , తేజ్ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని నందిని నగర్‌లో బుధవారం విషాదం ఘటన చోటు చేసుకుంది. మసాలా ప్యాకెట్లతో వచ్చిన లారీపై కప్పిన ప్లాస్టిక్ కవర్‌ను తొలగించే క్రమంలో విద్యుత్ తీగలు తగలడంతో డ్రైవర్ కుర్వ వెంకటేష్ (25) విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. తోటి హమాలీలు వెంటనే వెంకటేష్‌ను ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృ తదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. వివరాల్లోకి వెళితే గద్వాల్ మున్సిపాలిటీలోని చౌదర్‌పల్లి 7వ వార్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన కుర్వ వెంకటేష్ గత నాలుగేళ్లుగా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం గద్వాల్ నుంచి మక్తల్‌కు మసాలా ప్యాకెట్ల లోడుతో వచ్చిన లారీపై కప్పిన ప్లాస్టిక్ కవర్‌ను తొలగిస్తుండగా, కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వెంకటేష్‌కు భార్యతో పాటు నాలుగేళ్ల కుమార్తె ఉంది. కుటుంబానికి ఆధారమైన వెంకటేష్ ఆకస్మిక మరణంతో మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదానికి కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల కోరారు.



## ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కళ నెరవేరుతుంది

ప్రజాపక్షం/పెన్‌పహాడ్: ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి దశల వారిగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలంగాణ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పోట్లపహడ్ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు తూముల సురేష్‌రావుతో కలిసి విజయలక్ష్మి వెంకన్న, రంజాన్‌బీ, జాన్ బాబు ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల సొంతింటి కలలను నిజం చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అన అన్నారు. ప్రతినియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లులేని నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నామని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమాన ప్రాధాన్యతతో ఇళ్ల నిర్మాణ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రతి హామీని అమలు చేస్తున్నామని, పేదల అభ్యున్నతే ప్రభుత్వ ద్వేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎంఎంటిఎస్ భూ బాధితులకు న్యాయం చేస్తాం



ప్రజాపక్షం/బీబీనగర్ : పట్టణంలో ఎంఎంటిఎస్ రైల్వే నూతన లైను ఏర్పాటులో భూములు కోల్పోతున్న బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని బోనగిరి రాజస్వ మండలాధికారి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద భూబాధితులతో గ్రామ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మాట్లాడుతూ సుమారు రైల్వే లైన్ నిర్మాణం కోసం ఏడు ఎకరాల స్థలంలో సేకరించడం జరిగిందని అందులో 40 మంది ఇండ్లు 45 మంది ప్లాట్లను కోల్పోతున్నారని, వారందరికీ ప్రభుత్వ ల్యాండ్ ఆక్టివేషన్ చట్టం నష్టపరిహారం చెల్లిస్తుందని అందుకు బాధితులు అందరూ సహకరించి ప్రభుత్వం చేపట్టే సోషల్ ఎకనామిక్ సర్వేకు సహకరించవలసిందిగా ఆర్డీవో బాధితులను కోరారు. ఈ సమావేశంలో తాసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగళి రెడ్డి, ఉపసర్పంచ్ గోలి నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి జాకీరుద్దీన్, ఆర్ఐ యశ్వంత్, మండల సర్వే అనిత, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్



ప్రజాపక్షం/హాలియా: విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఎస్ఐ తెలిపిన ప్రకారం హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరయ్య నగర్‌లో డయల్ 112 ఫోన్ కాల్ తో పోలీస్ సిబ్బంది గృహ హింస ఫిర్యాదుపై విచారణకు వెళ్లగా మద్యం మత్తులో ఉన్న ఒక వ్యక్తి విచారణకు వెళ్ళిన పోలీస్ సిబ్బందిపై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించినట్లు చెప్పారు.ఈఘటనలో ఒక హోంగార్డుకు స్వల్ప గాయాలు అయినట్లు చెప్పారు. హోంగార్డు ఫిర్యాదు మేరకు పోలీసులపై దాడికి దిగిన తురక రాంబాబు ను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.ప్రజలు పోలీసు సిబ్బంది విధి నిర్వహణకు సహకరించాలని, ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చట్టరీత్య నేరమని అవి శిక్షార్హమైనవని చెప్పారు.ప్రభుత్వ ఉద్యోగులకు విధి నిర్వహణలో ఆటంకాలు కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.

## అక్రమ అరెస్టులతో ప్రతి పక్షాల గొంతు నొక్కితే మరో ఉద్యమం చేస్తాం



ప్రజాపక్షం/ఆలేరు : ఆలేరు నియోజకవర్గంలో రాజ్యాంగ పాలన నడుస్తుందా లేక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాలన నడుస్తుందా అని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రరెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఆలేరు పట్టణంలోని రహదారి బంగ్లా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు జరగలేదని విమర్శించారు. ప్రజా పాలన పేరుతో ప్రజలను మభ్య పెడుతూ, ఫేస్బుక్, ట్విట్టర్, రీల్స్ ప్రచారానికే పరిమితమవుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని రైతులు, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో విసిగిపోయారని పేర్కొన్నారు. అభివృద్ధి కంటే అక్రమ అరెస్టులు, రాజకీయ కక్ష సాధింపులకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని మళ్లీ కోరుకుంటున్నారని, బిఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి రావాలని ఎదురుచూస్తున్నారని తెలిపారు. రేపు యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో లక్ష్మి నరసింహ గార్డెన్ జరిగే సార్ పై బూత్ ఏజెంట్ల అవగాహన కార్యక్రమం కు బిఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, మండల అధ్యక్షులు గంగుల శ్రీనివాస్ యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ మొగలగాని మల్లేశం, శిల్పనాపురం గ్రామ సర్పంచ్ మూలగాని నరసయ్య పాల్గొనారు.

## ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చేర్పించండి

ప్రజాపక్షం/నేరేడుచర్ల: విద్యార్థిని, విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రభుత్వ హస్టళ్లు, గురుకులలాల్లో చేర్పించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు విజ్ఞప్తి చేశారు. బుధవారం నేరేడుచర్లలో మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలుగా అనేక తిరస్కారాలకు, చీత్కారాలకు గురవుతున్న బిసి, ఎసి, ఎస్టీ మైనార్టీ వర్గాల్లో పిల్లలు బాగా చదువుకోవడం వల్లనే సమాజంలో వారికి వారి కు టుంబాలకు ఎంతో గౌరవం దక్కుతుందన్నారు. అందరూ చదువుకుంటేనే ఆర్థిక అసమానతలు తొలగిపోతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తుందన్నా రూ.8 లక్షల మందికి ఉచిత భోజన, భోధన సదుపాయాలు ఉన్నాయన్నారు.

# నకిలీ వరి విత్తనాలకు గడ్డిపల్లి అడ్డా!

నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారులు
ఆకర్షణీయమైన బ్యాగుల్లో...
కంపెనీ బ్రాండ్లతో బురిడి
పట్టించుకోని వ్యవసాయ అధికారులు
నష్టపోతున్న రైతులు





(ఫైల్)



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట జిల్లాలోని గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త గంట గోపాల్ రెడ్డి స్థానికంగా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కృషి విజ్ఞాన కేంద్రాన్ని స్థాపించారు. ఈ సంస్థ ద్వారా దాదాపు 80 ఏండ్ల నుండి వ్యవసాయ నిపుణులు రైతులకు అవసరమైన నాణ్యమైన వరి విత్తనాలతోపాటు ఇతర విత్తనాలు అందించడం వ్యవసాయ రంగంలోని మెళుకువులను ఎప్పటికప్పుడు రైతులకు నేర్పి పంట దిగుబడి వచ్చేలా కృషి చేయడం జరుగుతుంది. దీనితో ఈ కృషి విజ్ఞాన కేంద్రానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉంది. వరి సాగు చేసే రైతులు వందల కిలోమీటర్ల నుండి ఇక్కడికి వచ్చి పెత్తఎత్తున వరి విత్తనాలతోపాటు ఇతర విత్తనాలను తీసుకెళ్ళి పంట సాగు చేయడం జరుగుతుంది. రైతుల నమ్మకానికి దగ్గట్లుగా సంస్థ ద్వారా కొనుగోలు చేసిన విత్తనాలతో పంట సాగు చేసిన రైతులు అధిక దిగుబడిని సాధించి ఆర్థికంగా బలపడుతూ వచ్చారు. దీనిని పసిగట్టిన కొంత మంది అక్రమార్కులు విత్తనాల అమ్మకాలతో అధిక లాభాలు గడించాలనే దురాశతో వ్యవసాయ అధికారుల నుండి ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకొని విత్తన విక్రయ కేంద్రాలను పెద్దఎత్తున అక్కడ ఏర్పాటు చేశారు. ఈ చిన్న గ్రామంలో 10కి పైగా విత్తన శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి కేవలం వ్యవసాయ అధికారుల నుండి పొందిన లైసెన్సు ల ద్వారా దుకాణాలు ఏర్పాటు చేసి ఈ నకిలీ దందాను కొనసాగిస్తున్నారు.

**నేరుగా రైతుల నుండే ధాన్యం సేకరణ...**

గడ్డిపల్లిలోని సీడ్స్ కంపెనీ వారు నేరుగా రైతుల వద్ద ధాన్యాన్ని సేకరించడం జరుగుతుంది. క్వింటాకు రూ.2,500 నుండి 2,600 వరకు కొనుగోలు చేసి వాటిని ఆరబెట్టి పాడీ క్లీనర్ ద్వారా ఆ ధాన్యంలోని తాలుపెల్లను వేరుచేసి ఇవే బ్రాండెడ్ విత్తనాలు అంటూ అమాయక రైతులను మోసం చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వరి ధాన్యాన్ని 10 కేజీలు, 20 కేజీల అందమైన కంపెనీ పేరుతో ముద్రించి ఉన్న బ్రాండెడ్ కవర్లలో నింపి కిలో రూ.60 చొప్పున అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో సదరు కంపెనీ యజమానులకు క్వింటా ధాన్యానికి రూ.3వేలకు పైగా లాభాన్ని ఆర్జిస్తున్నారు.

వీరి చేసే నకిలీ వ్యాపారం వ్యవసాయ అధికారుల కండ్ల ఎదుటే ఏండ్ల తరబడి సాగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో, మండలాల్లో పనిచేస్తున్న వ్యవసాయాధికారులు బదిలీలు అయి వారి స్థానంలో కొత్తగా వచ్చిన వారు తమ పట్టును నిలుపుకునేందుకు హడావుడిగా తనిఖీలు చేసి ఆ తరువాత అటువైపు తిరిగి చూసిన సందర్భాలు మచ్చుకు కూడా లేవు. సీడ్స్ కంపెనీ యజమానులు వీరికి పెద్ద మొత్తంలో సీజన్ వారీగా ముడుపులు ఇస్తున్నారని దీంతో వీరి అక్రమ వ్యాపారాలకు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరి మోసాలకు వందలాది మంది రైతులు పంట నష్టపోయి ఆందోళనలు చేసినా ఫలితం శూన్యం. గత ఏడాది క్రితం ప్రజాపక్షం వ్యాపారుల మోసాలపై, వారు అమ్మే నకిలీ విత్తనాలపై వరుస వార్తా కథనాలు ప్రచురించడంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమీషన్ స్పందించింది. ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ కోదండ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు, అధికారులు గరిడేపల్లి, పెన్‌పహాడ్ మండలాల్లో పలు గ్రామాలు సందర్శించి నష్టపోయిన పంటను పరిశీలించి రైతులను పరామర్శించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి తమకు నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కానీ నేటికి ఆ నివేదిక ఏమైందో అందులో ఏముందో కూడా అధికారులు బయటికి తెలుపకపోవడం గమనార్హం. సీడ్స్ కంపెనీ వ్యాపారులకు కొంతమంది ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండడంతో వారిని తమ బుట్టలో వేసుకొని నివేదికను నేటికి తొక్కిపట్టారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంట నష్టపోయిన రైతులు ఆయా కంపెనీల వద్ద ఆందోళన చేయడంతో వారిని అదిరించి బెదిరించి తమ దారికి తెచ్చుకొని కొంత నష్టపరిహారం అందించి వ్యాపారులు చేతులు దులుపుకున్నారు. ఇలా ప్రతి సీజన్‌లో ఈ వ్యాపారుల నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతూనే ఉన్నారు. కానీ వ్యాపారులు మాత్రం కోట్లు గడిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ నకిలీ విత్తనాల దందాకు ముగింపు పలకాలని రైతు సంఘాల నాయకులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## నేటి నుండి యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : వానాకాలం 2026 సీజన్‌లో పంటల సాగుకు అవసరమైన యూరియాను కొనుగోలు చేయుటకు జిల్లాలో యూరియా బుకింగ్ యాప్ నేటి (గురువారం) నుండి ప్రారంభం అవుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. రైతులు యూరియాను తమ స్మార్ట్ ఫోన్ ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులు ఎటువంటి ఆందోళన పడకుండా వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారి లేదా డీలర్ల వద్ద కాని, బంధువుల వద్ద కాని బుక్ చేసుకోవచ్చని సూచించారు. మీసేవ, సిఎస్‌సి సెంటర్ల వద్ద కూడా బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. వానాకాలంలో సరిపడా యూరియా అందించుటకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సీజన్ అయిపోయేంత వరకు రైతులకు యూరియా సరిపడా సరఫరా చేయబడుతుందని పేర్కొన్నారు. ఒకేసారి అందరూ కొనుగోలు చేయుటకు ప్రయత్నించినట్లయితే రద్దీ ఏర్పడి ఎరువుల దుకాణాల వద్ద వేచి చూడాల్సి వస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటికే 16వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, అవసరానికి తగ్గట్లుగా దశలవారీగా రైతులకు అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు.

## ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు

ప్రజాపక్షం/నాంపల్లి : పిఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ నాంపల్లి మండలం పెద్దాపురం నందు క్రింది సబ్జెక్టులలో గంటల వారీ ఉపాధ్యాయుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి పేర్కొన్నారు.పిజిటి తెలుగు, హిందీ సబ్జెక్టులకు బోధించుటకు గాను అవసరమైన విద్యార్హతలు,అనుభవం కలిగిన అభ్యర్థులు జూన్ 20 ఉదయం 10 గంటలకు పిఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్,పెద్దాపురం, నాంపల్లి నందు నిర్వహించబడే డెమో,ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలి.అభ్యర్థులు తమ ఓరిజినల్ ధ్రువపత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలి.

## బిల్లులు విడుదల చేయకపోతే ఎగుమతి,దిగుమతి నిలిపివేస్తాం

సివిల్‌సప్లై హమాలీల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్





ప్రజాపక్షం/నల్లగొండ : సివిల్ సప్లై హమాలీ కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి,సివిల్ సప్లై హమాలీ యూనియన్ అధ్యక్షుడు పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సివిల్ సప్లై డీఎం రాంపతికి ఎఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణాలకు బియ్యం ఎగుమతి చేసిన హమాలీలకు మూడు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమని అన్నారు.కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాలేదనే సాకుతో కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు.రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు బిల్లుల చెల్లింపులు జరిగినప్పటికీ నల్లగొండ జిల్లాలో మాత్రం ఆలస్యం అవుతుండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.మూడు నెలల రేషన్‌ను ఒకేసారి పంపిణీ చేయించిన అధికారులు, అదే సమయంలో హమాలీలకు రావాల్సిన పారితోషికాన్ని చెల్లించకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.నిరుపేద కుటుంబాలకు చెందిన హమాలీలు తమ జీవనోపాధి కోసం ఈ బిల్లులపైనే ఆధారపడుతున్నారని, కేంరాష్ట్ర వాటాల పేరుతో చెల్లింపులు నిలిపివేయడం వల్ల వారి కుటుంబాలు ఇబ్బందుల్లో పడుతున్నాయని తెలిపారు.పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయకపోతే సోమవారం నుంచి ఎగుమతి,దిగుమతి కార్యకలాపాలను నిలిపివేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొనకొండ వెంకన్న,మహేష్,వెంకన్న,నాగరాజు,ధర్మ, రవి, లింగయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహం దహనం కేసు ఛేదించిన పోలీసులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పాలకూరి అశోక్ గౌడ్ అరెస్ట్
మరో నిందితుడు ప్రణీత్ అరెస్ట్- బలెనో కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం



ప్రజాపక్షం/నల్లగొండ : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నల్లగొండలోని ఎన్టీఆర్ విగ్రహం దహనం కేసును జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేసిన పాలకూరి అశోక్ కుమార్ గౌడ్‌తో పాటు ఎలుకంటి ప్రణీత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.నేరానికి ఉపయోగించిన బలెనో కారు,రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డిఎస్పి కె. శివరాం రెడ్డి,టూ టౌన్ సీఐ ఎస్.రాఘవరావులతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం జూన్ 6వ తేదీ తెల్లవారుజామున నల్లగొండ హైదరాబాద్ రోడ్డులోని ఎన్జీ కళాశాల సమీపంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు ఎన్టీఆర్ విగ్రహానికి పెట్రోల్ పోసి నిప్పంటించారు.ఈఘటనతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చ జరిగింది.ఘటనపై కేసు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు,జిల్లా ఎస్పిఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు.వందల గంటల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి,సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించారు. దర్యాప్తులో భాగంగా ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ఉద్రిక్త పరిస్థితులు సృష్టించాలనే ఉద్దేశంతో ఈ కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు.రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలను లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేయాలనే ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.జూన్ 6న ఉదయం 3.45 గంటల సమయంలో అశోక్ గౌడ్‌కు చెందిన టిఎస్ 07హెచ్‌టి 2430 నంబర్ బలెనో కారులో నిందితులు నల్లగొండకు చేరుకుని,రెండు పాత బెడ్‌షీట్లను విగ్రహంపై కప్పి,ఒక లీటర్ పెట్రోల్ పోసి నిప్పంటించి పరారైనట్లు పోలీసులు తెలిపారు.ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.ఈకేసులో హైదరాబాద్ చైతన్యపురికి చెందిన ప్రైవేట్ లెక్చరర్ పాలకూరి అశోక్ కుమార్ గౌడ్,రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఎలుకంటి ప్రణీత్ లను అరెస్ట్ చేసినట్లు ఎస్పి తెలిపారు.ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం,శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా ఎస్పిహెచ్చరించారు. సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే కుట్రలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని, ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## వైటిపిఎస్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఎక్కడిదాకైనా పోరాడుతాం

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో వేలాది మంది స్థానిక నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసమే నాడు కేసీఆర్ హయాంలో ప్రతిష్టాత్మకంగా వైటీపీఎస్ పవర్ ప్లాంట్‌ను తెచ్చుకున్నామని, అలాంటి ప్లాంట్ ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు అప్పగించి ఉద్యోగాలను దోచిపెడితే ఊరుకునేది లేదని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హెచ్చరించారు. మిర్యాలగూడ పట్టణంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల శిక్షణా సదస్సులో ఆయన పాల్గొని సుదీర్ఘంగా ప్రసంగించారు. ప్లాంట్ నిర్మాణంలో తమ భూములు కోల్పోయిన ప్రతి ఒక్క నిర్వాసితుడికి పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి కొట్లాడుతుందని స్పష్టం చేశారు. ఈ సదస్సులో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్ ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకుండా వంచిస్తోందని, ఎరువులు అందించడంలో కాంగ్రెస్ పూర్తిగా వైఫల్యం చెందిందని మండి పడ్డారు. జూన్ 25 నుంచి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతి కార్య కర్త పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఓట్ల అక్రమ తొలగింపును అడ్డుకోవాలని సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మంజూరైన నిధులతోనే ఇప్పుడు ఇక్కడి ఎమ్మెల్యే పనులు చేయిస్తున్నారని, దమ్ముంటే కొత్త నిధులు తెచ్చి అభివృద్ధి చేయాలని సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అలుగుబెల్లి అమరేందర్ రెడ్డి, నాయకులు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, అన్నభీమోజు నాగార్జునచారి, పాలుట్ల బాబయ్య, దుర్గంపూడి నారాయణరెడ్డి, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, మోసిన్ అలీ, నల్లమోతు సిద్ధార్థ పాల్గొన్నారు.

## సిసిరోడ్డు పోశారు... క్యూరింగ్ మరిచారు



ప్రజాపక్షం/కోదాడ రూరల్ : మండలంలోని గణపవరం గ్రామంలో ఆంజనేయస్వామి గుడి వద్ద సిసి రోడ్డు గత ఐదు రోజుల క్రితం పోశారు. పోసిన నాటి నుండి నేటి వరకు క్యూరింగ్ చేయలేదని ప్రజలు వాపోతున్నారు. కాంట్రాక్టర్ రోడ్డు పోశాడు వెళ్లిపోయాడు దానిని క్యూరింగ్ ఎవరు చేయాలని, ఈ రోడ్డు మన్నిక ఎక్కువ కాలం ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లకు పనులు కట్ట పెట్టొద్దని అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పోసేనాటి నుండి ఈ రోజు వరకు కాంట్రాక్టర్ ఇటు పక్క వచ్చి పని జరుగుతున్న చూసిన దాఖలాలు లేవని మండిపడ్డారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కాంట్రాక్టర్‌తో వాటర్ కొట్టించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రత్యేక ఓటర్ జాబితా సవరణకు రాజకీయ నాయకులు సహకరించాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బిఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితా ప్రక్షాళన విజయవంతం అయ్యేలా సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు, రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. జూన్ 18వ బూత్ లెవల్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులు, క్షేత్ర స్థాయి సన్నహక శిక్షణ ఇస్తారని వివరించారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బిఎల్‌వోలు ప్రతి ఇంటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలను సేకరిస్తారని, 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కటుంబ సభ్యుల వివరాలను ఇందులో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూలై 24 నుండి 30 వరకు పంతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతామన్నారు. ఓటర్ల ముసాయిదా జూలై 31న జాబితా ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారని అన్నారు. ఎవరైనా తప్పు సమాచారం ఇస్తే నేరుగా పేరు తొలగించకుండా ముసాయిదా జాబితా తర్వాతనోటిసు ఇచ్చి, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వలస వెళ్లిన వారు, మరణించిన వారు, డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుండి తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్యం చట్టం 1950 లోని సెక్షన్ 31 ప్రకారం ఓటర్ల జాబితాలోని పేరు నమోదు కోసం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం లేదా తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ఒక సంవత్సరం జైలుశిక్ష, జరిమాన లేదారెండు విధించే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుత జాబితా లోని పేరులోని కొత్త ఓటర్లు తప్పని సరిగా ఫామ్6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హరిసింగ్, జిల్లా రెవిన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, రాజేశ్వర్‌రావు, అంజాద్, ఐఎన్‌సి కరుణాకర్ రెడ్డి, సత్యనారాయణ, బిఆర్ఎస్, బిజేపి అభిద్, గోపి, సిపిఐ స్టాలిన్, బిఎస్‌పి నాయకులు పాల్గొన్నారు.

## జెపి దర్గా అభివృద్ధికి చర్యలు

టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/కొత్తూరు:** జెపి దర్గా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా కృషి చేస్తుందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. బుధవారం కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రసిద్ధి చెందిన జెపి దర్గాలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకుముందు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుసేని, శివశంకర్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, ఎల్లారం శేఖర్‌రెడ్డి, కుమార స్వామిగౌడ్, సర్పంచ్‌లు గొర్లపల్లి అశోక్, మంకాల శ్రీశైలం, బుగ్గ సాలయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నిజం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పేదలకు సొంతింటి కలను నిజం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగానే అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ వివరించారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామంలో మాల సాయిలు దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని చీరసారె అందించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేష్ కురుమ, ఎడ్ల మహేందర్, తుపాకుల శేఖర్ ముదిరాజ్, నర్సింహులు గౌడ్, సీతారాములు, తుపాకుల శేఖర్, వార్డు సభ్యులు చెన్నయ్య, చింతకింది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తాం




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బీ టైప్ క్వార్టర్స్ ఫేజ్1లో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని వనస్థలిపురం డివిజన్ బిఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా అన్నారు. బుధవారం మార్నింగ్ వాక్‌లో కాలనీ వాసులతో కలిసి కాలనీలో పర్యటించారు. కార్యక్రమంలో సచ్చినారాయణ, వెంకటేశ్వర్లు, ఓం ప్రకాష్, సత్యానారాయణ రెడ్డి, మిట్ట రామ్మోహన్, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం



**ప్రజాపక్షం/యాచారం :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ యాచారం మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం అన్నారు. బుధవారం మేడిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురికి ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్, ఉప సర్పంచ్ దెంది మదుకర్‌రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షుడు బాల్‌రాజ్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వార్డుమెంబర్ అడాల శ్రీకాంత్, ముంత గణేశ్, బేత జంగయ్య, బన్నే జంగయ్య, కలకోండ మల్లేశ్, నల్లోల్ల చంద్రయ్య, గోదాసు రవి, నల్లోల గణేశ్, జక్కర్త మధు, నల్లోల జగన్, బాలరాజు,తదితరులు పాల్గొన్నారు.

## మేలు రకాలైన విత్తనాలతో నేలకు రక్ష



**ప్రజాపక్షం/యాచారం :** రైతులు వ్యవసాయ రంగంలో మేలు రకాలైన విత్తనాలను ఎంపిక చేసుకోని నేల అరోగ్యాన్ని కాపాడాలని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకాంత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రవిశంకర్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సుధీర్, సర్పంచ్ అచ్చన మంగజంగయ్య, ఉపసర్పంచ్ గౌర లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి స్వప్న, అదర్శ రైతు సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రతి చిన్నారిని సర్కారు బడుల్లోనే చేర్పించాలని చిన్న ఎల్కిచర్ల సర్పంచ్ రాజ్‌కుమార్ కోరారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థిని సర్కారు బడులను పంపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గడ్డం దేవకుమార్, ఉపసర్పంచ్ చెక్కల మహేష్ యాదవ్, చైర్మెన్ ప్రమీల, అంగన్‌వాడీ టీచర్ శేఖరమ్మ పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు..

# రాజకీయ పార్టీలు సహకరించాలి

జిహెచ్‌ఎంసి, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లాలో పారదర్శకమైన, సమగ్రమైన, ఎలాంటి లోపాలు లేని ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యంగా జిహెచ్‌ఎంసి కసరత్తు ముమ్మరం చేసింది. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో 'ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్) ప్రక్రియపై బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించింది. జిహెచ్‌ఎంసి, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్, అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, అదనపు కమిషనర్ (ఎన్నికలు) కుమారి కె.చంద్రకళ, వివిధ రాజకీయ పార్టీల ముఖ్యనాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయి సమస్యలను,ఓటర్ల సవరణ ప్రక్రియలో ఎదురవుతున్న పలు సాంకేతిక, ఆచరణాత్మక ఇబ్బందులను అధికారుల బృందం దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో దాదాపు 30శాతం మంది ఇతర రాష్ట్రాల (రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్) వారు ఉన్నారని, వీరికి తెలుగు రాకపోవడం వల్ల ఆంగ్లంలో ఫారాలు ఇవ్వాలన్న నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా స్వాగతించాయి.

### బిఎల్‌ఒల విధుల్లో గందరగోళం..

కేంద్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మధ్య సమన్వయం లోపించిందని రాజకీయ ప్రతినిధులు ఆరోపించారు. ఎన్యుమరేషన్ ఫారాన్ని బిఎల్ఒలే స్వయంగా పూరిస్తారని సిఇఒ చెబుతుంటే, మరోవైపు బిఎల్‌ఓలు కేవలం ఫారం ఇచ్చి వెళ్ళిపోతారని జిల్లా ఎన్నికల అధికారులు చెప్పడంపై పరస్పర విరుద్ధ ప్రకటనలతో గందరగోళం నెలకొందని వారు తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్ కర్ణన్ బిఎల్‌ఒలు పూర్తిస్థాయిలో కేవలం 'సర్' విధులు మాత్రమే నిర్వహించే విధంగా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయిస్తామని, ప్రతి రోజూ 250 ఫారాలను సేకరించే విధంగా ప్రణాళిక ఉందన్నారు.

### ఆంగ్లంలోనే ఎన్యుమరేషన్ ఫారాలు : కర్ణన్

ఓటర్ల వివరాల సేకరణను మరింత సులభతరం చేసేందుకు, ఖచ్చితత్వంతో కూడిన జాబితాను సిద్ధం చేయడానికి అర్హులైన ఓటర్లందరికీ ఆంగ్ల భాషలోనే ఎన్యుమరేషన్ (వివరాల సేకరణ) ఫారాలను పంపిణీ చేయనున్నట్లు ఆర్.వి.కర్ణన్ ప్రకటించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటర్లు క్షేత్రస్థాయిలో పర్యటించే బూత్ స్థాయి అధికారులకు (బిఎల్‌ఓలు) పూర్తి సహకారం అందించాలని కోరారు. నిర్ణీత గడువులోగా పూర్తి చేసిన ఫారాలను సమర్పించబోని వారి పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చకపోవచ్చని ఆయన స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు (ఫామ్6), మార్పులుచేర్పుల (ఫామ్8) కోసం బూత్ స్థాయి అధికారుల వద్ద అపరిమిత ఫారాలను అందుబాటులో ఉంచుతామని హామీనిచ్చారు.

## సిఎం సభలో మధ్యాహ్న భోజనం కార్మికులు, టీచర్స్ నిరసన



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాలను ప్రారంభించడానికి వచ్చిన సిఎం సభలో మధ్యాహ్న భోజనం, అల్పాహారాన్ని ప్రైవేటు సంస్థలకు ఇవ్వకూడదని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజనం కార్మికులు సభలో నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయా డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని సిఎంకు అందజేశారు. కాగా సభకు రమ్మని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులను ఆహ్వానించి, ప్రాధాన్యత కల్పించకుండా అవమానించారని ఉపాధ్యాయులు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

## 'మాగ్నా కోడ్ హెల్త్‌కేర్'లో రూ.93 లక్షలకుపైగా నిధుల దుర్వినియోగం

ఫైనాన్స్ మేనేజర్‌పై కేసు నమోదు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ ఆరోగ్య సేవల సంస్థ మాగ్నా కోడ్ హెల్త్‌కేర్ అండ్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో భారీ ఆర్థిక అక్రమాలు వెలుగు చూశాయి. సంస్థ నిధులను కాజేసిన ఆరోపణలపై ఫైనాన్స్ మేనేజర్ లక్ష్మణ్ హన్మండ్లపై సిసిఎస్ ఇఒడబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో రూ.93.07 లక్షలకు పైగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు బయటపడింది. సంస్థ డైరెక్టర్ డాక్టర్ సంతోష్ రామకృష్ణన్ ఫిర్యాదు మేరకు సిసిఎస్ డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్‌లో కేసు నమోదు చేశారు. ఫిర్యాదు ప్రకారం 2025 జనవరి నుంచి హైదరాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న లక్ష్మణ్ హన్మండ్ల సంస్థ బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీల నిర్వహణ బాధ్యతలు చేపట్టాడు. దర్యాప్తులో భాగంగా వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, ఆర్టీజీఎస్ చెల్లింపుల కోసం సిద్ధం చేసే జాబితాల్లో అసలు విక్రేతల పేర్లను చూపిస్తూ, వాటి ఎదుట తన వ్యక్తిగత బ్యాంకు ఖాతా నంబర్లను నమోదు చేసి సంస్థ నిధులను తన ఖాతాలకు మళ్లించినట్లు గుర్తించారు. సంస్థ డైరెక్టర్ అత్యంత రద్దీగా ఉండే ఓపిడి సమయాల్లో చెక్కులపై సంతకాలు తీసుకుని మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదట రూ.35 లక్షల మేర నిధులు దుర్వినియోగం చేసినట్లు ఒప్పుకున్న నిందితుడు, ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తానని హామీ ఇచ్చి తన భూములను తాకట్టు పెట్టేందుకు కూడా ముందుకొచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే అనంతరం భూమిలోని పలు ప్లాట్లు ఇప్పటికే విక్రయించిన విషయం బయటపడింది. సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ నియమించిన ఫోరెన్సిక్ ఆడిటర్లు నిర్వహించిన విచారణలో మొత్తం 54 మోసపూరిత లావాదేవీలు గుర్తించారు. మే నుంచి అక్టోబర్ 2025 మధ్యకాలంలో రూ.93,07,275 మేర నిధులను వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా మళ్లించినట్లు నివేదిక వెల్లడించింది. అంతేకాకుండా టిడిఎస్, అడ్వాన్స్ ట్యాక్స్, జీఎస్టీ చెల్లింపులకు సంబంధించిన నకిలీ చలాన్లు తయారు చేయడం, బ్యాంకు స్టేట్‌మెంట్లను ఫోర్జరీ చేసి సమర్పించడం, ఎలక్ట్రానిక్ రికార్డులను మార్పులు చేయడం వంటి చర్యలకు కూడా పాల్పడినట్లు ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలింది. కంపెనీ చెక్కులను దుర్వినియోగం చేసి క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసును ఎస్ఐ స్వప్న దర్యాప్తు చేస్తున్నారు.

## మావేరిక్స్ రోటరీ క్లబ్ సౌజన్యంతో

# భూ పోరాట కేంద్రంలో పేదలకు నీటి వసతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అబ్దుల్లాపూర్‌మెట్టు మండల పరిధిలోని రావి నారాయణరెడ్డి కాలనీ ఫజ్ 3 భూపోరాట కేంద్రంలో సోలార్‌తో నడిచే ఆరు లక్షల విలువ గల నీళ్ల పంపుని బుధవారం హైదరాబాద్ మావేరిక్స్ రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ డాక్టర్ ఎస్వి రాంప్రసాద్, నీటి పంపు దాత బాల్కొటి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మావేరిక్స్ రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎస్ వి.రాంప్రసాద్ మాట్లాడుతూ మనుషులు జీవించటానికి కావాల్సిన ఎలాంటి కనీస వసతులు భూ పోరాట కేందంలో లేకున్న కూడా నాలుగేళ్లుగా ఇక్కడ వేల మంది ప్రజలు వారి పిల్లలతో కలిసి క్రమశిక్షణతో జీవించటం అనేది ఒక గొప్ప విషయం అన్నారు. తమ సంస్థ అందించిన సోలార్ లైట్ల కింద కూర్చొని పిల్లలు చదువుకోవటం, ట్యూషన్ చెప్పటం లాంటి సంఘటనలు చూసిన ప్రతిసారి ఎన్ని పైసలు ఖర్చు చేసిన రాని ఆనందం ఇక్కడ చదువుకునే వాళ్ళని చూస్తే వస్తుందన్నారు. ఈ ప్రాంత ప్రజలు పర్యావరణానికి ఇచ్చే ప్రధాన్యతను చూస్తే బంజారాహిల్స్ లాంటి ప్రాంతాల్లో బంగ్లల్లో బతికే అనేక మందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంశించారు. భవిష్యత్తులో ఇక్కడి ప్రజలకి మౌలిక వసతుల కల్పించటం కోసం, ముఖ్యంగా చదువుకునే విద్యార్థుల ఎలాంటి సహకారాన్ని అయినా సంస్థ తరుపున అందించటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పేద ప్రజలకు సహాయం చేస్తున్న రోటరీ క్లబ్ సంస్థ సభ్యులకు ఈసందర్భంగా భూపోరాట కమిటీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు కళ్యాణ్, కార్యదర్శి లక్ష్మి, రోటరీ క్లబ్ హైదరాబాద్ మావేరిక్స్ అధ్యక్షులు సురేష్ బాబు, కార్యదర్శి మాధవి, కోశాధికారి ఆశ రామకృష్ణ, సభ్యులు అజయ్ కుమార్, శేఖర్ గోగినేని, విజయలక్ష్మి, బిజెఆర్ మైనింగ్ ఇన్ఫ్రా లిమిటెడ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్ మెట్టు మండల సహాయ కార్యదర్శి కేతారాజు, నర్సింహా, సిపిఐ నాయకులు దాసరి ప్రసాద్, పొన్నాల యాదగిరి, నవనిత, సైదులు, మధు, పేరాల గోపి, ఆవుల యాదగిరి, రాఘవేంద్ర, వినోద్ నాయక్, గణేష్ నాయక్ ,ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎకో పార్క్ శంకుస్థాపన చేయనున్న సిఎం

ఏర్పాట్లు పరిశీలించిన టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** రాష్ట్రంలో పచ్చదనం విస్తీర్ణం పెంచే లక్ష్యంతో ఈ ఏడాది రాష్ట్రం వ్యాప్తంగా 16 కోట్ల మొక్కలు నాటాలానే దృఢసంకల్పంతో చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని గురువారం బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్‌లోని గుర్రంగూడ ఫారెస్ట్ రేంజ్‌లో సిఎం ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న ప్రాంతాన్ని అధికారులు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటివ్ అఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్, చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ పారెస్ట్ ప్రియాంక వర్గీస్‌తో కలిసి ఏర్పాట్లను మధుయాష్కీ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ ఎల్‌బి నగర్ నియోజకవర్గ ప్రజలకు 116 ఎకరాల్లో పార్కును అందుబాటులోకి రావడం అదృష్ట మన్నారు. ఈ ప్రాంత ప్రజలకు 30ఏళ్లుగా ఉన్న ఇళ్ల స్థల వివాదాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం పరిష్కరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. పార్కును అభివృద్ధి చేయడమే కాకుండా రూ.20 కోట్లతో బి.ఎన్.రెడ్డి నగర్ పరిసర ప్రాంత ప్రజలకు వరద, డ్రైనేజీ నీటి సమస్య పరిష్కారానికి బాక్స్ డ్రైన్, డ్రైనేజీ లైన్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. సిఎం రేవంత్‌రెడ్డి వన మహోత్సవ కార్యక్రమానికి విజయవంతం చేయాలని, నియోజకవర్గ ప్రజలు భారీ ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్ గౌడ్, ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్‌గౌడ్, నాయకులు మకుటం సదాశివుడు, శశిధర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, స్వర్ణమాధవి, పాశం అశోక్‌గౌడ్, నేలపాటి రామారావు, కంచర్ల కవిత, విద్యారెడ్డి, గణేష్‌రెడ్డి, కొండోజు శ్రీనివాస్, శశికాంత్, భవాన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి నిరంతరం కృషి

సిఎంసి కమిషనర్ సృజన

టౌన్ ప్లానింగ్ వింగ్స్, ఇంజనీరింగ్ వింగ్స్ నూతన కార్యాలయ గదులను ప్రారంభం



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి నిరంతరం కృషిచేస్తామని సిఎంసి కమిషనర్ సృజన తెలిపారు. బుధవారం మాదాపూర్‌లోని న్యాక్ బిల్డింగ్‌లో సిఎంసి టౌన్ ప్లానింగ్ వింగ్స్, ఇంజనీరింగ్ వింగ్స్ నూతన కార్యాలయ గదులను సిఎంసి కమిషనర్ శ్రీజన విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నూతన సైబారాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాడిన తర్వత సిఎంసి కొత్త కార్యలయనికి మాదాపూర్‌లోని న్యాక్ బిల్డింగ్‌లో రెండవ అంతస్తులో కేటాయించడంతో పాటు మాదాపూర్ సర్కిల్, టౌన్ ప్లానింగ్ వింగ్స్, ఇంజనీరింగ్ వింగ్స్ కార్యాలయ గదులను ప్రారంభించామన్నారు. పరిపాలన కార్యకలాపాలు సాఫీగా సాగేలా, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడానికి సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

## కోటీశ్వరులను కాదు..లక్షాధికారులను చేయండి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పడం కాదు.. ముందుగా లక్షాధికారులను చేసేందుకు చర్యలు తీసుకొండి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సిఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని కుంట్లరాంరెడ్డి పంక్షన్ హాల్‌లో బిఆర్‌ఎస్ సభ్యుత్వ నమోదు, సర్‌పై మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి పనులు చేయడం చేతకాక బిఆర్‌ఎస్ నేతలపై ఆసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళడంతోపాటు బిఆర్‌ఎస్ చేపట్టిన పథకాలను వివరించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ చేపట్టిన డిజిటల్ సభ్యుత్వంపై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి చేపట్టాలని సూచించారు. సమగ్ర ఓటరు నమోదుపై బూత్ స్థాయి బిఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే ఓటర్ల పేర్లు గల్లంతు అయ్యే అస్కారం ఉంటుందన్నారు. సర్ ఓటర్ జాబితా సవరణపై ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలన్నారు. లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టును అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతలు అప్పట్లో కోర్టుల్లో కేసులు పెట్టారని, అందుకే పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుందని వివరించారు. 90శాతం పనులు పూర్తి చేశామని, మిగిలిన 10శాతం పనులు చేసేందుకు ఎందుకు నాన్చుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. 12వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించమంటే విద్యార్థుల ఫీజులను పెంచడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వమే తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామ రక్ష అనే విషయాన్ని ప్రజలందరు గమనించారన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ బూత్ స్థాయి ఇన్‌చార్జీలు ఎన్నికలు ముగిసే వరకు ఉంటారని, ఓటర్లను కోఆర్డినేషన్ చేసుకొని పకడ్బందీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని, తప్పులు ఉంటే సరిచేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణిదేవి, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి బైకని శ్రీనివాస్ యాదవ్, నేతలు వి.నారాయణ రెడ్డి, రవీందర్ యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, రాంబల్‌నాయక్, రాజావరప్రసాద్, రాజ్యలక్ష్మి, జిల్లెల వెంకట్‌రెడ్డి, ఈట గణేష్, నరేందర్, పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్, మండల పార్టీల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, హాఫీజ్, పద్మారెడ్డి, మురళీధర్‌రెడ్డి, మెండే కృష్ణ, పాల్గొన్నారు.

# ఫిరాయింపులు నిరోధించండి

**లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లాకు శివసేన (యుబిటి) ఎంపిలు వినతి**

**ఎంపిలు పార్టీ మారేందుకు రూ. 50 కోట్లు ఆశ చూపుతున్నారు : సంజయ్ రౌత్**



**న్యూఢిల్లీ/ముంబయి :** మహారాష్ట్రలో రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. శివసేన (యుబిటి)కు చెందిన ఆరుగురు లేదా ఏడుగురు ప్రజాప్రతినిధులు అధికార శివసేనలోకి ఫిరాయించేందుకు సిద్ధమవుతున్నట్లు ఊహాగానాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన లోక్‌సభ ఎంపిలు అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజ్యసభ ఎంపి సంజయ్ రౌత్ బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. ఈ సమావేశం తర్వాత, చట్టవిరుద్ధమైన ఫిరాయింపులను నిరోధించాలని కోరుతూ స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు దేశాయ్ విలేకరులతో చెప్పారు. చట్టం ప్రకారం, మూడింట రెండు వంతుల మంది ఎంపిల మద్దతు ఉన్నప్పటికీ, వారు నేరుగా మరొక పార్టీలో విలీనం కాలేరని, ఒక వర్గానికి అవసరమైన మూడింట రెండు వంతుల బలం ఉన్నప్పటికీ, అసలు పార్టీ మాత్రమే విలీనం కాగలదు అని ఆయన అన్నారు. 'ఈ విషయంలో నిర్ణయాధికారం స్పీకర్‌దే. కాబట్టి, మూడింట రెండు వంతుల మద్దతు ఉందని చెప్పుకునే వర్గం మరొక పార్టీలో విలీనం కావడానికి ప్రయత్నిస్తే, ఆ వర్గాన్ని నిబంధనల ప్రకారం గుర్తించలేము; ఎందుకంటే చట్ట నిబంధనల ప్రకారం అసలు పార్టీ మాత్రమే విలీనం కాగలదు. ఆ వర్గంలో ఆరుగురు ఎంపిలు ఉన్నప్పటికీ ఫలితం ఉండదు' అని దేశాయ్ చెప్పారు. లోక్‌సభలో శివసేన (యుబిటి)కు తొమ్మిది మంది ఎంపిలు ఉన్నారు. ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడకుండా ఉండాలంటే, కనీసం ఆరుగురు ఎంపిలు కలిసి పార్టీ మారాల్సి ఉంటుంది. మహారాష్ట్రకు చెందిన కొందరు ఎంపిలకు పార్టీ మారేందుకు రూ. 50 కోట్లు ఆశచూపుతున్నారని గతంలో ఆరోపించిన రౌత్, ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు చట్టంలోని అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటానని స్పీకర్ బిర్లా తమకు హామీ ఇచ్చారని చెప్పారు. 'స్పీకర్ గౌరవనీయులైన వ్యక్తి. ఎవరైనా తనను కలవడానికి వస్తే అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకుంటానని ఆయన మాకు చెప్పారు' అని రౌత్ అన్నారు. సావంత్, దేశాయ్ కాకుండా, శివసేన (యుబిటి) ఎంపి రాజాభావు వాజే కూడా పార్టీ అధినేత ఉద్ధవ్ థాక్రేకు విధేయుడిగా ఉంటానని ప్రకటించారు. మిగిలిన ఆరుగురు ఎంపిలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని అధికార శివసేనలో చేరే అవకాశం ఉన్నవారిగా భావిస్తున్నారు. బిర్లాను కలవడానికి కొద్దిసేపటి ముందు, శివసేన (యుబిటి) ఎంపిలను డబ్బుతో ప్రలోభపెడుతున్నారని రౌత్ ఒక విలేకరుల సమావేశంలో ఆరోపించారు. 'దీనికి రూ. 50 కోట్ల ధర నిర్ణయించారని, అందులో ఒక్కొక్కరికి రూ. 15 కోట్లు బుధవారం రాత్రికి అందుతాయని నాకు తెలిసింది. డబ్బు చేతికి అందకుండా వారు విమానం ఎక్కడానికి ఇష్టపడలేదని సమాచారం' అని రౌత్ చెప్పారు. ఒకవేళ వారు వర్గం మారాలనుకుంటే పార్టీకి రాజీనామా చేయాలని సవాలు విసిరారు. ఉద్ధవ్ థాక్రే నాయకత్వంలోని పార్టీ కార్యకర్తలు వారి విజయానికి ఎంతో శ్రమించారని ఆయన గుర్తుచేశారు. 2022లో జరిగినట్లుగా పార్టీలో మరోసారి చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తే, మహారాష్ట్ర ప్రజలు, సేన (యుబిటి) కార్యకర్తలు తిరుగుబాటుదారులను వదిలిపెట్టరని ఆయన హెచ్చరించారు. పార్టీకి చెందిన తొమ్మిది మంది లోక్‌సభ ఎంపిలలో ఆరుగురు లేదా ఏడుగురు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని అధికార శివసేనలో చేరేందుకు మొగ్గు చూపుతూ ఢిల్లీలో మకాం వేయడంతో, సేన (యుబిటి) సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పార్టీ ఎంపిలను ఆకర్షించడానికి ఒత్తిడి, డబ్బు ప్రమేయం ఉందని రౌత్ ఆరోపించారు. కాగా, పార్టీలో తలెత్తబోయే చీలికను ఎదుర్కొంటున్న శివసేన (యుబిటి), బుధవారం నాడు తన ఎంపిలకు ఒక 'విప్' జారీ చేసింది. ముఖ్యమైన అంశాలపై చర్చించేందుకు ఢిల్లీలో జరిగే సమావేశానికి హాజరుకావాలని అందులో ఆదేశించింది. తిరుగుబాటు నాయకులపై అనర్హత వేటు వేసే ప్రక్రియకు మార్గం సుగమం చేయడమే ఈ చర్య ఉద్దేశం.

# కేంద్రానిది ప్రతీకారచర్య

**అమిత్ షా ప్రతిపక్షాలపై దాడి చేస్తూ భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు : కాంగ్రెస్**

**న్యూఢిల్లీ :** ఈ ఏడాది ఏప్రిల్ 17న లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేయడంలో విఫలమై ఎదురైన అవమానానికి కేంద్రం ప్రతీకార చర్యలకు పాల్పడుతుందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ క్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రతిపక్షాలపై దాడి చేస్తూ భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని మండిపడింది. కేవలం రెండేళ్ల క్రితం బలమైన బిజెపి వ్యతిరేక ఎజెండాతో ఎన్నికైన వారిని, షా ఆశ చూపి బిజెపిలో చేరేలా చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. షా తన అంతిమ లక్ష్యంలో విజయం సాధించలేరని కాంగ్రెస్ స్పష్టం చేసింది. 'మహారాష్ట్ర ఎంపిలను కొనుగోలు చేయడానికి రూ. 15 కోట్ల ముందస్తు చెల్లింపు జరుగుతోందని శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ మంగళవారం రాత్రి చేసిన వ్యాఖ్యల తర్వాత కాంగ్రెస్ ఈ విమర్శలు చేసింది. డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లులను ఆమోదింపజేయడంలో విఫలమై లోక్‌సభలో ఎదురైన అవమానానికి ప్రతీకారం తీర్చుకునేందుకు కేంద్ర హోం మంత్రి ప్రతిపక్షాలపై దాడిని, భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసే చర్యలను కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ అన్నారు. హోం మంత్రి పూర్తిగా అనైతికమైన ప్రచారాన్ని నడుపుతున్నారని, మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ మాదిరిగానే వ్యక్తుల అవసరాలకు అనుగుణంగా వివిధ పథకాలు, ఉత్పత్తులను ఆఫర్ చేస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎక్స్‌లో ఆరోపించారు.
'ఆయన నీచత్వానికి అంతులేదు. కానీ ఆయన తన అంతిమ లక్ష్యంలో విజయం సాధించలేరు' అని రమేశ్ స్పష్టం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) తరహాలో ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి) ఎంపిలు తిరుగుబాటు చేయవచ్చనే ఊహాగానాలు బలపడ్డాయి; అధికార శివసేన నాయకుడు ప్రతాప్ సర్నాయిక్ అసమ్మతివాదులను స్వాగతిస్తామని, వారు పార్టీ మారితే వారికి ప్రాధాన్యత ఇస్తామని సంకేతాలు ఇవ్వడమే దీనికి కారణం.

## అనైతికం, రాజ్యాంగ విరుద్ధం

**పార్టీ ఫిరాయింపులపై కపిల్ సిబల్ వ్యాఖ్య**



**న్యూఢిల్లీ :** ఒక పార్టీ గుర్తుపై పార్లమెంటుకు ఎన్నికైన తర్వాత వేరే పార్టీలోకి మారడం 'అనైతికం, చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం' అని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ బుధవారం అన్నారు. దీనిపై నిర్ణయం ఇప్పుడు కోర్టు చేతిలో ఉంది అని ఆయన స్పష్టం చేశారు. శివసేన (యుబిటి)కు చెందిన ఆరుగురు లేదా ఏడుగురు ప్రజాప్రతినిధులు పార్టీ మారడానికి సిద్ధమవుతున్నారన్న సంకేతాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికలు ఎందుకు? ఒక పార్టీ గుర్తు మిమ్మల్ని పార్లమెంటుకు పంపినప్పుడు, మీరు మరొక గుర్తుతో ఉన్న వేరే పార్టీలో ఎలా చేరగలరు? మీరు ఆ గుర్తుపై ఎన్నికవ్వలేదు కదా! అని ప్రశ్నించారు. రాజ్యాంగ చట్టంలోని ఏ సూత్రం కూడా దీనిని అనుమతించదని ఆ సీనియర్ న్యాయవాది పేర్కొన్నారు. ఈ చర్య అనైతికం, చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని, ఇక కోర్టు నిర్ణయమే కీలకమనిసిబల్ పేర్కొన్నారు.

## 'వి ది లీడర్స్' ఉద్యమం జులై నాటికి రాజకీయ పార్టీ

**50 లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నాం : అన్నామలై**



**చెన్నై :** తాను ఇటీవల ప్రారంభించిన 'వి ది లీడర్స్' ఉద్యమం జులై నాటికి రాజకీయ పార్టీగా మారే దిశగా సరైన మార్గంలో సాగుతోందని తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై తెలిపారు. 50 లక్షల మంది సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం 18 లక్షల మంది సభ్యులు ఎటువంటి అంచనాలు లేకుండానే ఈ సంస్థలో చేరారని పేర్కొన్న అన్నామలై, సోషల్ మీడియా వేదికగా జరిగిన వీడియో సంభాషణలో మాట్లాడారు. సభ్యత్వ నమోదు కేవలం ఆన్‌లైన్ ద్వారానే కాకుండా ప్రజలను నేరుగా కలవడం ద్వారా కూడా జరుగుతోందని చెప్పారు. ఈ ఉద్యమం పెద్ద మార్పును తీసుకువస్తుందనే నమ్మకంతో సభ్యులు చేరారని పేర్కొన్న ఆయన, ఈ ఉద్యమాన్ని రాజకీయ పార్టీగా ప్రారంభించిన తర్వాత, జులై నుండి దీని కార్యకలాపాలు భిన్నమైన స్వభావాన్ని సంతరించుకుంటాయని చెప్పారు. ప్రజలు దానిని చూడబోతున్నారన్నారు. తన ఉద్యమం 'విఫలం కాదు, అబద్ధం చెప్పదు, ప్రజలను తప్పుదారి పట్టించదు' అని అన్నామలై పేర్కొన్నారు. తమకు అన్ని మతాలు సమానమే, అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. రానున్న నెలల్లో ఈ సభ్యత్వ నమోదు ప్రక్రియను కొనసాగించడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని యువతలో మాదకద్రవ్యాల సమస్య వంటి వివిధ అంశాలను ప్రస్తావించిన అన్నామలై, దీనిని క్షేత్రస్థాయిలో ఒక భారీ ప్రజా ఉద్యమంగా చేపడతామని చెప్పారు. రాజకీయాల్లోకి ఎలా ప్రవేశించాలో తెలియక సాంకేతిక నిపుణులు (టెక్నోక్రాట్స్) సందిగ్ధంలో ఉన్నారని కూడా ఆయన అన్నారు. అమెరికా, లండన్ వంటి దేశాలతో సహా ప్రపంచవ్యాప్తంగా స్థిరపడి, ఎంతో సాధించిన 40 నుండి 50 ఏళ్ల వయస్సు గల తమిళులకు ఇక్కడ రాజకీయాల్లోకి ఎలా రావాలో తెలియడం లేదన్నారు. రాజకీయ పార్టీగా మారిన తర్వాత తన సంస్థ రాజకీయ నాయకులకు పదవీ కాల పరిమితిని కూడా తీసుకువస్తుందని అన్నామలై చెప్పారు. పాతవారిని పక్కన పెట్టి కొత్తవారిని తీసుకురావడం అనేది నిరంతరం జరగాలని స్పష్టం చేశారు.

## ఎస్‌పి ఐక్యంగానే ఉంది

**యుపి మంత్రి ఓం ప్రకాశ్ రాజ్‌భర్ వ్యాఖ్యలను కొట్టిపారేసిన అఖిలేశ్ యాదవ్**



**లక్నో :** సమాజ్‌వాదీ పార్టీలో త్వరలో చీలిక రాబోతోందన్న ఉత్తరప్రదేశ్ మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ వ్యాఖ్యలను అఖిలేష్ యాదవ్ కొట్టిపారేశారు. పార్టీ బలంగా ఉందని, ప్రలోభాలు, ఒత్తిడి ద్వారా ఇతర పార్టీల నాయకులను తమ వైపు తిప్పుకునే (పార్టీ ఫిరాయింపులను ప్రేరేపించే) చరిత్ర బిజెపికే ఉందని ఆయన అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి)లో అసంతృప్తి నెలకొందన్న వార్తలపై అఖిలేశ్ విలేకరుల సమావేశంలో స్పందిస్తూ, గతంలో బిజెపి అనేక పార్టీలను విచ్ఛిన్నం చేయడంలో, అలాగే ఎస్‌పికి చెందిన శాసనసభ్యులు, నాయకులను తమ వైపు లాక్కోవడంలో విజయం సాధించిందని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ విషయానికొస్తే, ఎస్‌పికి చెందిన అనేకమంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులను కూడా వారు తమ వైపు తిప్పుకున్నారని, దీని వెనుక ఏదో ఒక స్వార్థం, ప్రలోభం లేదా భయం ఉండి ఉండాలి... భయపడేవారే తమ పార్టీని వదిలి వెళ్తారని ఆయన అన్నారు. అంతకుముందు, సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బిఎస్‌పి) అధినేత రాజ్‌భర్ మాట్లాడుతూ, ఎస్‌పిలో పెద్ద ఎత్తున చీలిక వచ్చే అవకాశం ఉందని, పార్టీకి చెందిన పలువురు నాయకులు బిజెపిలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎస్‌పి సీనియర్ నాయకుడు రామ్ గోపాల్ యాదవ్ అమిత్ షాకు లేఖ సమర్పించారని రాజ్‌భర్ ఆరోపించారు. అయితే ఆ లేఖకు సంబంధించిన వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. గతంలో జరిగిన అక్రమాలు లేదా కుంభకోణాలపై జరుగుతున్న విచారణల ఒత్తిడి కారణంగా ఎస్‌పి ఆందోళనలో ఉందని, అందుకే ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు బిజెపిలో చేరడానికి సిద్ధమవుతున్నారని కూడా ఆయన పేర్కొన్నారు. అయితే, అఖిలేశ్ రాజ్‌భర్ వ్యాఖ్యలను తోసిపుచ్చారు. ఎస్‌పి ఐక్యంగానే ఉందని, తన ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందని, ఇది ఒక బలమైన పార్టీ, అలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## టిఎంసి చీలిక... అభిషేక్ బెనర్జీకి లోక్‌సభ స్పీకర్ పిలుపు



**న్యూఢిల్లీ :** మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చీలికకు సంబంధించిన అంశంపై తన వాదనను వినిపించేందుకు, ఈనెల 19న సమావేశం కావాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీని ఆహ్వానించినట్లు పార్లమెంటరీ వర్గాలు తెలిపాయి. అయితే, మధ్యాహ్నం 3 గంటల వరకు స్పీకర్ కార్యాలయం నుండి తమకు ఎటువంటి సమాచారం అందలేదని తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా'లో విలీనం అయిన తర్వాత తమను ప్రత్యేక వర్గంగా గుర్తించాలని 20 మంది అసమ్మతి తృణమూల్ కాంగ్రెస్ ఎంపిలు డిమాండ్ చేస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు రెండు వర్గాల వాదనలను వినాలని బిర్లా నిర్ణయించారు. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ లో ప్రత్యేక వర్గంగా చెప్పుకునే ఏ సమూహానికైనా ఎటువంటి గుర్తింపు, హోదా లేదా సదుపాయం కల్పించవద్దని కోరుతూ అభిషేక్ బెనర్జీ ఈనెల 10న లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు. అస్తిత్వంలో ఉన్న రాజకీయ పార్టీలో ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేయడానికి రాజ్యాంగం, ఫిరాయింపుల నిరోధక చట్టం అనుమతించవని బెనర్జీ స్పష్టం చేశారు. పార్టీ ఎంపిలు కీర్తి ఆజాద్, సాగరిక ఘోష్ కూడా ఆదివారం బిర్లా నివాసానికి వెళ్లి ఆ లేఖను ఆయనకు అందజేశారు. 'ఎఐటిసిని దాని అధికారిక నేత, విప్ ద్వారా మాత్రమే సభలో ప్రాతినిధ్యం వహించే ఏకైక రాజకీయ పార్టీగా పరిగణించండి; ఎఐటిసికి చెందినదిగా చెప్పుకునే ఏ ప్రత్యేక సమూహానికి లేదా వర్గానికి గుర్తింపు, హోదా లేదా సదుపాయం కల్పించవదు' అని బెనర్జీ తన లేఖలో పేర్కొన్నారు. మహారాష్ట్ర రాజకీయ సంక్షోభంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, పదవ షెడ్యూల్ ప్రకారం 'చీలిక' అనే వాదనకు ఇకపై అవకాశం లేదని, చట్టపరమైన విధానం ఒక రాజకీయ పార్టీని గుర్తించడమే తప్ప, అందులోని ప్రత్యర్థి వర్గాలను గుర్తించడం కాదని బెనర్జీ వాదించారు. 'పైన పేర్కొన్న తరహా సమాచారం ఏదైనా అందినట్లయితే, దానిపై నిర్ణయం తీసుకునే ముందు ఎఐటిసికి తమ వాదనను వినిపించే అవకాశాన్ని కల్పించండి' అని ఆయన అన్నారు. ఏదైనా విలీన ప్రకటన చెల్లుబాటు కావాలంటే రాజకీయ పార్టీ విలీనం, మూడింట రెండు వంతుల మంది శాసనసభ్యుల మద్దతు రెండూ అవసరమని, చట్టం ప్రకారం ఈ షరతులలో ఒకదానిని మాత్రమే నెరవేర్చడం సరిపోదని కూడా బెనర్జీ పేర్కొన్నారు.

## పోలీసులపై ఉగ్రదాడికి కుట్ర

**ఐఎస్ఐ ఉగ్రముఠాతో సంబంధమున్నట్లు అనుమానిస్తున్న ఐదుగురు అరెస్టు**

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ షాజాద్ భట్టితో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అంతర్రాష్ట్ర ఉగ్రవాద ముఠాకు చెందిన మరో ఐదుగురు అరెస్టు అయ్యారు. పోలీసు సిబ్బందిపై దాడులకు కుట్ర పన్నడం, ఐఎస్ఐ మద్దతుగల సంస్థకు ప్రచారం కల్పించడం వంటి ఆరోపణలపై వీరిని అరెస్టు చేసినట్లు ఢిల్లీ పోలీసు అధికారి బుధవారం తెలిపారు. మే 7న 'ఆపరేషన్ గ్యాంగ్ బస్ట్ 2.0' సందర్భంగా ఈ ముఠాకు చెందిన ముగ్గురిని పట్టుకున్న ఒక నెల తర్వాత ఈ తాజా అరెస్టులు జరిగాయి. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్టుల సంఖ్య ఎనిమిదికి చేరింది. 'ఢిల్లీ, పొరుగు రాష్ట్రాల్లోని పోలీసు సిబ్బందిని లక్ష్యంగా చేసుకోవడం, పోలీస్ స్టేషన్లు, భద్రతా సంస్థల వద్ద రెక్కీ నిర్వహించడం, ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో గ్రాఫిటీ, పోస్టర్ల ద్వారా తెహ్రీక్-ఎ-తాలిబాన్ హిందుస్థాన్ (టిటిహెచ్) అనే ఉగ్రవాద సంస్థను ప్రచారం చేయడం వంటి పనులను నిందితులకు అప్పగించారు' అని ఒక సీనియర్ పోలీసు అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అరెస్టు అయిన వారిని ఫరీదాబాద్‌కు చెందిన సోహైల్ (26), ఢిల్లీలోని ఘిటోర్నీకి చెందిన సోను మీనా (30), రాజస్థాన్‌లోని దౌసా జిల్లాకు చెందిన సచిన్ కుమార్ మీనా (20), హర్యానాలోని నుహ్‌కు చెందిన మహమ్మద్ కైఫ్ (21), ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మహమ్మద్ రిహాన్ (20)గా గుర్తించారు. పాకిస్థాన్‌కు చెందిన హ్యాండ్లర్ షాజాద్ భట్టి, ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) మద్దతుతో, పాకిస్థాన్‌లోనే ఉన్న హసన్ గుజ్జర్, రాణా హుసైన్, అబిద్ జుట్, మోసిన్ వంటి సహచరుల ద్వారా ఈ ముఠాను నడుపుతున్నాడని పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పోలీసులు ఐదు తుపాకులు, 10 సజీవ తూటాలు, పోస్టర్లు, ఇంకా పోలీసు సిబ్బందికి బెదిరింపులను వెల్లడిస్తున్నట్లు ఆరోపణలు ఉన్న వీడియోలు, లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్న వారి నిఘా వివరాలు కలిగిన డిజిటల్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. 'స్పెషల్ సెల్, భట్టి, అతని నెట్‌వర్క్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ, మానవ వనరులు, సాంకేతిక నిఘా ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా ఈ అరెస్టులు జరిగాయి' అని పోలీసు అధికారి తెలిపారు.

## దేశ వార్షిక రక్షణరంగ ఉత్పత్తి రూ. 1.78 లక్షల కోట్లకు చేరిక



**న్యూఢిల్లీ :** భారతదేశ వార్షిక రక్షణ రంగ ఉత్పత్తి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 1.78 లక్షల కోట్ల గరిష్ఠ స్థాయికి చేరుకుందని రక్షణ మంత్రిత్వ శాఖ బుధవారం తెలిపింది. ఈ మైలురాయి గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ. 1.54 లక్షల కోట్ల ఉత్పత్తితో పోలిస్తే 15.6 శాతం వృద్ధిని, అలాగే రూ. 84,643 కోట్లుగా ఉన్న 2020-21 నాటి గణాంకాలతో పోలిస్తే ఏకంగా 110 శాతం పెరుగుదలను సూచిస్తోందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇటీవలి కాలంలో భారతదేశ రక్షణ రంగ ఉత్పత్తిలో కనిపించిన ఈ అద్భుతమైన పెరుగుదల, రక్షణ ఉత్పత్తి విభాగం, ఇతర భాగస్వాములందరి సమష్టి కృషి ఫలితమేనని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ వృద్ధి ధోరణి దేశం విస్తరిస్తున్న రక్షణ పారిశ్రామిక పునాదికి స్పష్టమైన సంకేతమని ఆయన అన్నారు. 'నిరంతర విధానపరమైన మద్దతు, అనేక కొత్త కార్యక్రమాలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం పెంపు, పెరుగుతున్న ఎగుమతి సామర్థ్యాలతో, రాబోయే సంవత్సరాల్లో రక్షణ ఉత్పత్తి రంగం మరింత వేగంగా వృద్ధి చెందడానికి సిద్ధంగా ఉంది' అని ఆయన పేర్కొన్నారు. రక్షణ రంగ ఉత్పత్తిలో ఈ పెరుగుదల అత్యంత భారీగా ఉందని, రూ. 84,643 కోట్లుగా ఉన్న 2020-21 నాటి గణాంకాలతో పోలిస్తే ఇది 110 శాతం పెరుగుదల అని మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే, స్వదేశీ రక్షణ రంగ ఉత్పత్తి 2013-14లో ఉన్న రూ. 43,746 కోట్ల స్థాయి నుండి దాదాపు నాలుగు రెట్లు పెరిగిందని పేర్కొంది. మొత్తం ఉత్పత్తిలో రక్షణ రంగ ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల వాటా సుమారు 76 శాతంగా ఉండగా, ప్రైవేట్ రంగం 24 శాతం వాటాను అందించింది; ఇది 2024-25లో ఉన్న 22 శాతం వాటా కంటే ఎక్కువ అని మంత్రిత్వ శాఖ తెలిపింది. 2025-26లో ప్రైవేట్ రంగం వాటా సుమారు రూ. 42,000 కోట్లతో గరిష్ఠ స్థాయికి చేరుకుంది, ఇది రక్షణ రంగ వ్యవస్థలో ఆ రంగం యొక్క విస్తరిస్తున్న పాత్రను ప్రతిబింబిస్తుంది అని మంత్రిత్వ శాఖ పేర్కొంది. గత కొన్నేళ్లుగా రక్షణ రంగ ఉత్పత్తిలో నమోదైన వృద్ధి, 2025-26లో రూ. 38,424 కోట్ల రికార్డు స్థాయి రక్షణ ఎగుమతులను సాధించడంలో అత్యంత కీలక పాత్ర పోషించిందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని 'ఆత్మనిర్భర్ భారత్' చొరవలో భాగంగా, రక్షణ రంగ తయారీలో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు లభిస్తున్న ఊపును ఈ విజయం ప్రతిబింబిస్తోంది' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


**ఫారం-VI**

(నియమం-19 లోని ఉప-నియమం(1) మరియు చట్టం-30/2013 లోని సెక్షన్-11(1) చూడండి)

**తెలంగాణ ప్రభుత్వము**
**రెవెన్యూ శాఖ**

**జిల్లా కలెక్టర్ కార్యాలయం ఫైలు సంఖ్య: జి/537/2026** — **తేదీ: 15.06.2026**
**ఆర్.డి.ఒ. కార్యాలయం ఫైల్ సంఖ్య: బి/1411/2026** — **తేదీ: 12.06.2026**
**గెజిట్ సంఖ్య : VKB-68/2026** — **తేదీ: 15.06.2026**

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల నీటిపారుదల పథకం (Lift Irrigation Scheme)లో భాగంగా, కానుకుర్తి చెరువు నుండి దౌల్తాబాద్ చెరువు వరకు 'గ్రావిటీ కెనాల్-1' (Gravity Canal-I) నిర్మాణం కోసం భూమిని సేకరించాల్సిన అవసరం ఉందని తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ బావిస్తున్నారు; ఇందుకోసం వికారాబాద్ జిల్లా, దౌల్తాబాద్ మండలం, దౌల్తాబాద్ గ్రామంలో మొత్తం **25 ఎకరాల 10 గుంటల** భూమి అవసరమై ఉంది. ఈ భూమి కొడంగల్ ఇరిగేషన్ డివిజన్-9 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (Executive Engineer) అవసరాల నిమిత్తం సేకరించబడుతోంది.
'భూసేకరణలో సరైన పరిహారం మరియు పారదర్శకత, పునరావాసం మరియు పునఃస్థాపన (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం సంఖ్య 21/2017) లోని అధ్యాయంIII-A, సెక్షన్ 10A (b) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ, 'నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల నీటిపారుదల పథకం' (Narayanpet-Kodangal Lift Irrigation Scheme) విషయంలో 'భూసేకరణలో సరైన పరిహారం మరియు పారదర్శకత, పునరావాసం మరియు పునఃస్థాపన చట్టం, 2013' లోని అధ్యాయం II మరియు III నిబంధనల వర్తింపు నుండి మినహాయింపునిస్తూ తెలంగాణ ప్రభుత్వ నీటిపారుదల & CAD శాఖ G.O.Ms.No.3 (తేదీ: 12.02.2025)ను జారీ చేసింది. అందువల్ల, సదరు చట్టంలోని అధ్యాయం II మరియు III పరిధిలోకి వచ్చే ప్రక్రియలేవీ ఈ పథకం విషయంలో చేపట్టబడలేదు. ప్రభావిత కుటుంబాల పునరావాసం మరియు పునఃస్థాపన పనుల నిమిత్తం వికారాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)ను 'అడ్మినిస్ట్రేటర్ 'గా నియమించడం జరిగింది.
కావున, వికారాబాద్ జిల్లా, దౌల్తాబాద్ మండలం, దౌల్తాబాద్ గ్రామంలోని పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం, సుమారు **25 ఎకరాల 10 గుంటల** (అంటే ప్రామాణిక కొలత ప్రకారం 10.21831 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన భూమిని (దీని పూర్తి వివరాలు కింద ఇవ్వబడ్డాయి) స్వాధీనం చేసుకుంటున్నట్లు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

గ్రామం : దౌల్తాబాద్ — మండలం : దౌల్తాబాద్ — జిల్లా : వికారాబాద్

| క్రమ సంఖ్య | సర్వే నం. | భూ స్వభావం | భూ వర్గీకరణ | భూసేకరణ క్రింద తీసుకోబడే విస్తీర్ణం (ఎ.గు.) | పట్టాదారుని పేరు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు రకము | సంఖ్య | నిర్మాణాలు రకము | విస్తీర్ణం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 596 | పట్టా | మెట్ట | 0-07 | నారాయణ హరి రాథోడ్ S/o హర్యా నాయక్ | సర్వేనెం. 597 | సర్వేనెం. 613 | సర్వేనెం. 596P | సర్వేనెం. 612 | - | - | - | - |
| 2 | | పట్టా | మెట్ట | | హరి వాల్య రాథోడ్ S/o. వాల్యా వినాయక్ | సర్వేనెం. 597 | సర్వేనెం. 613 | సర్వేనెం. 596P | సర్వేనెం. 612 | - | - | - | - |
| 3 | 597/A/1 | పట్టా | మెట్ట | 0-14 | హరి వాల్య రాథోడ్ S/o. వాల్యా నాయక్ | సర్వేనెం. 598,605 | సర్వేనెం. 596 | సర్వేనెం. 596 | సర్వేనెం. 612 | - | - | - | - |
| 4 | 598/2A | పట్టా | మెట్ట | 0-05 | సంద్రుక రాములు S/o శ్యామప్ప | సర్వేనెం. 599 | సర్వేనెం. 596 | సర్వేనెం. 592 | సర్వేనెం. 604 | - | - | - | - |
| 5 | 598/2AA | పట్టా | మెట్ట | | సత్యమ్మ W/O. సంద్రూక మొగులప్ప | సర్వేనెం. 599 | సర్వేనెం. 596 | సర్వేనెం. 592 | సర్వేనెం. 604 | - | - | - | - |
| 6 | 603 | పట్టా | మెట్ట | 0-21 | ఇందనూరు నర్సమ్మ W/o. నర్సప్ప | సర్వేనెం. 602 | సర్వేనెం. 604,605 | సర్వేనెం. 603P | సర్వేనెం. 603P | - | - | - | - |
| 7 | 604/2 | పట్టా | మెట్ట | 0-09 | సంద్రుక రాములు S/o. శ్యామప్ప | సర్వేనెం. 603 | సర్వేనెం. 605 | సర్వేనెం. 604P | సర్వేనెం. 605 | చింత -1 | - | - | - |
| 8 | 605 | పట్టా | మెట్ట | 1-32 | బి లలితమ్మ W/o. నరోత్తం రెడ్డి, బి.వెంకట్ రెడ్డి S/o. నరోత్తం రెడ్డి, బి.శ్రీకాంత్ రెడ్డి S/O. నరోత్తం రెడ్డి | సర్వేనెం. 603 | సర్వేనెం. 612, 597 | సర్వేనెం. 598, 604 | సర్వేనెం. 605 | వేప చెట్లు | - | - | - |
| 9 | 612/2/1 | పట్టా | మెట్ట | 1-27 | వడ్ల నర్సింహా చారి S/o కిష్టయ్య | సర్వేనెం. 605 | సర్వేనెం. 614 | సర్వేనెం. 597 | సర్వేనెం. 612P | మామిడి | - | - | - |
| 10 | 613/A/1 | పట్టా | మెట్ట | 0-38 | హరి వాల్య రాథోడ్ S/o. వాల్యా | సర్వేనెం. 596 | సర్వేనెం. 615 | సర్వేనెం. 613P | సర్వేనెం. 613P | - | - | - | - |
| 11 | 614/A/1 | పట్టా | మెట్ట | 0-15 | వడ్ల కృష్ణ హరి S/O. బ్రహ్మ చారి | సర్వేనెం. 612 | సర్వేనెం. 615 | సర్వేనెం. 615 | సర్వేనెం. 614P | టేక్ ట్రీ | - | - | - |
| 12 | 615/ఆ | పట్టా | మెట్ట | 4-08 | పల్లెవోని భీమప్ప S/o హన్మప్ప | సర్వేనెం. 613 | సర్వేనెం. 616 | సర్వేనెం. 618 | సర్వేనెం. 614 | చింత చెట్టు | - | - | - |
| 13 | 615/1 | పట్టా | మెట్ట | | పల్లెవోని చెన్నప్ప S/O బసప్ప | సర్వేనెం. 613 | సర్వేనెం. 616 | సర్వేనెం. 618 | సర్వేనెం. 614 | - | - | - | - |
| 14 | 615/ఇ | పట్టా | మెట్ట | | పల్లెవోని మల్కప్ప S/o హన్మప్ప | సర్వేనెం. 613 | సర్వేనెం. 616 | సర్వేనెం. 618 | సర్వేనెం. 614 | - | - | - | - |
| 15 | 615/అ/1 | పట్టా | మెట్ట | | పల్లెవోని బసంతమ్మ S/o P.Yellappa | సర్వేనెం. 613 | సర్వేనెం. 616 | సర్వేనెం. 618 | సర్వేనెం. 614 | - | - | బోర్ -1 | - |
| 16 | 616/ఆ1 | పట్టా | మెట్ట | 1-38 | చాకలి భీమప్ప S/o రామప్ప | సర్వేనెం. 615 | సర్వేనెం. 617 | సర్వేనెం. 616P | సర్వేనెం. 616 | - | - | - | - |
| 17 | 616/ఇ/1 | పట్టా | మెట్ట | | చాకలి శేఖర్ S/o లక్ష్మ ప్ప | సర్వేనెం. 615 | సర్వేనెం. 617 | సర్వేనెం. 616P | సర్వేనెం. 626 | - | - | - | - |
| 18 | 616/ఇ/2 | పట్టా | మెట్ట | | చాకలి లక్ష్మ ప్ప S/o సాయప్ప | సర్వేనెం. 615 | సర్వేనెం. 617 | సర్వేనెం. 616P | సర్వేనెం. 626 | - | - | - | - |
| 19 | 616/ఇ-2 | పట్టా | మెట్ట | | చాకలి సావిత్రమ్మ S/o చాకలి అశోక్ | సర్వేనెం. 615 | సర్వేనెం. 617 | సర్వేనెం. 616P | సర్వేనెం. 626 | మామిడి | - | - | - |
| 20 | 617/ఇ/2 | పట్టా | మెట్ట | 1-28 | చాకలి లక్ష్మ ప్ప S/o సాయప్ప | సర్వేనెం. 616 | సర్వేనెం. 622 | సర్వేనెం. 617P | సర్వేనెం. 624 | - | - | - | - |
| 21 | 617/ఇ/1 | పట్టా | మెట్ట | 0-33 | చాకలి విజయమ్మ w/o శేఖర్ | సర్వేనెం. 616 | సర్వేనెం. 622 | సర్వేనెం. 617P | సర్వేనెం. 624 | - | - | - | - |
| 22 | 617/అ/2/1 | పట్టా | మెట్ట | 0-01 | చాకలి భీమప్ప S/o మల్కప్ప | సర్వేనెం. 616 | సర్వేనెం. 622 | సర్వేనెం. 617P | సర్వేనెం. 624 | - | - | - | - |
| 23 | 617/అ/1 | పట్టా | మెట్ట | 0-06 | చాకలి మల్కమ్మ S/o ఆనందుడు | సర్వేనెం. 616 | సర్వేనెం. 622 | సర్వేనెం. 617P | సర్వేనెం. 624 | - | - | - | - |
| 24 | 617/అ/3/1 | పట్టా | మెట్ట | 0-19 | చాకలి కృష్ణ S/o మాణిక్యప్ప | సర్వేనెం. 616 | సర్వేనెం. 622 | సర్వేనెం. 617P | సర్వేనెం. 624 | - | - | - | - |
| 25 | 622/4 | పట్టా | మెట్ట | 1-13 | కుర్వ మణెమ్మ, ఫకీరప్ప బిడ్డ | సర్వేనెం. 617 | సర్వేనెం. 621 | సర్వేనెం. 622P | సర్వేనెం. 622P | - | - | - | - |
| 26 | 622/అ5/2 | పట్టా | మెట్ట | 1-12 | కృష్ణయ్య, జంబులయ్య బిడ్డ | సర్వేనెం. 617 | సర్వేనెం. 621 | సర్వేనెం. 622P | సర్వేనెం. 622P | - | - | - | - |
| 27 | 622/2/2 | పట్టా | మెట్ట | 0-16 | అన్నసారం నారాయణరెడ్డి, వెంకట్ రెడ్డి బిడ్డ | సర్వేనెం. 617 | సర్వేనెం. 621 | సర్వేనెం. 622P | సర్వేనెం. 622P | - | - | - | - |
| 28 | 622/5అ | పట్టా | మెట్ట | 0-27 | గోపాల్, అనంతప్ప బిడ్డ | సర్వేనెం. 617 | సర్వేనెం. 621 | సర్వేనెం. 622P | సర్వేనెం. 622P | - | - | - | - |
| 29 | 621 | పట్టా | మెట్ట | 2-01 | తోక రాములు S/o కిస్తప్పా, తోక నరసప్ప తండ్రి లచప్ప, తోక కిష్టప్ప తండ్రి సాయప్ప, కురవా చిన్న ముత్యప్ప తండ్రి నరసప్ప, కిష్టప్ప తండ్రి పకీరప్ప | సర్వేనెం. 622 | సర్వేనెం. 635 | సర్వేనెం. 621P | సర్వేనెం. 621P | - | - | బోర్ వెల్ -2 | - |
| 30 | 635 | పట్టా | మెట్ట | 4-00 | సంగాయిపల్లి రాములు S/o చిన్న సాయప్ప, సంగాయిపల్లి అంజిలప్ప S/o శ్రీరాములు, సంగేపల్లి పెద్ద రాములు S/o పెద్ద సాయప్ప, కొండ్రు ఆశమ్మ w/o పెద్ద రాములు, ఒలిగిరి లక్ష్మి W/O సంగేపల్లి వెంకటప్ప, సంగాయిపల్లి వసంత W/O శేఖర్, మల్కప్ప S/o సాయప్ప, శారద S/O చెన్నప్ప, ఒలిగిరి మల్కమ్మ S/O నర్సప్ప, సంగైపల్లి దస్తప్ప S/o మల్కప్ప | సర్వేనెం. 621 | తిమ్మరెడ్డిపల్లి శివారు | సర్వేనెం. 568 | సర్వేనెం. 636 | మామిడి చెట్లు -1 | - | - | - |
| | Total | | | 25.10 | | | | | | | | | |

సంబంధిత వ్యక్తులందరికీ తెలియజేయునదేమనగా, 'భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం, 2013' (చట్టం సంఖ్య 30/2013) లోని సెక్షన్-11(1) నిబంధనల ప్రకారం ఈ ప్రకటన జారీ చేయబడింది.
కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ వికారాబాద్ కార్యాలయంలో లేదా తాండూరు డివిజన్ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో, పనిదినాలలో పనివేళల సమయంలో ఈభూమికి సంబంధించిన ప్లాన్ ను పరిశీలించవచ్చు. సదరు చట్టంలోని సెక్షన్-12లో నిర్దేశించిన విధంగా తమ విధులను సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన పనులను అంటే భూమిలోకి ప్రవేశించడం, సర్వేచేయడం, భూమిస్థాయిలను (levels) కొలవడం, ఉప-మృత్తికను (sub-soil) తవ్వడం లేదా బోరింగ్ వేయడం వంటివి చేయడానికి తాండూరు డివిజన్ రెవెన్యూ డివిజనల్ అధికారికి మరియు వారి సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ (తగిన అధికారం కలిగిన ప్రభుత్వం) అధికారాన్ని మంజూరు చేస్తోంది.
చట్టంలోని సెక్షన్11(4) ప్రకారం, సంబంధిత నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి, కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ఏవ్యక్తి కూడా ఆభూమికి సంబంధించి ఎటువంటి లావాదేవీని (అంటే అమ్మకం, కొనుగోలు మొదలైనవి) జరపకూడదు లేదా జరిపించకూడదు, అలాగే ఆభూమిపై ఎటువంటి భారాన్ని (encumbrance) సృష్టించకూడదు.
ఈ చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం, ఈప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవై) రోజులలోపు, సదరు సేకరణపై ఆసక్తి గల వ్యక్తులు జిల్లా కలెక్టర్ వద్ద తమ అభ్యంతరాలను దాఖలు చేయవచ్చు.

సం/- తహశీల్దార్ దౌల్తాబాద్ మండలం
సం/- రెవెన్యూ డివిజనల్ అధికారి & భూసేకరణ అధికారి, తాండూర్ డివిజన్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), వికారాబాద్ జిల్లా
సం/- జిల్లా కలెక్టర్, వికారాబాద్ జిల్లా

DIPR RO NO. 316/LA/PP/Advt/Pub/2026-27

# అదేమీ 'తుది ఒప్పందం' కాదు

● సరిగ్గా ప్రవర్తించకపోతే ఇకపై బాంబులు వేస్తాం ● జి–7 ముగింపు సమావేశంలో ట్రంప్ హెచ్చరిక ● ఒప్పందానికి కట్టుబడితేనే 300బిలియన్ డాలర్ల నిధి ● ఇంకా తుది ఒప్పందానికి రాలేదు : పెజెష్కియన్



**వాషింగ్టన్:** రేపు (శుక్రవారం) సంతకాలు చేసే ఒప్పందమే ''తుది ఒప్పందం కాదు'' అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. తూర్పు ఫ్రాన్స్ ఎవియాన్–లెస్–బైన్స్ రిసార్ట్‌లో జి–7 సదస్సు ముగింపు సమావేశంలో బుధవారం ట్రంప్ పైవిధంగా చెప్పారు. ''వాళ్ళు సరిగ్గా ప్రవర్తించకపోతే మేం వారి నెత్తి మీద (తల మధ్యలో) బాంబులు వేస్తాం..సరేనా?'' అన్నారు. వాస్తవానికి అమెరికా–ఇరాన్ మధ్య ఆదివారం ప్రకటించింది ప్రాథమిక ఒప్పందం మాత్రమే. అదేవిధంగా ఇరాన్ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ సోమవారం చేసిన ప్రకటనలో,అమెరికా–ఇరాన్ మధ్య ఇంకా తుది ఒప్పందం జరగలేదన్నారు. ఈ ప్రాథమిక ఒప్పందం యుద్ధం ముగించి చర్చల దిశగా వేసే ఒక ముందడుగు మాత్రమేనని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ ఒప్పందంలో ఏముందో ఎవరికీ తెలియదు. ఒప్పంద పూర్తి పాఠం ఇంకా వెల్లడికాలేదు. రాబోయే ఇరవైనాలుగ్గంటలలో ఒప్పంద పూర్తిపాఠాన్ని ట్రంప్ ప్రకటిస్తారని జె..డి.వాన్స్(ఉపాధ్యక్షుడు) ఇప్పటికే ప్రకటించారు. ఈ ఒప్పందం రెండో దశలోకి ప్రవేశించిందని కూడా ట్రంప్ చెప్పారు. రెండు దేశాలమధ్యా కుదిరిన ఒప్పందం పూర్తిపాఠాన్ని ప్రతి పదాన్ని ఒక అధికారితో చదివించి పత్రికాగోష్ఠిలో వివరంగా తెలియజేస్తానని చెప్పారు. ఈ ఒప్పందంపై డిజిటల్ పద్ధతిలో ఇప్పటికే సంతకాలు జరిగాయని కూడా చెప్పారు. ఇదిలా ఉండగా, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ బుధవారం సిబిఎస్‌తో మాట్లాడుతూ, ఇరాన్ గనుక ఒప్పందానికి కట్టుబడితే గల్ఫ్ దేశాల మద్దతు ఉన్న 300 బిలియన్ డాలర్ల పునర్నిర్మాణ నిధిని పొందవచ్చునని అన్నారు. ఇందులో సగం మొత్తాన్ని ఇప్పటికే గల్ఫ్‌లోని కార్పొరేట్‌శక్తులు సేకరించాయి. ఐతే వారి ప్రవర్తన (ఇరాన్) ఎలా ఉంటుందో తెలుసుకునేంతవరకూ తాము పెట్టుబడి పెట్టడం లేదని జి–7 సదస్సులో ట్రంప్ చెప్పారు. ఇరాన్ పునర్నిర్మాణానికి నిధులు ఇచ్చే విషయం ఒప్పందంలో ఒక భాగంగా లేదని చెప్పారు. ఒప్పందంలో ఈ అంశం ఒక భాగంగా ఉందని మీడియా వస్తున్న వార్తలను ఆయన తిరస్కరించారు. కాగా,యుద్ధ నష్టపరిహారంగా 400 బిలియన్ డాలర్లు ఇరాన్ కోరిందని, కానీ అందుకు అమెరికా తిరస్కరించిందని వైట్‌హౌస్ సీరియర్ అధికారి ఒకరు చెప్పారు. కాగా, స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్ రిజార్ట్‌లో శుక్రవారం రెండు దేశాల ప్రతినిధులమధ్య లాంఛనపూర్వక సంతకాలు, ఫైళ్ళ పరస్పర మార్పిడి కార్యక్రమం జరుగుతుంది. ఇరాన్ కూడా మంగళవారం ఒక ప్రకటన చేస్తూ, ఒప్పందం రెండో దశ చర్చలు శుక్రవారంనాడే స్విట్జర్లాండ్ వేదికగా ప్రారంభమవుతాయని పేర్కొంది. 60 రోజుల చర్చల్లో తుది ఒప్పందం కోసం చర్చలు జరుగుతాయని పేర్కొంది. ఒప్పందానికి ఇజ్రాయెల్ వల్ల ఎలాంటి ఆటంకం లేదని కూడా ట్రంప్ ఇంతకు ముందే చెప్పారు. ఐనాగానీ లెబనాన్‌పై బుధవారం కూడా ఇజ్రాయెల్ దాడులు కొనసాగించింది. మరోవైపు ఇరా న్ ఓడరేవులపై అమెరికా అమలు చేస్తున్న దిగ్బంధన ప్రాంత జలాలలో ఇరాన్ నౌక బుధవారం స్వేచ్ఛగా ప్రయాణం చేసింది. ఒప్పందం కుదిరినప్పటికీ శుక్రవారం కార్యక్రమం పూర్తయ్యేవరకూ హోర్ముజ్ జలసంధిలో కార్యకలాపాలు మందకొడిగా సాగుతాయి. దాదాపు 52 నౌకలు, 200 ట్యాంకర్లు హోర్ముజ్ జలసంధి లో స్తంభించిపోయి ఉన్నాయి. ఏప్రిల్ 13 తేదీ నుండి ఇరాన్ ఓడరేవులపై అమెరికా యుద్ధ నౌకలు దిగ్బంధనం ఆం క్షలు అమలు చేయడం ప్రారంభించింది.

### జి–7లో ఉక్రేన్‌కు మద్దతు

కాగా జి–7 సమావేశంలో ఉక్రేన్ విషయంపై కూడా బుధవారం చర్చలు జరిగాయి. ఉక్రేన్ వాయు,రక్షణ వ్యవస్థల ను బలోపేతం చేయడానికి,రష్యా చమురు,గ్యాస్ రంగాల పై ఒత్తిడి పెంచడానికి ఆంక్షలు విస్తరించాలని కూడా జి–7 దేశాలు ప్రతిజ్ఞ చేశాయి. ఉక్రేన్ స్వేచ్ఛ,సార్వభౌమాధికారం,ప్రాదేశిక సమగ్రతలు కాపాడటంలో జి–7 దేశాల నాయకులుగా అచంచల విశ్వాసంతో ఏకత్రాటిపై నిలుస్తామని కూడా ప్రతిన పూనారు.ఇరాన్ అంశం ముగిసింది గ నుక ఇక ఉక్రేన్–రష్యా మధ్య చర్చల విషయంపై దృష్టిసారిస్తానని ముందురోజు మంగళవారం జి–7 సదస్సులో మాట్లాడుతూ యూరప్ నాయకులకు ట్రంప్ హామీ ఇచ్చారు.

# మళ్ళీ లెబనాన్‌పై దాడులు... ఒప్పందానికి ముప్పే!

ఇరాన్ హెచ్చరిక



**బీరూట్:** ఎవ్వరినీ లెక్కచేయని ఇజ్రాయెల్ బుధవారం మరోసారి లెబనాన్‌పై దాడులు చేసింది. దీంతో అమెరికా–ఇరాన్ మధ్య ఒప్పందానికి ముప్పు ముస్తుందన్న ఆందోళన చెలరేగుతున్న సమయంలో ఇజ్రాయెల్‌కు ఇరాన్ విదేశీవ్యవహారాలమంత్రి అబ్బా స్ అరాఘ్చి తీవ్ర హెచ్చరిక చేశారు. దాడులు చేస్తే జోక్యం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ట్రంప్ తీవ్ర అభ్యంతరం వ్య క్తం చేసినప్పటికీ దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ మళ్ళీ దాడులు చేసినట్లు బుధవారం లెబనాన్ జాతీయ వార్తాసంస్థ ఎన్ఎన్ఏ ప్రకటించింది. నబాటియే అల్–ఫల్కా ప్రాంతంపైనా,పొరుగున ఉన్న కఫర్ టెబ్నిట్ ప్రాంతంపైనా దాడులు చేసింది. ఈ దాడుల్లో నలుగురు మరణించినట్లు ధృవీకరించని వార్తలు పేర్కొన్నాయి. దీనిపై ఇజ్రాయెల్ ఇంకా స్పందించలేదు. ఐతే అవసరమైనంతకాలం లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యాలు ఉంటాయని నెతన్యాహూ సోమవారం తెగేసి చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నివారించాలన్న మా లక్ష్యం నెరవేరింది, కానీ ఇంకా లెబనాన్‌లో యుద్ధం ముగిసిపోలేదని అన్నారు. తమ దళాలు దక్షిణ లెబనాన్‌నుండి, సురక్షిత ప్రాంతాల నుండి వైదొలగే ప్రశ్నేలేదని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ కూడా ప్రకటించారు. ఒప్పందం కుదిరిందని ఆదివారం అమెరికా–ఇరాన్–పాకిస్థాన్‌ల నుండి ప్రకటన వచ్చినప్పటి నుండీ ఇజ్రాయెల్–హెజ్బొల్లా మధ్య పరస్పర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఉత్తర ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా దాడులు చేస్తోందని ఇజ్రాయెల్ ఫిర్యాదు చేస్తోంది. ఐతే ఇరాన్‌తో కుదిరిన ఒప్పందాన్ని అమలు చేసే బాధ్యత అమెరికాదేనని, ఇకమీదట లెబనాన్‌పై దాడి జరిగితే అది ఒప్పందం ఉల్లంఘనే అవుతుందని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బా స్ అరాఘ్చి హెచ్చరించి 24 గంటలు గడవకముందే మళ్ళీ దాడు లు జరిగాయి. లెబనాన్‌లో హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తాం తప్ప తమ యుద్ధం లెబనాన్ ప్రజలతో కాదని ఇజ్రాయెల్ ప్రకటించింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగించడానికి సంబంధించిన ఒప్పంద పత్రంలో లెబనాన్‌లో కూడా యుద్ధ విరమణ ప్రధానాంశంగా ఉందని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ జూన్ 15న ప్రకటించారు. కానీ ఈ ఒప్పంద పత్రం పూర్తిపాఠం ఇంకా విడుదల కాలేదు. రాబోయే ఇరవైనాలుగ్గంటలలో ఈ ఒప్పంద పత్రాన్ని విడుదల చేస్తారని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఇప్పటికే ప్రకటించారు.

### హెజ్బొల్లాపై ఇక సిరియా పోరాటం చేస్తుందా?

లెబనాన్ విషయంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, దాడులు చేయవద్దని ఎవియాన్–లెస్–బైన్స్ రిసార్ట్‌లో మంగళవారం జరిగిన జి–7 శిఖరాగ్ర సదస్సులో ఇజ్రాయెల్‌కు ట్రంప్ స్పష్టం చేశారు. అదేసమయంలో లెబనాన్‌లో ఇకమీదట సిరియా పోరాటం చేయాలని సూచించడం కొత్త సందేహాలకు దారితీసింది. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్–షారా సమర్థవంతంగా ఈ పోరాటాన్ని నడిపించగలరని బాహాటంగా చెప్పడంతో నెతన్యాహూ ఇప్పటివరకూ లెబనాన్‌లో ఇరాన్ పెంచి పోషిస్తున్న హెజ్బొల్లాను నిర్మూలించలేకపోయారన్న అర్థంలో మాట్లాడారు. ''హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ చాలాకాలంగా పోరాడుతోంది, ఈ వ్యవహారాన్ని సిరియాకు అప్పగించమని నేను ఇజ్రాయెల్‌కు సూచించాను, ఎందుకంటే నిజం చెప్పాలంటే హెజ్బొల్లాపై పోరాటాన్ని వారు మరింత సమర్థవంతంగా నడిపించగలరు'' అన్నారు. ''ఆయన (అల్–షారా) చాలా సమర్థుడు, నేను కోరినవాటినన్నింటినీ నెరవేర్చాడు, నాకు సానుకూలంగా వ్యవహరించాడు''అని ప్రశంసించారు. సామాన్యులను, ఇతరులను చంపకుండా ఇజ్రాయెల్ పని పూర్తిచేయలేకపోతే ఆ పని సిరియా పూర్తి చేస్తుందని అన్నారు. ఇరాన్ పెంచిపోషిస్తున్న ఉగ్రవాద సైనికులు,వారి నాయకులను వెతికి పట్టుకోవాలంటే సామాన్య ప్రజలను చంపాల్సిన అవసరం లేదని అన్నారు. హెజ్బొల్లా నాయకులను వెతికి పట్టుకోవాలంటే సామాన్య ప్రజలను చంపాల్సిన అవసరం లేదని విమర్శించారు. ''వారు పోరాటం చేసే విధానం తప్పు,చాలా కాలంలో హెజ్బొల్లాతో ఇజ్రాయెల్ పోరాటం చేస్తోంది,హెజ్బొల్లాను వెతికి పట్టుకోవాలనుకున్న ప్రతిసారీ అపార్ట్‌మెంటులను కూల్చివేయాల్సిన అవసరం లేదు, ఈ అపార్ట్‌మెంట్లలో సామాన్య ప్రజలు ఉంటారు, వారంతా హెజ్బొల్లా సభ్యులు కాదు, ఇలా చాలామంది సంబంధంలేని సామాన్యులు ఈ పోరాటంలో చనిపోతున్నారు, ఈ విషయం నేను ఖచ్చితంగా చెప్పగలను, ఇరాన్ మద్దతుగల ఈ ఉగ్రవాద సంస్థపై ఎవియాన్–లెస్–బైన్స్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, అమెరికా లేకపోతే ఇజ్రాయెల్ ఉండేది కాదన్నారు. మేం కాపాడుతూ వచ్చామని, లేకపోతే రాజధాని టెల్‌అవీవ్ ఏనాడో బాంబుదాడులతో పేలిపోయి ఉండేదన్నారు. నెతన్యాహూతో తనకు గొప్ప సంబంధం ఉందని, కానీ లెబనాన్‌పై దాడులు తనకు నచ్చలేదని అన్నారు. కుటుంబంలో గొడవల లాగేనే మేం ఇద్దరం విభేదించుకుంటాం,మళ్ళీ ఏకీభవిస్తూ ఉంటాం అని గతంలో ట్రంప్ చాలాసార్లు చెప్పారు.

## అమెరికా దాడిలో మరణించిన ఇద్దరు నావికుల మృతదేహాలు భారత్‌కు తరలింపు

**దుబాయ్:** గతవారం ఒమన్ తీరంలో అమెరికా వైమానిక దాడుల్లో మరణించిన ఇద్దరు భారత నావికుల మృతదేహాలను బుధవారం స్వదేశానికి తరలించినట్లు ఒమన్ అధికారులు చెప్పారు. హోర్ముజ్ జలసంధిలో అమెరికా చేసిన దాడిలో ఆదిత్యశర్మ,శివానంద్ చౌరాసియా మృతదేహాలను భారత్‌కు తరలించారు. మస్కట్‌లోని భారత దౌత్య కార్యాలయం ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టింది. మరణించిన, గల్లంతైన మూడో నావికుడి జాడ, ఆయన మృతదేహం గురించి దౌత్య కార్యాలయం ఎలాంటి వివరాలు తెలియజేయలేదు. ఇరాన్ ఓడరేవుల నుండి నౌకలు కదలకుండా అమెరికా సేనలు అమలు చేస్తున్న దిగ్బంధనం నిబంధనలను ''పలావూ'' జెండాతో వెళుతున్న 'ఎంటి సెట్టిబెల్లో' నౌక ఉల్లంఘించిందని పేర్కొంటూ సెంట్‌కామ్ దళాలు దాడి చేశాయి. ఈ దాడిలో నౌక ఇంజిను రూమ్‌లో మంటలు చెలరేగాయి. ఆ తర్వాత ముగ్గురు నావికులు గల్లంతయ్యారు. ఈ నౌకలో మొత్తం 24 మంది భారతదేశ నావికులు విధినిర్వహణలో ఉన్నారు. 21 మంది నావికులను సురక్షితంగా సహాయ బృందాలు ఒడ్డుకు చేర్చాయి. గల్లంతైన ముగ్గురు భారత నావికులలో ఇద్దరు మృతదేహాలను ఒమన్ సహాయ బృందాలు ఒడ్డుకు చేర్చాయి. మిగిలిన ఒక్క నావికుడి మృతదేహంకోసం గాలింపు కొనసాగుతోంది. ఈ రెండు మృతదేహాలను ఇప్పుడు భారత్‌కు తరలించారు.

## ఆల్బేనియాలో ట్రంప్ ఫ్యామిలీ ప్రాజెక్టుపై రగడ

**తిరానా:** ఆగ్నేయ యూరప్‌దేశం ఆల్బేనియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన ప్రదర్శనలు బుధవారంనాటికి 17వ రోజుకు చేరుకున్నాయి. ట్రంప్ కుటుంబం ఈ దేశంలో నిర్మిస్తున్న ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఆల్బేనియా అమ్మకానికి సిద్ధంగా లేదు అని ప్రజలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తున్నారు. దేశ ప్రధానమంత్రి ఎ.డి.రామా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాజధాని తిరానాలో వేలాదిమంది నిరసన ప్రదర్శన చేశారు. మూడు వారాలు గడచినప్పటికీ ఈ ఉద్యమం తీవ్ర ఆగడంలేదు. మరింత తీవ్రం అవుతోంది. ఐతే దేశంలో ఆర్థిక పరిస్థితుల నేపథ్యం కూడా ఈ ఉద్యమానికి ఆజ్యం పోస్తోందని పరిశీలకులు పేర్కొన్నారు. ఆల్బేనియాలో ఒక పర్యాటక ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం,పెట్టుబడులకు సంబంధించిన లావాదేవీలన్నీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కుమార్తెతో ముడిపడి ఉన్నాయి. నైరుతీ వ్లోరా కౌంటీలోని జ్వెర్నెక్ అనేక ఒక బీచ్‌ను విక్రయించే ప్రణాళిక కూడా బయటకు పొక్కింది. ఈ ప్రణాళిక విషయంలో ట్రంప్, ఆయన అల్లుడు జారెడ్ కుష్నెర్‌కు కూడా సంబంధాలు



ఉన్నాయని తేలడంతో ప్రధానమంత్రి రామా ప్రజాగ్రహానికి గురయ్యారు. మూడు వారాలుగా ఆయనకు వ్యతిరేకంగా ప్రజా నిరసన కొనసాగుతోంది. ఆల్బేనియా అమ్మకానికి లేదని వారు నినాదాలు చేస్తున్నారు. మార్టియర్స్ ఆఫ్ ద నేషన్ బౌలేవార్డ్ మీదుగా ప్రధానమంత్రి కార్యాలయం వరకూ బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని వేలాదిమంది ప్రదర్శన జరిపారు. ప్రధాని ఎ.డి.రామా ద్రోహి..రాజీనామా చెయ్యి'' అని నినాదాలు చేశారు. నాలుగు బిలియన్ల డాలర్లు ఖర్చు కాగల ఈ పర్యాటక ప్రాజెక్టు ట్రంప్ కుటుంబానికి సంబంధించినదన్న ఆరోపణలను ప్రధానమంత్రి రామా గతంలో ఖండించారు. ఐతే మీడియా నివేదికల ప్రకారం, ఈ ప్రాజెక్టు తీరుతెన్నులపై దేశ ప్రత్యేక ప్రాసిక్యూషన్ కమిటీ విచారణ ప్రారంభించింది.

## రక్షణ నిబంధన

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. టీవీల్లో ప్రసారమైన వార్తల ప్రకారం, ట్రంప్ చేస్తున్న కృషిని మోదీ అభినందించారు. ''మిస్టర్ ప్రెసిడెంట్, మనమధ్య ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మనుగడకు, నౌకా యాన స్వేచ్ఛకు హోర్ముజ్ జలసంధి తెరచి ఉండాలని, స్వేచ్ఛగా రాకపోకలు సాగాలని మనం ఇద్దరం అంగీకరిస్తాం, అదేవిధంగా నౌకాయాన స్వేచ్ఛ అంశాన్ని భారతదేశం ఎల్లప్పుడూ గట్టిగా ఉద్ఘాటించి చెబుతూనే ఉంది, ఈ విషయంలో మనం కలిసి పనిచేద్దాం'' అని ట్రంప్‌ను కోరారు. అదేవిధంగా భారత్–బ్రిటన్ మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)జులై 15వ తేదీ నుండి అమలులోకి వస్తుందని మోదీ చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. ఈ ఒప్పందం ద్వైపాక్షిక వాణిజ్యానికి, పెట్టుబడులకు ఎంతో ప్రోత్సాహాన్ని, ఊతాన్ని ఇస్తుందని ప్రకటించారు. భారతీయ రైతులు, కార్మికులు, సూక్ష్మ ,చిన్న,మధ్యతరహా పరిశ్రమలకు, అంకుర సంస్థలకు, దేశంలోని యువతకు కొత్త అవకాశాలు, ఉద్యోగావకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

**కార్మికుల మరణవార్త విన్నాను:ట్రంప్**

సమావేశం తర్వాత ట్రంప్ మాట్లాడుతూ మోదీపై ప్రశంసలు కురిపించారు. భారత కార్మికుల మరణాల గురించి అడినప్పుడు, ''అవును ఆ విషయం నేను విన్నాను, నావికుల వృత్తి చాలా కఠినమైనది, అందులో ఎలాంటి సందేహం లేదు, మేం కలిసి పనిచేస్తాం'' అని ట్రంప్ చెప్పారు. మోదీతో సమావేశం ఎంతో గొప్పగా జరిగిందని చెప్పారు. భారతదేశంలో తాను పర్యటిస్తానని కూడా చెప్పారు. ఐతే దానికి ఆయన ఒక సమయాన్ని,తేదీని ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. ఆయన మంచి మనిషి అని అందరూ అంటారు, కానీ చాలా కఠినమైన వ్యక్తి అని నేను చెప్పాను, ఆయన భారత ప్రజలను ప్రేమిస్తారు, అదేసమయం లో అమెరికాను కూడా ఆయన ప్రేమిస్తారు అని చెప్పారు. పశ్చిమాసియాలో ఆయన కీలకపాత్ర ఉందా అని ప్రశ్నించగా, మోదీ నాయకుడుగా ఉన్నంతకాలం ప్రతివిషయంలోనూ భారతదేశం కీలకపాత్ర వహిస్తుందని చెప్పా రు.

## ఇహెచ్‌సిటి బోర్డు

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగ, పెన్షన్ సంఘాల ప్రతినిధులను సభ్యులుగా నియమించారు. ఇకపై రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆరోగ్య పథకానికి సంబంధించిన పూర్తి బాధ్యతలను,నిధుల నిర్వహణను ఈ ట్రస్ట్ పర్యవేక్షించనుంది. త్వరలో బోర్డ్ ఆఫ్ ట్రస్టీల సమావేశం నిర్వహించి, ప్రస్తుతం అమలులో ఉన్న మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ అమలుకు సంబంధించిన కొత్త మార్గదర్శకాలను రూపొందించనున్నారు. అలాగే ఉద్యోగుల ఆరోగ్య కార్డుల జారీ విధానంపై కూడా ట్రస్ట్ ప్రతిపాదనలు సిద్ధం చేయనుంది. దీనికి సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒ,ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ సిఇఒకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**బోర్డ్ కమిటీ..**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఇహెచ్‌సిటి చైర్మన్‌గా వ్యవహరించగా, ఆర్థిక, ఆరోగ్య, విద్య, హోం, సాధారణ పరిపాలన,మున్సిపల్ పరిపాలన, పంచాయతీ రాజ్, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు/ముఖ్య కార్యదర్శులు, అలాగే కార్మిక, మహిళా శిశు సంక్షేమ, న్యాయ శాఖల కార్యదర్శులు, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, వైద్య విద్యా డైరెక్టర్, ఎస్ఇఆర్‌పి సిఇఒ,ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సిఇఒ తదితరులు బోర్డులో సభ్యులుగా ఉన్నారు.

**బోర్డ్‌లో ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలకు చోటు..**

ఉద్యోగ సంఘాల ప్రతినిధులుగా మారం జగదీశ్వర్ (టిజిఒఅధ్యక్షుడు), ఏలూరి శ్రీనివాసరావు(టిజిఒ అధ్యక్షుడు), పి.దామోదర్ రెడ్డి(పిఆర్‌టియు తెలంగాణ అధ్యక్షుడు),జి.సదానందంగౌడ్(ఎస్‌టియు టిఎస్ అధ్యక్షుడు), చావ రవి(టిఎస్ యుటిఎఫ్‌అధ్యక్షుడు), గిరి శ్రీనివాస్ రెడ్డి (టిజి సెక్రెటేరియేట్ అసోసియేషన్ అధ్యక్షుడు), వి.రవీందర్ రెడ్డి (టిఆర్‌ఇఎస్‌ఎ అధ్యక్షుడు),వి.లచ్చిరెడ్డి (డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు), బి.సైదులు(ఎస్‌టిఎఫ్ అధ్యక్షుడు), దాస్యనాయక్(తెలంగాణ క్లాస్4 ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు), పెన్షనర్ల సంఘం నుంచి పి.వెంకట్ రెడ్డి (తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు), పి.కృష్ణమూర్తి (తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి), ఆర్.ఉమాదేవి (తెలంగాణ ఉమెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్‌పర్సన్) సభ్యులుగా ప్రభుత్వం నియమించింది.

## వెలికితీస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటి,పరిశ్రమలు, జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండల చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ఎంపిలు వేం ఏం నరేందర్ రెడ్డి,కుందూరు రఘువీర్ రెడ్డి,స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అక్కడికి హెలికాప్టర్‌లో చేరుకున్న సీఎం తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో మొదటగా పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. వారితో ముచ్చటించారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగసభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆనాడు నిజాంకు, రజాకార్లకు వ్యతిరేకంగా సాయుధ రైతన్న పోరాటం చేసి పోరాట స్ఫూర్తిని నింపిన ఆరుట్ల రామచంద్రా రెడ్డి,ఆరుట్ల కమలమ్మ, వారి పూర్వీకులదీ ఆరుట్ల గ్రామమే తెలంగాణ నలుమూలల ప్రతి ఒక్కరికి తెలుసా అన్నారు. ఆస్ఫూర్తి ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థుల ప్రతి ఒక్కరిలో ఉంటుందని తాను భావిస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఆరుట్లలో ప్రారంభమైన ఈ విద్యా విప్లవం కేవలం ఒక గ్రామానికే పరిమితం కాదని, తెలంగాణ విద్యా వ్యవస్థకు కొత్త దిశానిర్దేశం చేస్తుందన్నారు. తెలంగాణ భవిష్యత్తు అద్దాల మేడల్లో లేదా రంగురంగుల గోడల్లో లేదని, తరగతి గదుల్లోనే ఉందని తమ ప్రభు త్వం బలంగా విశ్వసిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యా కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరడం ప్రభుత్వ విద్యపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఒక ప్రభుత్వ పాఠశాలకు నో అడ్మిషన్ బోర్డు పెట్టే పరిస్థితి రావడం గొప్ప విషయమని, దీనికి కృషి చేసిన ఉపాధ్యాయులను,విద్యా కమిటీని సిఎం అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాం లు, విద్యా కిట్లు అందించే ప్రణాళికతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. తెలంగాణను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని,ఆరుట్ల గ్రామం ఇందుకు ఆదర్శంగా నిలుస్తుందని సిఎం రేవంత్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే తనపై కొంత మంది విమర్శలు చేశారని సిఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామన్న ఆయన మెస్సీ డ్రగ్స్ ముఠా లీడర్ కాదు, ఆర్థిక నేరగాడు కాదని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే నెల రోజులకే చిరిగేవన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని తెలిపారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్ల టెండర్లతో పిలిస్తే అందులో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అంటున్నారని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2 వేల కోట్ల స్కామ్ ఎలా సాధ్యమో చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,తెలంగాణ విద్యా కమిషన్ చైర్‌పర్సన్ ఆకునూరి మురళి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రాణా,జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి,డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ,విద్యా శాఖ ఉన్నతాధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బుధవారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆరుట్లకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ అయిన అనంతరం సిఎం నేరుగా విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ బస్సులోనే ప్రయాణించి పాఠశాల ప్రాంగణానికి చేరుకున్నారు.పాఠశాలను ప్రారంభించిన అనంతరం సిఎం రేవంత్ రెడ్డి విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. వారితో కలిసి కూర్చుని బ్రేక్‌ఫాస్ట్ చేశారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసి) సభ్యులతో సమావేశమై పాఠశాల నిర్వహణ, భవిష్యత్ ప్రణాళికలపై కీలక చర్చలు జరిపారు.ఫుట్‌బాల్ ఆడిన రేవంత్‌రెడ్డి పాఠశాలలోని ప్రీప్రైమరీ విభాగాలను సందర్శించిన సిఎం, చిన్నారులతో కాసేపు సరదాగా గడిపారు. అనంతరం స్కూల్ లైబ్రరీ, డిజిటల్ తరగతి గదులతో పాటు సరికొత్త సాంకేతికతతో కూడిన ఇన్నోవేషన్ ల్యాబ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ లాబొరేటరీలను క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రభుత్వ స్కూళ్లలోనే కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ప్రాధాన్యత నిస్తూ ఏర్పాటు చేసిన డ్యాన్స్, మ్యూజిక్ రూమ్‌లను సందర్శించిన రేవంత్ రెడ్డి,ఆ తర్వాత స్కూల్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టారు. అక్కడ విద్యార్థులతో కలిసి స్వయంగా ఫుట్‌బాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు.పాఠశాల ఆవరణలో సిఎం ఒక మొక్కను నాటారు.

## జర్నలిస్టులకు హెల్త్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆర్థిక సహాయం కింద చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నాంపల్లిలోని మీడియా అకాడమీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో దాదాపు 20 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, లక్ష రూపాయల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు దాదాపు 200 మంది జర్నలిస్టుల కుటుంబాలకు మీడియా అకాడమీ ద్వారా వివిధ రూపాల్లో లబ్ది చేకూర్చిందన్నారు. విధి నిర్వహణలో మరణించిన జర్నలిస్టు కుటుంబానికి ఏక మొత్తంగా రూ.1,00,000 (లక్ష రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు బాధిత కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు ప్రతి నెలా రూ.3,000 చొప్పున ఐదేళ్లు పాటు పెన్షన్ సదుపాయం, పాఠశాలలో చదువుకునే పిల్లలు ఉంటే (ఇద్దరు పిల్లల వరకు)నెలకు రూ.1,000 చొప్పున అదనంగా రూ.2,000 సహాయం మొత్తంగా అర్హులైన కుటుంబాలకు నెలకు మొత్తం రూ.5,000 ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు.

ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి, వృత్తిని కొనసాగించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులను కూడా సంక్షేమ కమిటీ గుర్తించి వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నదన్నారు. జర్నలిస్టుల దరఖాస్తు లు కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉండకుండా, ప్రతి రెండు నెలలకోసారి (అవసరమైతే ప్రతి నెల) సంక్షేమ కమిటీ ప్రత్యేకంగా సమావేశమై, త్వరితగతిన నిధులను విడుదల చేస్తుందని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సాధ్యమైనంత వరకు ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే అకాడమీ లక్ష్యమన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు మాట్లాడుతూ గడిచిన ఐదు దశాబ్దాలుగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయన సేవల పట్ల జర్నలిస్టు వర్గాల నుంచి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయన్నారు.

**జర్నలిస్టులకు ప్రభుత్వ అండ: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున పూర్తి సానుభూతి, అండదండలు ఉంటాయని మంత్రి కోమటిరెడ్డి వెకంట్‌రెడ్డి తన సందేశంలో పేర్కొన్నారు. మృతిచెందిన జర్నలిస్టులకు సమావేశం నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపాన్ని, సానుభూతిని తెలియజేసింది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్లుతో పాటు చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతస్థాయి న్యాయ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ ధనానికి పూర్తి బాహాటత్వ విధానంతో జవాబుదారీ వహించాల్సి ఉందని, కానీ సంబంధిత నిర్వాహకుల అవకతవకల విధానాలవల్ల ప్రజలు విశ్వాసం కోల్పోయారని, అందువల్ల వారిని జవాబుదారీ చేసి తిరిగి ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించాలని కోరారు. దేశంలో ఆర్ఎస్ఎస్–బిజెపిలు అయోధ్యలో రామాలయ్యాన్ని ఎల్లప్పుడూ ప్రజలను సమాజాన్ని విభజించడంకోసం ఒక రాజకీయ ప్రాజెక్టుగానే చూసిందని, ఆ రూపేణా భారీ ఎత్తున ఆర్థిక వనరులను సమకూర్చుకుందని విమర్శించారు. ఇప్పటివరకూ వచ్చిన భూముల కొనుగోళ్ళు,అవినీతి ఆరోపణలతో పాటు ఈ తాజా విడతలో ఆలయ నిర్వహణలో ఆర్ఎస్ఎస్–బిజెపిలకు సన్నిహితంగా ఉన్న వారు కోట్లాది రూపాయలు నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయని విమర్శించారు. తొలుత ఆలయం చుట్టూ భారీ ఎత్తున భూమి కొనుగోలు ఒప్పందాలపై ఆనాడు ఆర్ఎస్ఎస్–బిజెపిలకు సన్నిహితంగా ఉన్న వ్యక్తులు, ఉన్నతాధికారులపై ఆరోపణలు వెల్లువెత్తాయని, ఈ తీరు చూస్తుంటే చివరకు దేవుడుగా కొలిచే శ్రీరామచంద్రుణ్ణి ఆ దేవుణ్ణి విశ్వసించే భక్తులను కూడా లెక్కచేయకుండా ఆర్ఎస్ఎస్–బిజెపిలతో సంబంధం ఉన్న వ్యక్తులు అవినీతికి పాల్పడి ప్రైవేటు ఆస్తులు సమకూర్చుకున్నట్లు అర్థమవుతోందని డి.రాజా విమర్శించారు.

## బోనస్ ఏడు సన్నాలకే

(మొదటి పేజీ తరువాయి)

రకాల అమ్మకం, విక్రయాలను రోజువారిగా అప్‌డేట్ చేయాలని డీలర్లను మంత్రి ఆదేశించారు. కంపెనీల వారీగా అందుబాటులో ఉన్న విత్తనాల నిల్వలు రైతులకు తెలిసే విధంగా ప్రదర్శించాలన్నారు.

**ఎరువుల సరఫరాలో రైతులకు ఇబ్బందులు రాకూడదు**

ఫెర్టిలైజర్ డీలర్లతో జరిగిన సమావేశంలో ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల సరఫరా, పంపిణీ అంశాలపైన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమీక్షించారు. రైతులకు ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం ప్రభుత్వంతో పాటు డీలర్ల బాధ్యత అని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రా వు అన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు కూడా పైలెట్ ప్రాతిపదికన అమలుకు సన్నాహాలు చేస్తున్నాయన్నారు.

గతంలో కేవలం ఆధార్ కార్డు చూపించి పెద్ద మొత్తంలో యూరియా కొనుగోలు చేసే అవకాశం ఉండేదని, ప్రస్తుతం యాప్ ఆధారిత విధానంతో అలాంటి పరిస్థితులకు పూర్తిగా అడ్డుకట్ట పడిందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా యూరియా దిగుమతులపై ప్రభావం పడుతున్నప్పటికీ రాష్ట్ర రైతులకు అవసరమైన ఎరువులు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీనిచ్చారు. మండలాల వారీగా మ్యాపింగ్ సదుపాయం కల్పించాలని, రవాణా ఖర్చులు తమపై అదనపు భారం కాకుండా చూడాలని డీలర్లు విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న రవాణా వ్యయాల కారణం గా రిటైల్ వ్యాపారులు అధిక ధరలకు యూరియా విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

**శాటిలైట్ సాంకేతికతతో చీడపీడల గుర్తింపు:**

కృషి వాస్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో వినియోగించే విధానాలపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమీక్షించారు.

శాటిలైట్ చిత్రాల ఆధారంగా పంటల్లో చీడపీడలను, వ్యాధులను రియల్ టైమ్ లో గుర్తించి, వాటిని విస్తరించకముందే రైతులకు సమాచారం అందించే విధంగా కృషి వాస్ ప్రాజెక్ట్ పని చేస్తోందని కంపెనీ ప్రతినిధులు వివరించారు.

ఈ పైలెట్ ప్రాజెక్టు అమలుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలాన్ని ఎంపిక చేసినట్లు ప్రతినిధులు వివరించారు.

అక్కడి రైతులకు ఇప్పటికే పంటల పరిస్థితులపై సమాచారం అందిస్తున్నామన్నారు. కాగా 'కృషి వాస్' లబ్ధి పొందిన దమ్మపేట మండలం అంకంపాలెం గ్రామానికి చెందిన పెరుమళ్ళ వీరభద్రరావుతో మంత్రి తుమ్మల స్వయంగా ఫోన్ చేసి, ప్రాజెక్టు వల్ల కలిగిన ప్రయోజనాలను, కంపెనీ తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశాల్లో సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సంచాలకులు బి.గోపి, మార్క్‌ఫెడ్ ఎండి రాహుల్ రాజ్, సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి యాస్మిన్ బాషా, అగ్రికల్చర్ యూనివర్సిటీ విసి అల్దాస్ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

# అఫ్గాన్–‘ఎ’పై ఘనవిజయం.. ఫైనల్‌కు భారత్–‘ఎ’



ముక్కోణపు వన్డే సిరీస్‌లో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్–ఎ అదరగొట్టింది. అఫ్గానిస్థాన్‌ఏతో బుధవారం జరిగిన మ్యాచ్ సమష్టిగా రాణించిన భారత్–ఎ 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. స్పిన్ ఆల్‌రౌండర్ నిషాంత్ సింధు(4/31) నాలుగు వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ భారీ విజయంతో ఈ ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్‌కు ఫైనల్ బెర్త్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్–ఎ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 319 పరుగుల భారీ స్కోర్ చేసింది. ప్రియాన్ష్ ఆర్య(42 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 58), తిలక్ వర్మ(75 బంతుల్లో 5 ఫోర్లతో 59), కుమార్ కుశాగ్ర(67 బంతుల్లో 5 ఫోర్లతో 58) హాఫ్ సెంచరీలతో రాణించగా.. వైభవ్ సూర్యవంశీ(28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 38), రుతురాజ్ గైక్వాడ్(31 బంతుల్లో 4 ఫోర్లతో 30), విప్రజ్ నిగమ్(20 బంతుల్లో 4 ఫోర్లతో 30) పర్వాలేదనిపించారు. అఫ్గాన్–ఎ బౌలర్లలో ఫరిదూన్, అబ్దుల్లా అహ్మద్జై, ఫర్మనుల్లా రెండేసి వికెట్లు తీయగా.. జహీర్ ఖాన్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం అఫ్గానిస్థాన్–ఎ 36.5 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. బహీర్ షా(52 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 57) హాఫ్ సెంచరీతో రాణించగా.. ఫైసల్(56 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 46) పర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో నిశాంత్ సింధు(4/31)తో పాటు యశ్ ఠాకూర్(2/48) రెండు వికెట్లు పడగొట్టాడు. అన్షుల్ కంబోజ్, విప్రజ్ నిగమ్, సూర్యాన్ష్ షెడ్గే, అనుకుల్ రాయ్ తలో వికెట్ తీసారు.

ఈ ముక్కోణపు సిరీస్‌లో 4 మ్యాచ్‌లలో 2 గెలిచిన భారత్ మెరుగైన రన్‌రేట్‌తో పాయింట్స్‌తో అగ్రస్థానంలో నిలిచింది. శ్రీలంక–ఎ, అఫ్గానిస్థాన్–ఎ మధ్య జరిగే ఆఖరి మ్యాచ్ ఫలితంతో ఈ సిరీస్ ఫైనలిస్టు ఎవరనేది తేలనుంది. ఈ మ్యాచ్‌లో అఫ్గాన్–ఎ ఓడితే భారత్–ఎ, శ్రీలంక–ఎ ఫైనల్లో తలపడనున్నాయి. అఫ్గానిస్థాన్–ఎ గెలిస్తే.. మెరుగైన రన్ రేట్ ఉన్న జట్లకు ఫైనల్ బెర్త్ దక్కనుంది. భారత్‌కు మెరుగైన రన్‌రేట్ ఉన్న నేపథ్యంలో ఫైనల్ బెర్త్ ఖరారు అయింది.

# చరిత్ర సృష్టించిన లియోనెల్ మెస్సీ

## అర్జెంటీనా శుభారంభం



ఫుట్‌బాల్ లెజెండ్, అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ చరిత్ర సృష్టించాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా అల్జీరియాతో జరిగిన మ్యాచ్‌లో లియోనెల్ మెస్సీ హ్యాట్రిక్ గోల్‌తో మెరిసాడు. దాంతో ఈ మ్యాచ్‌లో అర్జెంటీనా 3–0 తేడాతో అల్జీరియాను ఓడించి మెగా టోర్నీలో శుభారంభం చేసింది. ఈ మ్యాచ్ ద్వారా లియోనెల్ మెస్సీ వరల్ రికార్డ్ నమోదు చేశాడు. ఆరు ప్రపంచకప్‌లు ఆడిన తొలి పురుష ఆటగాడిగా నిలిచాడు. అంతేకాకుండా ఈ 6 ప్రపంచకప్ టోర్నీల్లో మెస్సీకి ఇదే తొలి హ్యాట్రిక్ గోల్ కావడం గమనార్హం. 39 ఏళ్ల వయసులోనే ఈ ఘనత సాధించి ఏజ్ జస్ట్ నెంబర్ మాత్రమేనని చాటి చెప్పాడు. గ్రూప్–జేలో భాగంగా అమెరికాలోని కాన్సాస్ సిటీ స్టేడియంలో బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా పూర్తి ఆధిపత్యం చెలాయించింది. మ్యాచ్ ప్రారంభమైన 17వ నిమిషంలోనే మెస్సీ తొలి గోల్ నమోదు చేశాడు. అలెక్సిస్ మాక్ అల్లిస్టర్ ఇచ్చిన పాస్ను అందుకున్న మెస్సీ.. తన ఎడమ కాలుతో చాకచక్యంగా గోల్ పోస్టులోకి పంపాడు. మెస్సీ మ్యాజిక్‌తో అల్జీరియా గోల్ కీపర్ లూకా జిదాన్ తేలిపోయాడు.

**హ్యాట్రిక్ గోల్స్‌తో...** ఆ తర్వాత ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో ఫస్ట్ ఆఫ్‌లో అర్జెంటీనా 1–0తో ముగించింది. సెంకడ్ ఆఫ్లో 17 నిమిషాల వ్యవధిలోనే మెస్సీ రెండు గోల్స్ నమోదు చేశాడు. 60వ నిమిషంలో, 77వ నిమిషంలో గోల్స్ కొట్టి ప్రపంచకప్ చరిత్రలో తన తొలి హ్యాట్రిక్‌ను నమోదు చేశాడు. ఈ హ్యాట్రిక్ గోల్స్‌తో అర్జెంటీనా విజయం ఖరారైంది. ఈ హ్యాట్రిక్‌తో ప్రపంచకప్‌లో మెస్సీ మొత్తం గోల్స్ సంఖ్య 16కి పెరిగింది. దాంతో ప్రపంచకప్‌లో అత్యధిక గోల్స్ చేసిన జర్మనీ ప్లేయర్ మిరోస్లావ్ క్లోస్(16 గోల్స్) రికార్డును మెస్సీ సమం చేశాడు. ఈ క్రమంలో క్రిస్టియన్ రొనాల్డో(15 గోల్స్) రికార్డు మెస్సీ అధిగమించాడు. 14 గోల్స్తో ఎంబాపే, గెర్డ్ ముల్లర్ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.

**తొలి అర్జెంటీనా ప్లేయర్‌గా...** ఈ మ్యాచ్‌లో తన తొలి గోల్‌తో ప్రపంచకప్‌లో పెనాల్టీ బాక్స్ బయటి నుంచి ఐదు గోల్స్ నమోదు చేసిన బ్రెజిల్ దిగ్గజం రివెల్లినో రికార్డును మెస్సీ సమం చేశాడు. అంతేకాకుండా ప్రపంచకప్‌లో అర్జెంటీనా తరఫున గోల్ చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా.. పెద్ద వయస్కుడిగా కూడా మెస్సీ రికార్డ్ సాధించాడు. 19 ఏళ్ల వయసులో 2006 ఫిఫా ప్రపంచకప్లో తొలి గోల్ చేసిన మెస్సీ.. 20 ఏళ్ల తర్వాత 39 ఏళ్ల వయసులోనూ తన ఆరో ప్రపంచకప్‌లో గోల్ కొట్టాడు. 2022 ప్రపంచకప్ విజయం తర్వాత మెస్సీ వీడ్కోలు పలుకుతాడని ప్రచారం జరిగినా.. అర్జెంటీనాకు సారథిగా కొనసాగుతున్నాడు.

# నెపోలియన్ సామ్రాజ్యానికి తెర










బెల్జియంలోని వాటర్‌లూ ప్రాంతంలో, 1815 జూన్ 18న జరిగిన యుద్ధం సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. ఈ ‘వాటర్‌లూ యుద్ధం’ ప్రపంచ చరిత్రలో అత్యంత కీలకమైన యుద్ధాలలో ఒకటిగా గుర్తింపు సంపాదించింది. ఈ యుద్ధంలో ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ బోనపార్టే తన జీవితంలోని చివరి పరాజయాన్ని చవిచూశాడు. ఈ యుద్ధం నెపోలియన్ యుగానికి ముగింపు పలకడమే కాకుండా, యూరప్ రాజకీయ పటాన్ని కూడా పూర్తిగా మార్చివేసింది. నెపోలియన్ 19వ శతాబ్దం ప్రారంభంలో యూరప్‌లో అత్యంత శక్తివంతమైన నాయకుడిగా ఎదిగాడు. అతని సైనిక ప్రతిభ కారణంగా ఫ్రాన్స్ అనేక యుద్ధాల్లో విజయం సాధించి యూరప్‌లోని విస్తారమైన ప్రాంతాలపై ప్రభావాన్ని నెలకొల్పింది. అయితే 1814లో జరిగిన వరుస పరాజయాల తరువాత నెపోలియన్ను అధికారంలో నుంచి తొలగించి ఎల్బా ద్వీపానికి ప్రవాసానికి పంపారు. కానీ 1815లో అతను తిరిగి ఫ్రాన్స్‌కు వచ్చి మరోసారి అధికారాన్ని చేపట్టాడు. ఈ కాలాన్ని చరిత్రలో హండ్రెడ్ డేస్ రూల్ (వంద రోజుల పాలన)గా పిలుస్తారు. నెపోలియన్ పునరాగమనంతో ఆందోళన చెందిన బ్రిటన్, ప్రష్యా, ఆస్ట్రియా, రష్యా వంటి దేశాలు మళ్లీ కూటమి ఏర్పాటు చేశాయి. ఈ నేపథ్యంలో బెల్జియంలోని వాటర్‌లూ వద్ద నెపోలియన్ సైన్యానికి, బ్రిటిష్ సేనాధిపతి ఆర్థర్ వెలెస్లీ నేతృత్వంలోని మిత్రపక్ష బలగాలకు, ప్రష్యన్ సైన్యానికి మధ్య భీకర యుద్ధం జరిగింది. ప్రారంభంలో నెపోలియన్ సేనలు గట్టి ప్రతిఘటన చూపించినప్పటికీ, ప్రష్యన్ బలగాలు యుద్ధరంగానికి చేరుకోవడంతో పరిస్థితి మారిపోయింది. మిత్రపక్షాల సంయుక్త దాడిని తట్టుకోలేక ఫ్రెంచ్ సైన్యం ఓడిపోయింది. ఈ పరాజయం తరువాత నెపోలియన్ మరోసారి రాజీనామా చేయాల్సి వచ్చింది. అనంతరం అతన్ని దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రంలోని సెయింట్ హెలెనా ద్వీపానికి ప్రవాసానికి పంపించారు. అక్కడే 1821లో అతను మరణించాడు. వాటర్‌లూ యుద్ధం ఫ్రెంచ్ ఆధిపత్యానికి ముగింపు పలికి, యూరప్‌లో శక్తి సమతుల్యతను పునరుద్ధరించింది. అందుకే ఈ యుద్ధం ప్రపంచ చరిత్రలో ఒక మలుపు తిరిగిన సంఘటనగా నిలిచిపోయింది. నేటికీ వాటర్‌లూ అనే పదాన్ని ఒక వ్యక్తి లేదా శక్తికి ఎదురైన అంతిమ పరాజయాన్ని సూచించడానికి ఉపయోగిస్తారు.

## పరిణామ సిద్ధాంత చరిత్రలో కీలక మలుపు





యావత్ ప్రపంచం జూన్ 18వ తేదీని ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. 1858వ సంవత్సరంలో, ఇదే రోజున జీవశాస్త్ర చరిత్రలో అత్యంత ప్రాముఖ్యమైన సంఘటనలలో ఒకటి జరిగింది. ప్రముఖ ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్‌కు 1830ల నుంచే జీవుల పరిణామం గురించి పరిశోధనలు చేస్తున్నాడు. ప్రపంచ యాత్రలో సేకరించిన పరిశీలనలు, జంతువులు, మొక్కల వైవిధ్యంపై చేసిన అధ్యయనాల ఆధారంగా జీవులు కాలక్రమేణా మార్పులకు లోనవుతాయని, సహజ ఎంపిక ద్వారా పరిణామం చెందుతాయని ఆయన ఒకవిప్లవాత్మక సిద్ధాంతాన్ని రూపొందించాడు. అయితే తన సిద్ధాంతాన్ని మరింత బలమైన ఆధారాలతో నిరూపించాలని భావించి, దాన్ని ప్రచురించడంలో ఆలస్యం చేశాడు. ఇదే సమయంలో మలయా ద్వీపసమూహంలో పరిశోధనలు చేస్తున్న వాలెస్ కూడా స్వతంత్రంగా ఇదే తరహా నిర్ణయాలకు చేరుకున్నాడు. జీవుల మనుగడ కోసం జరిగే పోటీలో అనుకూల లక్షణాలు కలిగిన జీవులు మాత్రమే ఎక్కువగా జీవించి సంతానాన్ని కొనసాగిస్తాయని అతను కూడా గుర్తించాడు. తన ఆలోచనలను వివరించిన వ్యాసాన్ని డార్విన్‌కు పంపి అభిప్రాయం కోరాడు. వాలెస్ పత్రాన్ని చదివిన డార్విన్ ఆశ్చర్యానికి గురయ్యాడు. ఎందుకంటే అందులోని ప్రధాన భావనలు తన సిద్ధాంతంతో సరిపోతున్నాయి. దీంతో తన పరిశోధనలకు గుర్తింపు దక్కకపోవచ్చనే ఆందోళన అతనికి కలిగింది. ఈ పరిస్థితిని పరిష్కరించడానికి ప్రముఖ శాస్త్రవేత్తలు చార్లెస్‌యెల్, జోసెఫ్ డాల్టన్ హూకర్ మధ్యవర్తిత్వం వహించారు. దీని ఫలితంగా 1858 జులై 1న లండన్‌లోని లిన్నెయన్ సొసైటీ ఆఫ్ లండన్ సమావేశంలో డార్విన్, వాలెస్ రచనలు సంయుక్తంగా సమర్పించా రు. అనంతరం డార్విన్ తన ప్రసిద్ధ గ్రంథం ‘ఆన్ ది ఒరిజిన్ ఆఫ్ స్పీసీస్’ గ్రంథాన్ని 1859లో ప్రచురించాడు. ఈ పుస్తకం జీవశాస్త్రాన్ని పూర్తిగా మార్చివేసి ఆధునిక పరిణామ సిద్ధాంతానికి పునాది వేసింది.

## చారిత్రక కోట ‘బ్యూఫోర్ట్’



ఇటీవల ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని చారిత్రక ‘బ్యూఫోర్ట్ కోట’ను స్వాధీనం చేసుకోవడం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ, హిజ్బుల్లాపై విస్తరించిన సైనిక చర్యల సందర్భంగా ఈ కోటను ఆక్రమించినట్లు నివేదికలు వెల్లడించాయి. బ్యూఫోర్ట్ కోటను ‘కాలాత్ అల్‌షకీఫ్’ లేదా ‘షకీఫ్ ఆర్నూన్’ అని కూడా పిలుస్తారు. ఇది సుమారు 900 సంవత్సరాల చరిత్ర కలిగిన మధ్యయుగ కోట. 12వ శతాబ్దంలో క్రూసేడర్లు నిర్మించిన ఈ కోట దక్షిణ లెబనాన్‌లోని కొండపై వ్యూహాత్మకంగా నిర్మించబడింది. నబతియెహ్ ప్రాంతానికి సమీపంలో, ఇజ్రాయెల్ సరిహద్దుకు కొద్ది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కోట లిటాని నది పరివాహక ప్రాంతాన్ని, దక్షిణ లెబనాన్‌లోని విస్తార ప్రాంతాలను, అలాగే ఉత్తర ఇజ్రాయెల్ భూభాగాన్ని పరిశీలించగల ఎత్తైన ప్రదేశంలో ఉంది. దాని భౌగోళిక స్థానం కారణంగా ఈ కోటకు అపారమైన సైనిక ప్రాధాన్యం ఉంది. కోట నుంచి నబతియెహ్ పరిసర ప్రాంతాలు, పశ్చిమ బెకా లోయ, గోలన్ హైట్స్, ఉత్తర గలిలీ ప్రాంతాలను సులభంగా గమనించవచ్చు. ఈ కారణంగా చరిత్రపరంగా అనేక శక్తులు ఈ కోటపై ఆధిపత్యం కోసం పోటీ పడ్డాయి. ఈ కోట, నేటికీ ప్రాంతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. అందువల్ల బ్యూఫోర్ట్ కోటను ఒక చారిత్రక స్మారక చిహ్నం. మధ్యప్రాచ్య ప్రాంతీయ రాజకీయ, భద్రతా వ్యూహాలను అర్థం చేసుకునేందుకు ముఖ్యమైన ప్రదేశంగా పరిగణిస్తారు.

# ‘సర్’ పేరుతో ఓట్లు తొలగించేందుకు బిజెపి కుట్ర

## సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చండూరు :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, భారత పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ‘ప్రత్యేక సమగ్ర సవరణ’(సర్) పేరుతో ప్రజలకు లేకుండా చేసేందుకు బిజెపి చేస్తున్న కుట్రలను అడ్డుకొని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్సీ, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాధగోని నర్సింహ్మ భవనంలో పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఓటు హక్కును కాపాడుకునేందుకు సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ముస్లీం, క్రిస్టియన్ మైనార్టీ, ఆదివాసులు, దళితులు, వలస వాదులతో పేరుతో ఓటర్లను తొలగించేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. సర్ పేరుతో పశ్చిమ బెంగాల్‌లో 90లక్షలు, తమిళనాడులో 97లక్షలు, కేరళలో 27లక్షల ఓటర్లను తొలిగించారన్నారు. సర్‌పై అన్ని పార్టీల నాయకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయిందన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నా రు. రైతులకు శాపంగా మారిన యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల సన్న ధాన్యం పంటలకు బోనస్ ఇవ్వాలన్నారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగానికి నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందించే ఎస్ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టు పనులు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. శివన్నగూడెం ప్రాజెక్టుల్లో భూమి కోల్పోయిన రైతులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. ప్రాజెక్టులో భూములు కోల్పోయిన బాధితులందరికి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై, ప్రజలకు ఇచ్చిన హామీను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై సిపిఐ ఆధ్వర్యంలో ప్రజాఉద్యమాలు నిర్వహిస్తామని నెల్లికంటి సత్యం వెల్లడించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి నల్పరాజు సతీష్‌కుమార్, మండల సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, జెల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సమిష్టి పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మ భవనంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య అద్యక్షతన సిపిఐ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా నెల్లికంటి సత్యం హాజరై మాట్లాడారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు, ఉద్యమాలు ఉధృతం చేయాలన్నారు. జూన్ 21.22 తేదీలలో జిల్లా కౌన్సిల్ సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులు హైదరాబాద్ నాగోల్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌లో జరుగుతున్నందున ఈ శిక్షణ తరగతులలో జిల్లా సమితి సభ్యులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, తిప్పర్తి రాములు, బరిగెల వెంకటేశ్, కర్నాటి వెంకటేశం, జెల్ల శ్రీను, దోటి వెంకన్న, బండమీది వెంకన్న, సిహెచ్ ఊషయ్య, గంట రమేష్, ఇరిగి సంజీవ పాల్గొన్నారు.

# ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తూ అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటించాలి





## ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న

**ప్రజాపక్షం /కరీంనగర్ :** ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇదురు వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియర్ రీజనల్ సమావేశంలో భవిష్యత్ కార్యచరణపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీనం అంటూ సంబంధిత మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించి కార్మికులను అయోమయానికి గురి చేస్తుస్తున్నారన్నారు. ముందుగా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆర్‌టిసి జెఎసి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అన్ని కార్మిక సంఘాలు విలీనానికే మొగ్గ చూపుతున్నందున కార్మిక సంఘాల ఎన్నికల ప్రక్రియను ఆపేసి విలీన ప్రక్రియ చేపట్టాలని కోరారు. 18న కెబినెట్ సమావేశంలో చర్చించి విలీనం ప్రక్రియ ప్రకటించి గందరగోళ పరిస్థితులకు తెరదింపాలన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులందరినీ ప్రభుత్వంలో విలీనం చేస్తూ అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బెజ్జంకి కాళీదాస్ రీజనల్ కార్యదర్శి కొమ్ము కొమురయ్య యాదవ్, జోనల్ కమిటీ సభ్యులు ఎ.శ్రీనివాస్ రావు, బొడిగే మహేశ్ , మంథని, జగిత్యాల డిపో కార్యదర్శులు జి.రమేశ్, లక్ష్మ ణ్, మంథనీ డిపో అధ్యక్షుడు వై.ఎస్.రెడ్డి, కరీంనగర్–2 డిపో కమిటీ సభ్యులు జి.ఎల్.నారాయణ, టి.సదయ్యగౌడ్ పాల్గొన్నారు.

# పట్టణ పేద గిరిజనులకు ఇందిరమ్మ ఇండ్లు

## గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్ డిమాండ్





**ప్రజాపక్షం/కాజీపేట :** వివిధ మండలాల నుంచి బతుకుతెరువు కొరకు పట్టణాలకు వలస వచ్చి ఉంటున్న గిరిజనులకు, ప్రభుత్వ భూముల్లో నివాసం ఉండే వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, యూనిట్ ధర రూ.10 లక్షల పెంచి ప్రభుత్వమే కట్టించాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ గిరిజన సమాఖ్య హనుమకొండ జిల్లా మూడవ మహాసభ లావుడియా రమాదేవి అధ్యక్షతన బుధవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగింది. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై అంజయ్య నాయక్ మాట్లాడారు. 80సంవత్సరాల స్వాతంత్ర భారతావనిలో ఇంకా ఆదివాసి గిరిజనులు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు దొరకక అభివృద్ధికి నోచుకోక పట్టణాలకు వలస వచ్చి హనుమకొండ లాంటి పట్టణంలో రాష్ట్ర వ్యాప్తంగా నివసిస్తున్నారని, కానీ నేటికీ తలదాచుకోనటానికి ఇల్లు లేనటువంటి దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. రాజ్యాంగంలో గిరిజనులకు అనేక హక్కులు చట్టాలు ఉన్నప్పటికీ పాలకవర్గాలు వాటిని కాలరాస్తున్నారన్నారు, గిరిజన పిల్లల కోసం మెరుగైనటువంటి సంక్షేమ హాస్టల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సినప్పటికీ అద్దె భవనాలలోనే నడుపుతున్నారన్నారు. వార్షిక ప్రణాళికలో గిరిజనులకు కేటాయిచ్చేటువంటి నిధులు కేవలం కాగితాలకే పరిమితం అవుతుందని, ఐటీడీఏల్లో నిధులు దారి మళ్ళిస్తున్నారని, గిరిజనుల అభివృద్ధి కోసం ఖర్చు చేయకపోగా ప్రభుత్వ పెద్దల గుత్తేదారులకు బిల్లులు చెల్లింపులు చేస్తున్నారన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం గిరిజన అస్తిత్వాల పైన పెను భారంగా మారిందని, సంస్కృతి సాంప్రదాయాలను కాలరాస్తున్నారన్నారు. అటవీ సంపదను అప్పనంగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. ఆదివాసి గిరిజనులను అడవుల నుంచి పారదోలే ప్రయత్నం కొనసాగుతూనే ఉందని, గిరిజన సంఘాల పోరాటాల ఫలితంగా సాధించుకున్నటువంటి చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా సంక్షేమ పథకాలు ఊసే లేదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో ఉండేటువంటి గిరిజనులు వారి సమస్యలపై పోరాటాలు కొనసాగించాలని వారి హక్కులను సంస్కృతుల్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన సమాఖ్య బలోపేతమైన శక్తిగా ఎదగాలని వారికి కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందన్నారు. మహాసభలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మాలో శంకర్ నాయక్, నిర్మాణ బాధ్యులు మద్దెల ఎల్లేష్, మాలోత్ మంగ, భూక్య స్వరూప ప్రతిషా తదితరులు పాల్గొన్నారు.

# భారీగా పెరిగిన ఎరువుల ధరలు తగ్గించాలి

## రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్



**ప్రజాపక్షం/జనగామ :** రైతును భూమికి దూరం చేసే కుట్రలో భాగంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎరువుల ధరలను భారీగా పెంచిందని, వెంటనే ధరలు తగ్గించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని రైతులకు ఆమె పిలుపునిచ్చారు. బుధవారం రైతు సంఘం జనగామ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం స్టేషన్‌ఘనపూర్ మండలం చాగల్ గ్రామంలో జిల్లా అధ్యక్షులు ఆది సాయన్న అధ్యక్షతన జరిగింది. సమావేశానికి పశ్య పద్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల మూలంగా ఎరువుల ధరలు భారీగా పెరిగాయన్నారు. భూమి నుంచి రైతులను దూరం చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వం ఎరువుల ధరలు పెంచిందని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉండనుందని, కేంద్రం సబ్సిడీలను ఎత్తివేసే కుట్ర చేస్తుందన్నారు. దీని వలన చిన్న, సన్నకారు రైతులకు కన్నీళ్లు తప్ప మరేమి ఉండదన్నారు. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వలన ధాన్యం కుప్పలు కళ్లాల్లోనే ఉన్నాయన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేయాల్సి ఉందని, రైతుపక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న సంఘంగా ఈ నెల 22 జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెరిగిన ఎరువులు, క్రిమిసంహారక మందులు ధరలకు నిరసనగా ఆందోళన చేయనున్నామన్నారు. ధర్నాల్లో రైతులు, రైతుల క్షేమం కోరే ప్రజాసంఘాలు పాల్గొనాలని కోరారు. విబిజి రాంజీ పథకం వల్ల ఉపాధి హామీ కూలీలకు నష్ట జరుగుతుందన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టాన్ని రద్దు చేయాలని, రోజు వారి వేతనం రూ.700 ఇవ్వడంతో పాటు ఏడాదికి పని దినాలను 200లకు పెంచాలని ఆమె కోరారు. విబిజి రాంజీ పథకాన్ని రద్దు చేయకపోతే భవిష్యత్తులో ఉపాధిహామీ కూలీలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే చట్టాన్ని సవరించి పలు ఇబ్బందులు తెచ్చిపెట్టారని భవిష్యత్తులో దీనిని రద్దు చేసే అవకాశం ఉందని, పోరాడి హక్కులు కాపాడుకోవాలని పశ్య పద్మ కోరారు. 24న రైతుసంఘం జనగామ జిల్లా మహాసభ జఫర్‌గడ్ మండలంలో జరుగుతుందని, మహాసభను విజయవంతం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఆది సాయన్న పిలుపునిచ్చారు. సమావేశంలో రైతుసంఘం రాష్ట్రఉపాధ్యక్షులు కొల్లూరి రాజయ్య, జిల్లా కార్యదర్శి చొప్పరి సోమయ్య, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి జువారి రమేష్, తోట రమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ యూనిస్, మండల అధ్యక్షులు యాకుబ్‌పాషా, ఎండ్యాల సమ్మయ్య, గోనగిరి కుమారస్వామి, బూర్ల యాదగిరి, ముసలయ్య కలకోటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా మెడికోల ర్యాగింగ్

-12 మంది డెంటల్ విద్యార్థులు సస్పెన్షన్
-సుల్తాన్‌బజార్ పిఎస్‌లో కేసు నమోదు

**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** ప్రతిష్టాత్మక ఉస్మానియా వైద్య కళాశాల డెంటల్ విభాగంలో ర్యాగింగ్ భూతం పడగవిప్పింది. జూనియర్ విద్యార్థులను వేధిస్తూ, తమ సొంత పనులు చేయించుకుంటున్న 12 మంది సీనియర్ విద్యార్థులపై సుల్తాన్‌బజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. అఫ్జల్‌గంజ్‌లోని ఉస్మానియా డెంటల్ కళాశాలలో బిడిఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సీనియర్లు, 2025 బ్యాచ్‌కు చెందిన 14 మంది జూనియర్ విద్యార్థులను గత నాలుగు నెలలుగా తీవ్రంగా వేధిస్తున్నారు. సీనియర్ల అరాచకాలను భరించలేక జూనియర్లు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, యాంటీ ర్యాగింగ్ కమిటీ నామమాత్రపు చర్యలతోనే సరిపెట్టడంతో పరిస్థితుల్లో మార్పు రాలేదు. సదరు సీనియర్లు మరింత రెచ్చిపోయి, పనులు చేయని జూనియర్లపై దాడులకు కూడా పాల్పడ్డారు. దీంతో విసిగిపోయిన బాధితులు సుల్తాన్ బజార్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి పర్యవేక్షణలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై బుధవారం సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుల్తాన్ బజార్ డివిజన్ ఏసిపి మట్టయ్య, సిఐ నరేష్‌లతో కలిసి డిసిపి శిల్పవల్లి వివరాలు వెల్లడించారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు ర్యాగింగ్‌కు పాల్పడిన 12 మంది సీనియర్ విద్యార్థులను కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసింది. ర్యాగింగ్ చట్టాల ప్రకారం నిందితులకు కనీసం ఆరు నెలల జైలు శిక్ష పడుతుందని, ఒకవేళ ర్యాగింగ్ వల్ల బాధితులు ఆత్మహత్యలకు పాల్పడితే జీవిత ఖైదు వరకు శిక్షలు పడే అవకాశం ఉందని డిసిపి హెచ్చరించారు. నిందితులకు భవిష్యత్తులో ఇతర విద్యాసంస్థల్లో ప్రవేశాలు దొరకకుండా కఠిన చర్యలు ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఇదిలాఉండగా... సుల్తాన్‌బజార్ పోలీసుల వైఫల్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. స్టేషన్ పరిధిలో ఉస్మానియా మెడికల్ కాలేజీతో పాటు పలు ప్రముఖ విద్యాసంస్థలు ఉన్నప్పటికీ, పోలీసులు యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులు నిర్వహించడంలో విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో డిసిపి ఆధ్వర్యంలో తరచూ సమావేశాలు నిర్వహించేవారని, ప్రస్తుతం ఆ జాడ లేకపోవడం వల్లే ర్యాగింగ్ పెరిగిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు అప్రమత్తమై, కళాశాలల్లో క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

‘మందులు, ఎక్విప్‌మెంట్స్’పర్యవేక్షణకు

# నోడల్ అధికారులను నియమించండి

15 శాశ్వత సిఎంఎస్ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు

సమీక్ష సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ ), తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) ఆస్పత్రులలో టిజిఎంఎస్‌ఐడిసి ద్వారా కొనుగోలు చేస్తున్న మందులు, ఎక్విప్‌మెంట్స్, సివిల్ వర్క్సులను రెగ్యులర్‌గా పర్యవేక్షించేందుకు తక్షణమే నోడల్ ఆఫీసర్లను నియమించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ (సిఎంఎస్) కేంద్రాలకు 15 శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాలభివృద్ధి సంస్థ (టిజిఎంఎస్‌ఐడిసి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ (సిఎంఎస్) పనితీరుపై బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. టిజిఎంసిడిసి ద్వారా కొనుగోలు చేస్తున్న మందులు, సర్జికల్స్, రీజెంట్స్,ఎక్విప్‌మెంట్స్ కొనుగోలు చేస్తున్న టెండర్లను పారదర్శకంగా ఉండేలా విధి విధానాలను రూపొందించాలని, టెండర్లలో పారదర్శకతను మరింత పెంచేందుకు ప్రస్తుతం ఉన్న రెండు కమిటీలకు అదనంగా మరో మూడు కమిటీలను కొత్తగా ఏర్పాటు చేసి,మొత్తం 5 కమిటీలను నియమించాలని మంత్రి ఆదేశించారు. ఈ సంస్థలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులను తక్షణమే బదిలీ చేయాలని ఎం.డి గౌరవ్ ఉప్పల్‌ను ఆదేశించారు. టిజిఎంఎస్‌ఐడిసిలో టెండర్ల ద్వారా కొనుగోలు చేస్తున్న వాటిని నెలవారీగా, విధిగా సమీక్షించుకోవాలన్నారు. అన్ని స్థాయిల ఆసుపత్రులకు (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు) అవసరమైన ఎక్విప్‌మెంట్స్‌కు సంబంధించి ఒక ప్రామాణిక జాబితాను తయారు చేయాలన్నారు. తద్వారా అన్ని స్థాయిల ఆస్పత్రులలో ఏక రూపత ఉంటుందన్నారు.

**‘క్యూర్’లో మరో నాలుగు కొత్త సిఎంఎస్ కేంద్రాలను ఏర్పాటు చేయండి:**

మందుల సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, క్యూర్ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న రెండు సిఎంఎస్ కేంద్రాలకు అదనంగా మరో 4 కొత్త సిఎంఎస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు . హిమోఫిలియా బాధితులకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. హిమోఫిలియా బాధితులకు నెలవారిగా అవసరమైన మందులను ఉచితంగా అందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ మందులను జనరల్ ఆసుపత్రుల ద్వారా బాధితులకు అందుబాటులో ఉంచాలన్నారు. హిమోఫిలియా ఎ రోగులకు ఉపయోగించే మందులను ప్రస్తుతం ఉస్మానియా, గాంధీ, నీలోఫర్ హాస్పిటల్ లో అందుబాటులో ఉందని,అధికారులు మంత్రికి వివరించారు. దీనిపైన మంత్రి స్పందిస్తూ ఈ మందులను అదనంగా ఖమ్మం, వరంగల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని దామోదర్ రాజనర్సింహ అధికారులు ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో టిజిఎంఎస్‌ఐడిసి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ ఉప్పల్, కార్పొరేషన్ అధికారులు ఇడి ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు,సంస్థ అధికారులు పాల్గొన్నారు.

దొడ్డు బియ్యం విక్రయాల్లో

# ఎలాంటి అక్రమాలు లేవు

జెమ్ ఇ-వేలం ద్వారా పూర్తిస్థాయి పారదర్శకతతో విక్రయాలు : పౌర సరఫరాల సంస్థ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో మిగులు దొడ్డు బియ్యం విక్రయాలపై వెలువడిన అవినీతి ఆరోపణలను తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ (టిజిఎస్‌సిఎస్‌సిఎల్) తీవ్రంగా ఖండించింది. ‘దొడ్డుబియ్యం మాఫియా దందా‘ పేరుతో కొన్ని పత్రికల్లో ప్రచురితమైన కథనాలు పూర్తిగా ఆధారరహితమైనవని, ప్రభుత్వ విధాన నిర్ణయాన్ని కుంభకోణంగా చిత్రీకరించే ప్రయత్నం దురుద్దేశ పూరితమని స్పష్టం చేసింది. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో సంస్థ అధికారులు మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన నేపథ్యంలో సుమారు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం మిగులుగా నిల్వ ఉండటంతో, వాటి నాణ్యత క్షీణించకుండా, గిడ్డంగులపై భారం తగ్గించే ఉద్దేశంతో విక్రయ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం కూడా ఉందని వెల్లడించారు. విక్రయ ప్రక్రియ మొత్తం ప్రభుత్వ ఈమార్కెట్‌ప్లేస్ (జెమ్) వేదికపై బహిరంగ ఈవేలం ద్వారా నిర్వహించామని, ఇందులో ఎలాంటి నామినేషన్లు, రహస్య ఒప్పందాలు లేదా ప్రత్యేక ప్రాధాన్యతలకు అవకాశం లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా అర్హత కలిగిన ప్రతి బిడ్డర్‌కు సమాన అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన టన్నుకు రూ.21,600 రిజర్వ్ ధర కంటే అధికంగా రూ.21,700 ధర లభించిందని, తక్కువ ధరలకు బియ్యాన్ని విక్రయించారన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు. నిల్వల మొత్తం విలువ సుమారు రూ.303 కోట్లే ఉంటే, వేల కోట్ల రూపాయల నష్టం జరిగిందనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. అత్యంత కీలకంగా, ఇప్పటివరకు ఒక్క గింజ బియ్యం కూడా గిడ్డంగుల నుంచి విడుదల కాలేదని, ఒక్క విడుదల ఉత్తర్వు కూడా జారీ చేయలేదని సంస్థ వెల్లడించింది. వేలంలో విజేతలైన సంస్థల పత్రాల పరిశీలన ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని, ఈ పరిస్థితుల్లో బియ్యం మళ్లింపు, రీపాలిషింగ్, ఎగుమతులు లేదా అక్రమ విక్రయాలపై వచ్చిన ఆరోపణలు అసాధ్యమైనవని పేర్కొంది. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో వాస్తవాలను ధృవీకరించి మాత్రమే ప్రచారం చేయాలని మీడియాకు విజ్ఞప్తి చేసింది.

## ‘తెలంగాణ’ పేరు వాడే హక్కు హెచ్‌సిఎకు లేదు:టిసిఎ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో జరగనున్న టిజి20 లీగ్‌పై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. బిసిసిఐ నుంచి తప్పనిసరిగా పొందాల్సిన అనుమతులు లేకుండానే టిజి20 లీగ్‌ను నిర్వహిస్తున్నారని, ఇది మోసపూరిత, అక్రమ వాణిజ్య క్రికెట్ టోర్నమెంట్ అని టిసిఎ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పరిధి హైదరాబాద్ నగరానికే పరిమితమని, మొత్తం తెలంగాణ క్రికెట్‌కు ప్రతినిధిగా వ్యవహరించే అధికారం హెచ్‌సిఎకు లేదని ధరం గురువారెడ్డి పేర్కొన్నారు. టిజి20 లీగ్ నిర్వహించాలంటే హైదరాబాద్ ప్రాంతాల పేర్లతోనే ఫ్రాంచైజీలు ఏర్పాటు చేయాలని, తెలంగాణ జిల్లాల పేర్లను వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించే హక్కు హెచ్‌సిఎకు లేదని అన్నారు. బిసిసిఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న ఈ లీగ్‌లో భాగస్వామ్యమవుతున్న వ్యక్తులు, సంస్థలు, ప్రమోటర్లు, ఫ్రాంచైజీ యాజమాన్యాలు భవిష్యత్తులో చట్టపరమైన, క్రిమినల్ పరిణామాలను ఎదుర్కోవాల్సి రావచ్చని హెచ్చరించారు. టిజి20 లీగ్ ఫ్రాంచైజీల్లో రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులు, ప్రభావశీల వర్గాలకు చెందిన వ్యక్తులు భాగస్వాములుగా ఉండటంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. క్రికెట్ పరిపాలన రాజకీయ ప్రభావాలకు దూరంగా ఉండాలన్న బిసిసిఐ సూత్రాలకు ఇది విరుద్ధమని పేర్కొన్నారు. కొన్ని ఫ్రాంచైజీలు తెలంగాణకు చెందినవిగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, వాటి వెనుక ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపార ప్రయోజనాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ధరం గురువారెడ్డి తెలిపారు. ఫ్రాంచైజీల యాజమాన్యం, పెట్టుబడిదారులు, వ్యాపార భాగస్వామ్యాలపై పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.

## రాయదుర్గం భూమి తమదంటూ ఎస్‌బిఐ పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నెం.83/1లో 5 ఎకరాల భూమి వేలం, విక్రయాన్ని రద్దు చేయాలని కోరుతూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. ఈ భూమిని 2010లో అప్పటి ఎస్‌బీహెచ్‌కు ప్రభుత్వం కేటాయించిందని, ఇందుకోసం రూ.13.33 కోట్లు చెల్లించిందని బ్యాంకు వాదించింది. భూకేటాయింపు రద్దుపై ఇప్పటికే న్యాయపోరాటం కొనసాగుతోందని, తమ వివరణపై నిర్ణయం తీసుకోకముందే టీజీఐఐసీ వేలం నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొంది. వేలం ద్వారా జరిగిన విక్రయాన్ని చెల్లనిదిగా ప్రకటించాలని కోరగా, పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది.

## రేవంత్‌రెడ్డి పిటిషన్‌లపై తీర్పు రిజర్వ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సందర్భంగా నమోదైన ఐదు క్రిమినల్ కేసులను కొట్టివేయాలని కోరుతూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లపై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఎన్నికల ప్రచారంలో అనుమతి లేకుండా రోడ్‌షో నిర్వహించడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, సమావేశాల్లో శబ్ద కాలుష్యం కలిగించారన్న ఆరోపణలపై కేసులు నమోదయ్యాయి. జస్టిస్ కె.సుజన వాదనలు పూర్తిచేసి తీర్పును రిజర్వ్ చేశారు.

## తెలుగు విద్యార్థి కేసులో కేంద్రానికి నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫిన్‌లాండ్‌లో చదువుతున్న తెలంగాణ విద్యార్థి మణిదీప్ అదృశ్యమైన ఘటనపై కేంద్ర ప్రభుత్వం, ఫిన్‌లాండ్‌లోని భారత రాయబార కార్యాలయం, తెలంగాణ పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మే 6 నుంచి కుమారుడు కనిపించడం లేదని తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలు సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 24కు వాయిదా వేశారు.

## ఆరు దశాబ్దాల జాప్యాన్ని సమర్థించలేం: హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ సర్వే నెం.22లోని 3.14 ఎకరాల భూమిపై హక్కులు కోరుతూ దాఖలైన పిటిషన్‌లను హైకోర్టు కొట్టివేసింది. 1950లో తమ పూర్వీకులకు పట్టా మంజూరైందని పిటిషనర్లు వాదించినప్పటికీ, ఆ హక్కుల కోసం ఆరు దశాబ్దాలపాటు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని కోర్టు ప్రస్తావించింది. 2019లో దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, అసాధారణ జాప్యానికి సహేతుకమైన కారణాలు చూపలేదని పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా ప్రభుత్వ భూములపై హక్కులు కోరలేరని ప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకుని పిటిషన్‌లను తిరస్కరించారు.

## సీతాఫల్‌మండి బాలికల పాఠశాలకు ప్రత్యామ్నాయ స్థలం గుర్తించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ బాలికల పాఠశాల తరలింపునకు అనువైన ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించి నివేదిక సమర్పించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. పాఠశాలను ఆర్యవాటిక ప్రభుత్వ పాఠశాలకు మార్చాలన్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని సూచించింది. ప్రతిపాదిత స్థలం 3.7 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది.

## కిషన్‌రెడ్డిపై సిఎం రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం

ఎన్. రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపైన సిఎం రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సిఎం లేఖ రాయడం అత్యంత హాస్యాస్పదమన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మెట్రోకు ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీఫీజిబిలిటీ రిపోర్టు, ఫైనాన్షియల్ ఫీజిబిలిటీ రిపోర్టు, డిపిఆర్‌లను ఇప్పటి వరకు సమర్పించకుండా, అవసరమైన సాంకేతిక పత్రాలు ఇవ్వకుండా కేంద్రం అడ్డుకుంటుందని చెప్పడం ముమ్మాటికీ అవాస్తవమని మండిపడ్డారు. కేంద్రం మెట్రో ఫేజ్2కు వ్యతిరేకం కాదని, ఈ ప్రాజెక్ట్‌ను ఎప్పుడు కూడా తిరస్కరించలేదని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి ఇది వరకు కేంద్ర మంత్రులతో సమావేశమైనప్పుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి చెప్పి కలిశారా? అని ప్రశ్నించారు. కేవలం ప్రజలను తప్పుదారి పట్టించేందుకే రేవంత్ రెడ్డి లేఖ రాశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఒక్కటీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని మండిపడ్డారు.

విఓఎ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను

# ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం

ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న విఓఎ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్ నారాయణగూడ, ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఐకెపి విఓఎ సంఘం (ఐఎన్‌టియుసి), తెలంగాణ రాష్ట్ర ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ (ఐఎన్‌టియుసి) ల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మొగుళ్ళ రాజి రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఐకెపి విఓఎలకు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నెలకు రూ.3 వేల నుండి రూ.5వేలను చెల్లించి వారి జీవితాలను అంధకారంలోకి నెట్టివేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉద్యోగ, కార్మికుల సంక్షేమాన్ని కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, ఆర్‌టిసి కార్మికుల సమస్యలు, జలమండలి కార్మికుల సమస్యలు పరిష్కరించడంతోపాటు రాష్ట్రంలో ఉద్యోగ, కార్మికులకు కనీస వేతనాలు పెంచిందని తెలిపారు. ఐకెపి విఓఎ లకు సమాన పనికి సమాన వేతనం నెలకు రూ.26 వేలు, ఉద్యోగ భద్రత, బీమా వంటి న్యాయమైన కోరికలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మొగుళ్ళ రాజి రెడ్డి హామీ ఇచ్చారు. సమావేశంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్న గౌడ్, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.పి. రాఘవేంద్ర రాజ్, తెలంగాణ రాష్ట్ర ఐకెపి విఓఎ సంఘం అధ్యక్షులు పి.అరుణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్.ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ అధ్యక్షులు బి.రవి, ప్రధాన కార్యదర్శి సిద్ది రాజు, నాయకులు గోలి శ్రావణి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలి

బికెఎంయు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కార్మికులకు హామీ ఇచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయకపోవడం శ్రమజీవుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెంకట్రాములు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున రెండు విడతల్లో నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదన్నారు. దీంతో లక్షలాది మంది పేద కుటుంబాలు తీవ్ర నిరాశకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల పనిలో కనీసం 20 రోజులు పనిచేసిన వారిని అర్హులుగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మందికి పైగా వ్యవసాయ, ఉపాధి కూలీలు దరఖాస్తులు చేసుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ వారికి ఎలాంటి ప్రయోజనం అందలేదని విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



## సిఎంఒహెచ్ డాక్టర్ పద్మజ బదిలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:**గ్రేటర్ హైదరాబాద్‌లో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్(సిఎంఒహెచ్) డాక్టర్ కె. పద్మజ డైరక్టరేట్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్‌లో మలేరియా డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. దీంతో డాక్టర్ కె.పద్మజను గ్రేటర్ హైదరాబాద్‌లోని ఎఎంఒహెచ్ అధికారులు వీడ్కోలు పలికారు. అనంతరం ఆమె డైరక్టరేట్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్‌లో మలేరియా డిపార్ట్‌మెంట్‌లో బుధవారం బాధ్యతలను స్వీకరించారు.

## లైసెన్స్ లేని ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలపై కఠిన చర్యలు

ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో చెల్లుబాటు అయ్యే పిఎస్‌ఎఆర్‌ఎ లైసెన్స్ లేకుండా ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలను నిర్వహించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఇంటెలిజెన్స్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ విజయ్ కుమార్ హెచ్చరించారు. ప్రైవేట్ సెక్యూరిటీ రంగంలో నిబంధనల అమలు, సిబ్బంది భద్రతా ప్రమాణాలు, కార్మిక సంక్షేమ అంశాలపై బుధవారం లక్డీకాపూల్‌లోని ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల యజమానులు నియమించే ప్రతి గార్డు, సూపర్‌వైజర్‌కు తప్పనిసరిగా పోలీస్ బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ నిర్వహించాలని, 21 రోజుల ప్రాథమిక శిక్షణ పూర్తిచేసిన వారినే విధుల్లోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇటీవల కొందరు సెక్యూరిటీ సిబ్బంది నేర కార్యకలాపాల్లో పాల్గొన్న ఘటనల నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇంటెలిజెన్స్ ఎడిజి విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓఎస్‌డి వి. కమలాసన్ రెడ్డి , డిసిపి రితురాజ్ , ఎస్‌పి జి. చక్రవర్తి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ జి. సుమతి గోపాల్ దాస్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల యజమానులు, అసోసియేషన్ల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ‘ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ (రెగ్యులేషన్) యాక్ట్– 2005’తో పాటు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబర్ 43 ప్రకారం ప్రతి ఏజెన్సీకి లైసెన్స్ తప్పనిసరి అని గుర్తు చేశారు. నిబంధనలు ఉల్లంఘించే ఏజెన్సీలపై భారీ జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెక్యూరిటీ గార్డులకు ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనాలు, ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటి సంక్షేమ సౌకర్యాలు కల్పించడం యజమానుల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ నిబంధనల అమలును కార్మిక శాఖ నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు.

## తెలంగాణ వారికే న్యాయమూర్తుల పదవులు

హైకోర్టు బార్ అసోసియేషన్ నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో తెలంగాణ వాళ్లనే మూలాలున్న వారికే ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తితో కూడిన కొలీజియం తెలంగాణకు చెందిన అభ్యర్థులను మాత్రమే సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



## సిఎం-ను కలిసిన ఇషా సింగ్

ఎంసిహెచ్‌ఆర్‌డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ క్రీడాకారిణి, అర్జునఅ వార్డు గ్రహీత ఈషా సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్ కప్ (రైఫిల్/పిస్టల్) 2026 పోటీల్లో స్వర్ణం సాధించి ప్రపంచ రికార్డు కైవసం చేసుకున్న నేపథ్యంలో ఈషా సింగ్‌ను సిఎం సత్కరించి అభినందించారు.

## కృష్ణలంక ఘటనపై ఎపి ప్రభుత్వం సీరియస్..

సమగ్ర విచారణకు సిఎం ఆదేశం

**అమరావతి:** విజయవాడలోని కృష్ణలంక ఘటనను ఎపి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిజిపి హరీశ్ గుప్తాను సిఎం చంద్రబాబు ఆదేశించారు. గాదె సాయికృష్ణ అనే యువకుడిని లాకప్‌లోనే కొట్టి చంపారంటూ పోలీసులపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై ఉన్నతస్థాయి విచారణ జరిపి నిజానిజాలు నిగ్గుతేల్చాలని సిఎం ఆదేశించారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇప్పటికే కృష్ణలంక పిఎస్ సిఐను వీఆర్‌కు పంపామని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు డిజిపి తెలిపారు.

## నీట్‌– యుజికి సంబంధించిన పిటిషన్‌పై జూలైలో విచారణ

**న్యూఢిల్లీ :** నీట్‌–యుజి 2026 పున: పరీక్ష నిర్వహించాలన్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్.నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం జులైలో విచారణ జరుపుతుందని సుప్రీంకోర్టు బుధవారం తెలిపింది.పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో, వైద్య ప్రవేశాల కోసం మే 3న జరగాల్సిన నేషనల్ ఎలిజిబిలిటీ–కమ్–ఎంట్రెన్స్ టెస్ట్ (అండర్‌గ్రాడ్యుయేట్), లేదా నీట్–యుజిని మే 12న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) రద్దు చేసింది. ప్రస్తుతం సిబిఐ ఈ విషయంపై దర్యాప్తు చేస్తోంది. జూన్ 21న పున: పరీక్ష జరగనుంది.బుధవారం నీట్–యుజి 2026ను తిరిగి నిర్వహించాలన్న నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిగస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ముందు విచారణ జరిగింది.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/మోమిన్‌పేట్** : వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండల పరిధిలోని సుదోక్కతాండనుండి మిట్యానాయక్‌తాండ, లంచ నాయక్ తాండాల వరకు కోటి రూపాయలతో నిర్మించే నూతన బీటి రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ శిలాఫలక శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ గృహప్రవేశాలతో పేదల కళ్లల్లో ఆనందం

### మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట** : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లతో పేదల కండ్లలో ఆనందం వెల్లివిరుస్తుందని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. బుధవారం మూడు చింతలపల్లి మున్సిపాలిటి పొన్నాల్‌లో లబ్దిదారుకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాన్ని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసెకాయల వెంకటేష్‌తో కలిసి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందన్నారు. ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతున్న తెలంగాణ రాష్ట్ర సిఎం రేవంత్‌రెడ్డికి ప్రతి ఒక్కరు రుణపడి ఉండాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ సహకారంతో మేడ్చల్ నియోజకవర్గానికి మరిన్ని ఇండ్లు మంజూరు చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, కౌన్సిలర్లు, మాజీ ఉపసర్పంచ్ గడ్డం రమేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అజయలక్ష్మి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులపై తెలంగాణా ప్రజానాట్యమండలి హర్షం

**ప్రజాపక్షం/జవహర్‌నగర్** : కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం తెలంగాణా భాసా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణా ప్రజానాట్యమండలి కళాకారుల బృందం ఆ శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డిని కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులను అధికారికంగా గుర్తించటం తమకు తగిన గౌరవం దక్కినట్లే అని తెలంగాణా ప్రజానాట్యమండలి మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రమీల, వెంకటాచారి, వర్కింగ్ ప్రసిడెంట్ ప్రవీణ్‌లు హర్షం వ్యక్తం చేసారు. అనంతరం సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్క కళాకారుడికి ప్రభుత్వపరంగా గుర్తింపు కార్డు మంజూరు చేస్తోందని, ఇది నిరంతర ప్రక్రియ అని, దీనికోసం అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు దరఖాస్తు చేస్తున్న వారందరికీ గుర్తింపు కార్డులిస్తున్నామని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణా ప్రజానాట్యమండలి హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పడాల నళిని, సైదులు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సుధాకర్, సహాయ కార్యదర్శి ముచ్చపోత రాములు, కళాకారులు వనం అడివయ్య, రామస్వామి, అరుణ్‌కుమార్, జోసెఫ్, భాను, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రతిభ ఉన్న కళాకారులను ప్రోత్సహించాలి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్** : ఘట్‌కేసర్ సర్కిల్‌కి చెంది న సింగర్ అనిల్ యాదవ్ స్వరకల్పనలో రాబోతున్న అందమైన ఓ చిన్నదాన అనే పాట సీడిని బిగ్‌బాస్ ఫేమ్, మ్యూజిక్ డైరెక్టర్ సింగర్ భోలే షావలి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమం లో భోలే మాట్లాడుతూ ప్రతిభావంతులైన నూత న కళాకారులను ప్రతి ఒక్కరిని ప్రోత్సహించాలన్నారు.




ఎంతో కష్టపడి చేసిన ఈ పాటను ప్రతి ఒక్కరూ ఆదరించి ఆశీర్వదించాలన్నారు. ఈ పాట లో నటుడిగా ఉద్యమ కెరటాలు సినిమా హీరో చందు రాగం, రుచిత ఎంతో అద్భుతంగా చేశారు. ఈ కార్యక్రమంలో నటుడు చందు, సింగర్ అనిల్, డైరెక్టర్ యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వ్యక్తిపై రాళ్లతో దాడి

### ఆరుగురు నిందితుల రిమాండ్ ఒకరు పరారీ

**ప్రజాపక్షం/శామీర్‌పేట** : మద్యం సేవించి విచక్షణ రహితంగా ఓ వ్యక్తిపై రాళ్లతో దాడి చేసిన ఘటనలో ఆరుగురు నిందితులను రిమాండ్‌కు తరలించగా మరో నిందితుడు పరారీలో ఉన్న సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాతి చోటు చేసుకుంది. శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డి తెలిపిన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి సమయంలో తూంకుంట శివాలయం సమీపంలో నిందితులు కత్తి మహేష్, కత్తి శంకర్, సంకిలి గణేష్, కత్తి వినయ్, కొలారి సచిన్, పారంది అరుణ్‌కుమార్‌లు నిందితుడు నాగులుతో కలిసి మద్యం సేవించి బాధితుడి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి రాళ్లతో దాడి చేశారు. దీంతో తీవ్ర రక్తగాయాలైన వ్యక్తిని కాపాడేందుకు వచ్చిన బాధితుడి కుటుంబీకులపై కూడ దాడిచేసి బెదిరింపులకు పాల్పడ్డారు. ఫిర్యాదుదారుడు శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఘటనపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. కాగా మరో నిందితుడు నాగులు పరారీలో ఉండగా పట్టుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

# మహానగరంలో భారీ మోసం

### అధికలాభం ఆశ చూపి రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.1.95 కోట్లు వసూల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో మరో భారీ పెట్టుబడి మోసం వెలుగులోకి వచ్చింది. అధిక లాభాల ఆశ చూపించి ఓ రిటైర్డ్ ఉద్యోగి నుంచి దాదాపు రూ.1.95 కోట్లు వసూలుచేసి మోసం చేసిన ఘటనపై సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. రామ్‌నగర్‌కు చెందిన దోర్నాల రవీందర్ (63), వజీర్ సుల్తాన్ టొబాకో కంపెనీ మాజీ ఉద్యోగి. రెండు సంవత్సరాల క్రితం తన పరిచయస్తులైన రామకాంత్, రాజు, మధుసూదన్ ద్వారా హేమంత్ కుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యాపారం, ట్రావెల్స్ బిజినెస్ నిర్వహిస్తున్నానని, పెట్టుబడులపై 5 నుంచి 25 శాతం వరకు లాభాలు ఇస్తానని హేమంత్ కుమార్ నమ్మబలికినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ నమ్మకంతో రవీందర్ తొలుత రూ.12.50 లక్షలు నగదుగా పెట్టుబడి పెట్టగా, అనంతరం పలుమార్లు నగదు మరియు ఆన్‌లైన్ లావాదేవీల ద్వారామొత్తంగా రూ.1,95,44,000 పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. ఇందులో తన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు బంధువుల నుంచి తీసుకున్న డబ్బు కూడా ఉన్నట్లు వెల్లడించారు. మొదట్లో కొంత మొత్తాన్ని లాభాల పేరుతో చెల్లించిన హేమంత్ కుమార్, తర్వాత మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ప్రోత్సహిస్తూ భారీ లాభాల హామీలు ఇచ్చాడని బాధితుడు పేర్కొన్నారు. అయితే గడువు ముగిసినా అసలు డబ్బు తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ, చివరకు ఫోన్ స్విచ్ ఆఫ్‌చేసి పరారైనట్లు ఆరోపించారు. దర్యాప్తులో హేమంత్ కుమార్ ఇదే తరహాలో మరికొంత మందిని కూడా మోసం చేసినట్లు బయటపడింది. రామకాంత్ నుంచి రూ.43.86 లక్షలు, రాజు నుంచి రూ.20.18 లక్షలు, మధుసూదన్ నుంచి రూ.15లక్షలు, సతీష్ నుంచి రూ.41.98 లక్షలు, శివ నుంచి రూ.13.01 లక్షలు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం బాధితుల నుంచి సుమారు రూ.3.29కోట్లకు పైగా సేకరించినట్లు సమాచారం. ఆర్థిక నేరాల విభాగం ఎస్ఐ స్వప్న కేసు దర్యాప్తు చేస్తున్నారు. పెట్టుబడుల పేరుతో అధిక లాభాల హామీలు ఇస్తున్న వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## మంచినీటి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు

### అధికారులను ఆదేశించిన నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి

**ప్రజాపక్షం/నిజాంపేట్** : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మంచినీటి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలను వేగవంతం చేయాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అధికారులను ఆదేశించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కలిసి కొలను హన్మంత రెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాచుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొలను హన్మంత రెడ్డి మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను




ఎండి దృష్టికి తీసుకువెళ్లామని, సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. గత పదిహేను సంవత్సరాల కాలంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి వేగవంతం అయ్యిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కుత్బుల్లాపూర్ ప్రజలు నీటికొరతతో ఇబ్బందులు పడకుండా చూడడం తమ బాధ్యత అని, రాబోయే ఏడాది కాలంలో నియోజకవర్గంలో ఎలాంటి నీటి సమ స్య లేకుండా చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కాలనీ, బస్తీకి తగినంత తాగునీటిని సరఫరా అందేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు హెల్మెట్లు అందజేత

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సిఐ భాస్కర్‌రెడ్డి అన్నారు.కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు,భాగ్య నగర్ గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన హెల్మెట్ల కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావుతో కలసి సిఐ ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ సభ్యులందరికీ హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడు తూ గత కొంత కాలంగా పోలీసులు చేపడుతున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించాలని సూచించారు. ప్రెస్ క్లబ్ సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు పేర్కొన్నారు.






హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ మండా సురేష్‌కుమార్,క్లబ్ ప్రధా న కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి సురేష్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆర్ నర్సింగ్‌గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ వడ్డెర సంఘం అధ్యక్షులు బోదాసు రవి, ధనలక్ష్మి ,మనోజ్,శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## 30లోగా ఇ కెవైసి పూర్తి చేసుకోవాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ నెల 30 లోగా ఎల్పీజీ వినియోగదారులందరూ తప్పనిసరిగా ఈ కెవైసిని పూర్తి చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉప్పల్, బాలానగర్ సంబంధిత ఆయిల్ కంపెనీల సేల్స్ అధికారులు, ఎల్పీజీ డీలర్లు, మేనేజర్లతో సమావేశమయ్యారు. జిల్లాలో ఉన్న 14 లక్షల 49 వేల 460 గ్యాస్ కనక్షన్లలో 4 లక్షల 32 వేల ఎల్పీజీ వినియోగదారులు ఈ కేవైసీ పూర్తి చేయాల్సి ఉందన్నారు. నిర్ణీత గడువులోగా ఎల్పీజీ వినియోగదారులందరూ ఈ కెవైసి పూర్తి చేసుకోవాలని కోరారు.



## ఎస్సీ, బిసీ రైతులకు స్థలాన్ని కేటాయించాలి

### డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి** : నాగారం డివిజన్ రాంపల్లి గ్రామంలో వ్యవసాయం చేసుకొంటూ జీవనాలు గడుపుతున్న ఎస్సీ, బిసీ రైతులకు ల్యాండ్ పుల్లింగ్ కింద స్థలాన్ని కేటాయించాలంటూ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటపల్లి వజ్రేష్ యాదవ్ కోరారు. బుధవారం ఆయన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కల్సి వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాంపల్లి గ్రామం సర్వే నంబర్ 388లోని 38 ఎకరాల విస్తీర్ణ వ్యవసాయ భూమిలో 270 మంది రైతులు వ్యవసాయంతో జీవనం గడుపుతున్నారన్నారు. వీరందరినీ ఆదుకోవాలని కోరారు.

## 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు

### కలెక్టర్ దీపక్‌తివారి పిలుపు

**ప్రజాపక్షం/వికారాబాద్** : 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర దీపక్ తివారీ పిలుపునిచ్చారు. బుధవారం ఎన్నెపల్లి చౌరస్తా నుండి ఎన్‌టిఆర్ చౌరస్తా వరకు ప్రత్యేక సమగ్ర సవరణ అవగాహనపై యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు.




ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని అలాంటి యువత తప్పనిసరిగా ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనాలన్నారు. జున్ 25నుండి జులై వరకు ఇంటింటి గణన నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితా పారదర్శకంగా ఉండేందుకు ఎస్ఐఆర్ కార్యక్రమం తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాఎస్‌పి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలన్నారు. ఇంటింటిసర్వే కారణంగా అర్హులైన పౌరులనుఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులను జాబితాలో లేకుండా చేసేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్‌బస్వరాజ్ , సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

**మార్గదర్శాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు భూ సేకరణ చేపట్టాలి :**
రేడియల్ రోడ్లు, పరిశ్రమల స్థాపనకు సంబంధించిన భూసేకరణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు భూసేకరణ అవసరమన్నారు. భూముల మార్కెట్ విలువను నిర్ధారించాలని కలెక్టర్ తెలిపారు. భూ ముల నష్టపరిహారంపై సమాలోచనలు చేయాలని సూచించారు. హెచ్‌డిఏ తాత్కాలిక బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

**ప్రస్తుతం ఉన్న భూముల మార్కెటింగ్ ఆధారంగా ధరలను నిర్ధారించాలి:**
జిల్లాలోని పలు ప్రాంతాల్లో పవర్‌గ్రిడ్‌ద్వారా 765 కెవి లైన్ల ఏర్పాటుకు భూ సేకరణ సంబంధించిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడత, రెండవ విడత గృహాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహణ:**
ఇందిరమ్మ గృహనిర్మాణపనుల పురోగతిపై మొదటివిడత ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇండ్లు మంజురు, లబ్దిదారు ఎదురుకొంటున్న సమస్యలు వాటి పరిష్కారాలపై సమగ్రంగా అధికారులతో చర్చించారు. మంజూరైన ప్రతిఇంటి నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, బస్వరాజ్, దశరథ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



## రహదారి విస్తరణ పనుల్లో నాణ్యతా లోపాలు

### సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటపల్లి శంకర్

**ప్రజాపక్షం/జవహర్‌నగర్** : రహదారి విస్తరణ పనుల్లో నాణ్యతా లోపాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో జిల్లా అధికార యంత్రాంగం విచారణ జరపాలని సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటపల్లి శంకర్ డిమాండ్ చేసారు. బుధవారం సిపిఐ బృందం జవహర్‌నగర్ నుండి చెన్నాపూర్ వెళ్లే 100 ఫీట్ల ప్రధాన రహదారి విస్తరణ, మరమ్మత్తు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాలు తొలగించకుండా రోడ్డు విస్తరణ పనులు చేయటం వల్ల ఈ రహదారి పై ప్రయాణించే వారికి ఇబ్బందులు తలెత్తుతాయని, సకాలంలో విస్తరణ పనులు పూర్తి చేయకుండా నెలల తరబడి కొనసాగించటం వల్ల తరచు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నాణ్యతతో మరమ్మత్తు పనులు చేయటం లేదని స్పష్టమవుతోందని, పాత రోడ్డు స్క్రాప్‌ను వాడుతుండటం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ అన్వర్, సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, సిహెచ్ మాధవి, డి.మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి**
యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో విద్యాశాఖాధికారులు పూర్తి చేయటంలో జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలివ్వాలంటూ సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటపల్లి శంకర్ కోరారు. బుధవారం ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అన్వర్‌తో కల్సి జవహర్ నగర్ ఫైరింగ్ కట్ట ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడి సమస్యలను అధ్యయనం చేసారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనం, నాణ్యత, తరగతి గదులు, తాగునీరు, మరుగు దొడ్లు వంటి వసతుల విషయమై విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెల్సుకొన్నారు. ప్రభుత్వం పేర్కొంటున్న విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించటంలో జిల్లా అధికార యంత్రాంగం విఫలమవటం పట్ల ఆందోళన వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహ, కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, గిరిప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి కొండా సత్యం, ఎఐటియుసి కాప్రా మండల అధ్యక్షురాలు కోదాసు జయమ్మ, సిహెచ్ మాధవి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.



## నవాబుపేటలో సంస్కృతి స్కూల్ ప్రారంభం

### ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరు

**ప్రజాపక్షం/నవాబుపేట్:** నవాబుపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన సంస్కృతి స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రైవేట్ విద్యాసంస్థలు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సంస్కృతి స్కూల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. స్కూల్ కరెస్పాండెంట్ కరణం రఘు విద్యారంగంలో చేస్తున్న సేవలను ఎమ్మెల్యే ప్రశంసించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆధునిక సౌకర్యాలతో స్కూల్‌ను ఏర్పాటు చేసినందుకు ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, ఎఎంసి చైర్మన్ రాథోడ్ గీతాసింగ్, మాజీ పీఏసి ఎస్ చేర్మెన్ పోలీస్ రాంరెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటా

### మల్కాజిగిరి నూతన తహసీల్దార్ సుజాత

**ప్రజాపక్షం/మల్కాజిగిరి** : మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాలయంలో ఒకే సారి తహసీల్దార్, డిప్యూటి తహసీల్దార్లను ఉన్నతాధికారులు బదిలీ చేసారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సీతారాంను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఏఓగా బదిలీ చేసి ఆయన స్థానంలో కలెక్టరేట్‌లో ఏఓగా పని చేస్తున్న సుజాతను నియమించగా ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించింది. తాను తహసీల్దార్‌గా పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, రెవెన్యూ సంబంధించిన పనుల్లో ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదించాలని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. మరో పక్క సికింద్రాబాద్ తహసీల్దార్‌గాపని చేస్తున్న రంజని యాదవ్‌ను మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేయటంతో ఆమె సైతం బుధవారమే బాధ్యతలు స్వీకరించారు.

## అనురాగ్ విద్యార్థికి డాక్టరేట్ పట్టా

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** క్షయవ్యాధి నిరోధక ఔషదాల భద్రత, నాణ్యతపై మరింత లోతైన అవగాహనకు దోహదపడే పరిశోధనకు అనురాగ్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయం ఔషధ శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి అరుణ్ కుమార్ పోలే తన పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసి డాక్టరేట్ అందుకున్నారు. ద్రవ క్రోమాటోగ్రఫీ, ద్రవ్యరాశి విశ్లేషణ సాంకేతికత, కంప్యూటర్ ఆధారిత విషతుల్యత అంచనాల ద్వారా కొత్తగా ఆమోదించబడిన క్షయవ్యాధి నిరోధక ఔషధాలు వాటి కలయికల విచ్ఛిన్న ఉత్పత్తుల గుర్తింపు వేరుచేయడం లక్షణ నిర్ధారణ అనే అంశంపై నిర్వహించిన పరిశోధనకు ఈ గౌరవం లభించింది. ఈ పరిశోధనను డాక్టర్ గంగారపు కిరణ్ పర్యవేక్షణలో పూర్తి చేశారు. పరిశోధనలో కొత్తగా ఆమోదించబడిన క్షయవ్యాధి నిరోధక ఔషధాలు వివిధ పరిస్థితుల్లో విచ్ఛిన్నమయ్యే సమయంలో ఏర్పాడే ఉప ఉత్పత్తులను గుర్తించడం వాటిని వేరుచేయడం వాటి రసాయన లక్షణాలను నిర్ధారించడం వంటి అంశాలను అత్యాధునిక విశ్లేషణ పద్ధతుల ద్వారా అధ్యయనం చేశారు. ఈ పరిశోధనభవిష్యత్తులో ఔషధ భద్రత నాణ్యత నియంత్రణ ఔషధ అభివృద్ధి రంగాలకు ఉపయోగపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ అర్చనా మంత్రీ పరీక్షల విభాగాధిపతి డాక్టర్ ముత్తారెడ్డి, పరిశోధనాభివృద్ధి విభాగాధిపతి డాక్టర్ సతీష్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సికందర్ బాబా, ఔషధ శాస్త్ర పీఠాధిపతి డాక్టర్ వసుధ బక్షీ,అరుణ్ కుమార్ పోలేను అభినందించారు.

## మెటల్ ఫోర్జింగ్ కంపెనీలో అగ్ని ప్రమాదం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లిలో ఓ డ్రిల్లింగ్ బిట్ కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు, అగ్ని మాపక అధికారి చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్ 2 లోని మెటల్ ఫోర్జింగ్ ఇండస్ట్రీస్ యూనిట్ 2లో బుధవారం డ్రిల్లింగ్ బిట్లను హీట్ ట్రీట్‌మెంట్ చేస్తుండగా ఆయిల్‌కు మంట లు అంటుకుని అగ్ని ప్రమాదం సంభవించింది, సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ఫైరింజన్‌తో మంటలను ఆర్పారు. ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఘటన స్థలానికి సిఐ సుధాకర్ సందర్శించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



"విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న థ్రిల్లర్ 'నాగబంధం ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు."

రీల్

## 'మా ఇంటి బంగారం'ఫ్యామిలీ సినిమా



త్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా 'మా ఇంటి బంగారం'. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూన్ 19న విడుదల కాబోతోంది. సమంత మాట్లాడుత 'నేను ఇకపై ఏడాదికి రెండు సినిమాలు అభిమానులకు అందించాలని అనుకుంటున్నాను. ఇప్పుడు అయితే ఓ మంచి చిత్రాన్ని చేశాం. ఇప్పటి వరకు నేను నటిగా ఎంతో ఎంజాయ్ చేశారు. నిర్మాతకు ఉండే కష్టాలు ఇప్పుడు తెలుస్తున్నాయి. గత వారం రోజులుగా మా టీం నిద్రపోవడం లేదు. ప్రతీ ఒక్క డిపార్ట్‌మెంట్ ప్రాణం పెట్టి పని చేసింది. రాజ్ అండ్ డికె, నందినీ రెడ్డి నాకు ఎంతో సపోర్ట్‌గా నిలిచారు. రాజ్ అండ్ డీకే ఎప్పుడూ కష్టపడుతూ పని చేస్తూనే ఉంటారు. జూన్ 19న రాబోతోన్న 'మా ఇంటి బంగారం' అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని అన్నారు. నిర్మాత రాజ్ నిడిమోరు మాట్లాడుతూ ప్రేమ , పిచ్చి అనేది తెలుగు పరిశ్రమ లోనే ఎక్కువగా ఉంటుంది. 'మా ఇంటి బంగారం' చిత్రానికి వసంత్, ధర్మేంద్ర పిల్లర్స్‌లా నిల్చున్నారు. హిందీలో ఎన్నో సినిమాలు చేశాం. కానీ దీనికి వస్తున్న రెస్పాన్స్, ఎగ్జైట్మెంట్ నాకు ఎక్కడా కనిపించ లేదు. అందరూ ఫస్ట్ డే ఫస్ట్ షో చూస్తారని ఆశిస్తున్నాను అని అన్నారు. డైరెక్టర్ నందినీ రెడ్డి మాట్లాడుతూ 'మా ఇంటి బంగారం' కోసం గత కొన్ని రోజులుగా ఎంతో మంది నిద్ర లేకుండా పని చేస్తున్నాం. అద్భుతమైన టీం నిరంతరం శ్రమించడం వల్లే ఇదంతా సాధ్యమైంది. ఈ ఇండస్ట్రీలో నేను ఎంతో మంది స్నేహితుల్ని సంపాదించుకున్నాను. 19న మా చిత్రం రాబోతోంది. ఇంత వరకు చూసిన సమంత కంటే.. పది రెట్ల సమంతను చూస్తారు' అని అన్నారు. హిమాంక్ మాట్లాడుతూ రాజ్ ఈ లైన్ చెప్పినప్పుడు, టైటిల్ చెప్పినప్పుడు రిజల్ట్ ముందు గానే ఊహించాను. రాజ్, సమంత, నేను ముందుగా కూర్చుని రెడీ చేశాం. ఆ తరువాత వసంత్, నందినీ ఇలా అందరూ జాయిన్ అయ్యారు. జూన్ 19న మా సినిమాని చూసి అందరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, ఎడిటింగ్: ధర్మేంద్ర కాకరాల.


## శ్రీనువైట్ల - శర్వానంద్ కాంబినేషన్‌లో సినిమా

ఆనందం, వెంకీ, ఢీ, రెడీ, కింగ్, దూకుడు, బాద్షా వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల దర్శకుడు తాజాగా శర్వానంద్ తో సినిమా చేస్తున్నాడు. అనిల్ సుంకర నిర్మాణ సారథ్యంలో చేయనున్న నూతన చిత్రానికి సంబంధించిన కార్యాలయ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం జూబ్లీ హిర్స్‌లో జరిగింది.ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల లక్ష్యంగా సన్నాహాలు చేస్తున్నారు ఈ చిత్రానికి సంబంధించిన నటీ నటులు, సాంకేతిక వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని నిర్మాత అనిల్ తెలిపారు.



## 'నాగబంధం' విజువల్ గా మెస్మరైజ్ చేస్తుంది

డిఒపి సౌందరరాజన్



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న థ్రిల్లర్ 'నాగబంధం ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సావ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా డిఒపి ఎస్. సౌందరరాజన్ విలేకరులతో చిట్ చాట్ నిర్వహించారు నేను ఇంతకుముందు అభిషేక్ తో డెవిల్ సినిమా చేశాను. అభిషేక్ చాలా పెద్ద విజన్‌తో ఈ కథను మొదలుపెట్టారు. . నాగబంధం ఐడియా మా అందరినీ ఎంతగానో ఉత్సాహపరిచింది. మొదట కథను లాక్ చేశాం. తర్వాత దాన్ని విజువల్‌గా ఎంత గ్రాండ్‌గా, ఎంగేజింగ్‌గా చూపించాలనే దానిపై ప్లాన్ చేశాం. నేను ఇంతకుముందు ఫాంటసీ సినిమాలు చేశాను. విజువల్స్‌ను గ్లామరైజ్ చేసి, ఎలివేట్ చేసేలా కూడా చేసిన అనుభవం ఉంది. కానీ ఈ సినిమా మాత్రం చాలా ప్రత్యేకం. చాలా నేచురల్ స్టైల్లో ఈ సినిమా చేయడం జరిగింది. ప్రతి సన్నివేశానికి తగ్గట్టుగా సహజమైన లైటింగ్‌తో, కథలో లీనమయ్యేలా తీశాను. ఎక్కడా ఓవర్ గ్లామర్ చేయడం గానీ, అనవసరమైన డ్రామా సృష్టించడం గానీ చేయలేదు. విజువల్ ఎఫెక్ట్స్ను మనం రెండు రకాలుగా వాడుతుంటాం. తిరువనంతపురంలోని శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించాం. అక్కడ ప్రతి అంశాన్ని డీటెయిల్గా ఫొటోగ్రాఫ్ చేశాం. అనంత పద్మనాభస్వామి టెంపుల్ సెట్‌లోకి అడుగుపెడితే నిజంగా ఆలయంలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. అంత అద్భుతంగా ప్రతి సెట్‌ను తీర్చిదిద్దారు. హైదరాబాద్, కేరళ, తమిళనాడు, అలాగే హిమాలయాల్లోని కొన్ని ప్రాంతాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించాం.ఈ సినిమా హైలైట్ అనంత పద్మనాభస్వామి టెంపుల్, అక్కడ జరిగే సన్నివేశాలు. అవి అద్భుతంగా ఉంటాయి. అలాగే క్లైమాక్స్ కూడా ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుంది. ఈ సినిమాలో మైథాలజీ, ఫిక్షన్, డ్రామా అన్నింటినీ మిళితం చేస్తూ ఒక విజువల్ ఫీస్టా మలిచాం. ఆలయ ప్రవేశ ద్వారం నుంచి పద్మనాభస్వామి విగ్రహం వరకు ఒకే షాట్లో చిత్రీకరించాం. ఈ సినిమా ప్రేక్షకులను ఎంగేజ్ చేస్తూ, ఎంటర్‌టైన్ చేస్తూ, ఒక డివైన్ అనుభూతిని కూడా అందిస్తుంది. ఖచ్చితంగా ఇది ప్రేక్షకులకు అద్భుతమైన విజువల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది.

## కానిస్టేబుల్ త్రిమూర్తులు చేసిన ఘనకార్యం ఏమిటి?



వడ్డే క్రియేషన్స్ బ్యానర్‌పై రో వడ్డే నవీన్ రీ ఎంట్రీ ఇస్తూ నటించిన చిత్రం ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు. ఈ చిత్రంలో రాశీ సింగ్, శిల్ప తులస్కార్, వివేక్ రఘువంశీ, రఘు బాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, సూర్య, బాబా భాస్కర్, ప్రమోదిని, గాయత్రి తదతరులు నటించారు. ఈ సినిమాకు కమల్ తేజ నార్ల రచనా సహకారంతోపాటు దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు హీరో వడ్డే నవీన్ నిర్మాతగా వ్యవహరించారు. ఆయన కుమారుడు వడ్డే జిష్ణు సమర్పకుడిగా వ్యవహరించారు. అన్ని పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి మ్యూజిక్: కల్యాణ్ నాయక్, సినిమాటోగ్రఫీ: కార్తీక్ సుజాత సాయికుమార్, ఎడిటర్: విజయ్ ముక్తవరపు, లిరిక్స్: భాస్కరభట్ల రవికుమార్, ఫైట్స్: రాబిన్ బాబు, రామ్ సుంకర, ఆర్ట్: భిక్షపతి కందకట్ల, కొరియోగ్రఫీ: విజయ్ పోలంకి, ధినేష్, కాస్ట్యూమ్ డిజైనర్: శ్రావ్య రెడ్డి




## 'ది ఇండియా' స్టోరీ పోస్టర్

జీ స్టూడియోస్ సమర్పణలో, ఎంఐజి ప్రొడక్షన్ , జీ స్టూడియోస్ సహకారంతో తెరకెక్కుతున్న 'ది ఇండియా స్టోరీ' చిత్రానికి సంబంధించిన తొలి అధికారిక పోస్టర్‌ను విడుదల చేశారు.
ఈ పోస్టర్‌లో కాజల్ అగర్వాల్ ఓ న్యాయవాదిగా, శ్రేయస్ తల్పడే ఆందోళనలో ఉన్న తండ్రిగా కనిపిస్తున్నారు. అలాగే శ్రేయస్ కుమార్తె పాత్రలో కనిపిస్తున్న చిన్నారి ద్వారా, లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్న ఒక తీవ్రమైన సమస్య వెనుక ఉన్న మానవీయ కోణాన్ని పోస్టర్ బలంగా ఆవిష్కరించింది. ముంబై హైకోర్టు నేపథ్యంతో రూపొందించిన ఈ పోస్టర్లో, సాక్షుల బోనులో ఉంచిన పురుగుమందు సిలిండర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆహార కల్తీ అనే అత్యంత కీలకమైన సమస్యపై సాగే కోర్ట్‌రూమ్ డ్రామాకు ఇది సంకేతంగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి చెట్టన్ డీకే దర్శకత్వం వహించగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్ప్లే అందించి నిర్మిస్తున్నారు. జూలై 24న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. భారతదేశంలో ప్రజారోగ్యానికి సంబంధించిన అత్యంత కీలకమైన, తరచూ నిర్లక్ష్యానికి గురయ్యే ఆహార కల్తీ సమస్యను ఈ చిత్రం ప్రధానాంశం. సాధారణ ప్రజలు ప్రతి రోజూ వినియోగించే ఆహార పదార్థాల వెనుక దాగి ఉన్న ప్రమాదాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, సమాజంలో అవగాహన పెంచే ప్రయత్నం చేయనుంది. ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా స్వాతి వినాయక్ సైందానే, అనితా జాధవ్, వినాయక్ సైదానే, కల్పేష్ షా, దేవయాని ఖోరాటే, ప్రేమ్ జోషి వ్యవహరిస్తున్నారు. సినిమాటోగ్రఫీని నిశాంత్ భాగవత్, సంగీతాన్ని మంగేష్ ధాక్డే, ఎడిటింగ్‌ను ఆశిష్ మ్హాత్రే, సాహిత్యాన్ని షకీల్ అజామీ, సౌండ్ డిజైన్‌ను అన్మోల్ భావే అందిస్తున్నారు.

## గే , ట్రాన్స్ జెండర్స్ వివక్షపై ఎల్‌జి బిటిఎ లీగల్ బ్యాటిల్

దర్శక నిర్మాత పి. సునీల్ కుమార్ రెడ్డి



సామాజిక ఇతివృత్తాల నేపథ్యంలో చిత్రాలను రూపొందించే దర్శకుడు పి సునీల్ కుమార్ రెడ్డి శ్రావ్య ఫిలిమ్స్ బ్యానర్ పై సుభాష్ చక్రవర్తి రవడ సహ నిర్మాతగా గే, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల జీవితాల మీద తీసిన కోర్ట్ రూమ్ డ్రామా ఎల్‌జి బిటిఎ లీగల్ బ్యాటిల్. ఈ చిత్రంలో ఎల్ బి శ్రీరామ్, ఎస్తర్ , రాజు ఖేర్, ఆనంద చక్రపాణి , ప్రీతీ నిగమ్ తో పాటు రియల్ ట్రాన్స్‌జెండర్ యాక్టర్స్ ప్రధాన పాత్రలు పోషించారు. హిమ రాథోడ్ హీరోయిన్ గా , చంద్రముఖి , లైలా వంటి ప్రముఖ యాక్టివిస్టులు , గే యాక్టివిస్ట్ విష్ణు తేజ చాలా పరిణితితో నటించారు. ఎల్ జి బిటిఎ లీగల్ బ్యాటిల్ సినిమా ఈ నెల 19న దేశవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ పి.సునీల్ కుమార్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు సమానత్వం ఉందని చెప్పుకునే మన దేశంలో ట్రాన్స్ జెండర్స్ విషయంలో తీవ్రమైన వివక్ష ఎదురవుతోంది. ట్రాన్స్ జెండర్స్ మీద ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయి. కానీ అవి పోలీస్ స్టేషన్స్ లో కేసులుగా నమోదు కావడం లేదు. కోర్టుల దాకా వెళ్లి జడ్జిమెంట్ పొంది శిక్షలు పడటం లేదు. ఇప్పటిదాకా ఒక్క ట్రాన్స్ జెండర్ కేసు కూడా ఏ కోర్టులోనూ తుది తీర్పు వచ్చి శిక్ష పడలేదు. ఇంతకంటే అన్యాయం మరొకటి ఉండదు. ఫస్ట్ టైమ్ మన సినిమాలోనే ఒక ట్రాన్స్ జెండర్ కేసులో పూర్తి న్యాయం జరిగినట్లు చూపిస్తున్నాం. ఈ సినిమాలో ఎంటర్ టైన్‌మెంట్ ఉంటుంది, అలాగే సీరియస్ ఇష్యూస్ చెబుతున్నాం. కేవలం మల్టిప్లెక్స్ ల్లో మాత్రమే ఈ నెల 19న మా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం. మీ ఆదరణ ఉంటే సింగిల్ స్క్రీన్స్ లోనూ రిలీజ్ చేస్తాం. తెలుగు వెర్షన్ లో ఇంగ్లీష్ సబ్ టైటిల్స్ తో సినిమా ఉంటుంది. ఒక కొత్త తరహా కంటెంట్ చూడాలనుకునే ప్రేక్షకులు మా సినిమాకు రావొచ్చు. పుణెలో జరిగిన ఇంటర్‌నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో మా సినిమాకు బెస్ట్ ఫిలిం అవార్డ్ దక్కింది. ఫిలిం ఫెస్టివల్స్ కు మాత్రమే ఇలాంటి సినిమాలు పరిమితం కావొద్దు. జనాల మధ్యలో డిస్కషన్ కు రావాలి అనేది మా ఉద్దేశం. గే అండ్ ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ గురించి నేను చేసిన చిత్రమిది. సెన్సార్ విషయంలోనూ ఇబ్బందులు ఎదుర్కొన్నాం..

## భద్రత తగ్గింపు వెనుక నితీశ్ హస్తం

### ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్

**పాట్నా :** బిహార్‌లోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం తన భద్రతా స్థాయిని తగ్గించడం వెనుక జెడియు అధినేత, తన ప్రధాన ప్రత్యర్థి అయిన నితీష్ కుమార్ హస్తం ఉందని ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ బుధవారం ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రులుగా 'జెడ్‌ప్లస్' భద్రతను కలిగి ఉన్న ప్రసాద్, ఆయన భార్య రబ్రీ దేవిల భద్రతా స్థాయిని తగ్గిస్తూ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల గురించి పాత్రికేయులు అడిగినప్పుడు ఆయన స్పందించారు. 'అవును, భద్రతా స్థాయి తగ్గించారు. ఇదంతా నితీష్ కుమార్ ఆదేశాల మేరకే జరుగుతోంది' అని లాలూ ప్రసాద్ క్లుప్తంగా సమాధానమిచ్చారు. ఒకప్పుడు వాగ్ధాటితో కూడిన ప్రసంగాలకు పెట్టింది పేరైన లాలూ, వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా ఇప్పుడు ఎక్కువ సమయం ఏకాంతంగా గడుపుతున్నారు. అందుకే ఆయన ఈ విషయంపై మరింత వివరంగా మాట్లాడలేదు.

1974లో జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలోని విద్యార్థి ఉద్యమం ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ప్రసాద్, నితీశ్ కుమార్ మధ్య ఉన్న వైరం బిహార్ రాజకీయాల్లో ఎంతో ప్రసిద్ధి చెందింది. 1990లలో కుమార్, ప్రసాద్‌తో విభేదించి విడిపోయినప్పటి నుండి వారి మధ్య ప్రేమద్వేషాలతో కూడిన సంబంధం కొనసాగుతూనే ఉంది. చివరకు 2005లో బిజెపితో పొత్తు పెట్టుకుని కుమార్ ఆర్‌జెడిని అధికారంలో నుంచి దించివేశారు. ఈ ఇద్దరు నాయకుల మధ్య తీవ్రమైన వైరం ఉన్నప్పటికీ, ఆర్‌జెడి, జెడియు మధ్య రెండుసార్లు స్వల్పకాలిక పొత్తులు కుదిరాయి. బిజెపితో కుమార్ తాత్కాలికంగా విసిగిపోయిన సందర్భాల్లోనే ఈ పొత్తులు ఏర్పడ్డాయిఏర్పడ్డాయి. ఆ రెండు సందర్భాల్లోనూ, ప్రసాద్ చిన్న కుమారుడు , రాజకీయ వారసుడు అయిన తేజస్వి యాదవ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి దక్కింది.

## 'సహజీవనం'జంటపై దాడి జరగకుండా రక్షణ ఇవ్వాలి

### అఖిలభారత వర్కింగ్ ఉమెన్ ఫోరం డిమాండ్
### వ్యక్తిగతస్వేచ్ఛను న్యాయస్థానం కాపాడాలి
### రాజ్యాంగాన్ని వదిలి నైతికతకు ప్రాధాన్యత ఇవ్వడం తిరోగమనం

**న్యూఢిల్లీ:** సహజీవనం చేసే ఒక జంటకు పోలీసు రక్షణను నిరాకరిస్తూ పంజాబ్‌‌–హర్యానా హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును ఎఐటియుసికి చెందిన అఖిలభారత వర్కింగ్ ఉమెన్స్ ఫోరం (ఎఐడబ్ల్యుడబ్ల్యుఎఫ్) తీవ్రంగా వ్యతిరేకించింది. వివాహ బంధానికి బదులుగా సహజీవనం చేసే సంబంధం పాశ్చాత్య సంస్కృతికి తార్కాణమని, ఈ విధమైన సంబంధాలు కుటుంబ గౌరవాన్ని, సామాజిక విలువలను దెబ్బతీస్తాయని పేర్కొంటూ రాష్ట్ర ఉన్నతన్యాయస్థానం తీర్పు చెప్పడం తిరోగమన చర్య అని ఎఐడబ్ల్యుడబ్ల్యుఎఫ్‌–ఎఐటియుసి కన్వీనర్ వహీదా నిజాం బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నిశితంగా విమర్శించారు. న్యాయస్థానాలు, ప్రభుత్వ వ్యవస్థలూ రాజ్యాంగపరంగా పౌరులకు లభించిన వ్యకిగతస్వేచ్ఛను ఇతర హక్కులను సంరక్షించాలని, ఈ సంబంధాన్ని పాశ్చాత్య సంస్కృతితో ముడిపెట్టి భారతీయ కుటుంబ గౌరవం,సామాజిక విలువల ప్రాతిపదికను ప్రస్తావించడం, సహజీవనం చేసే జంటకు పోలీసు రక్షణ ఇవ్వలేమని చెప్పడం రాజ్యాంగ విరుద్ధమే కాగలదని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన నైతికత,స్త్రీ పురుష సమానత్వం,వ్యక్తిగత స్వేచ్ఛలను న్యాయస్థానం సమర్థించాలని కోరారు. మైనార్టీ తీరి వయోజనులైన తర్వాత ఇళ్ళు వదిలి బయటకు వెళ్ళి స్వతంత్రంగా జీవించే స్త్రీ, పురుషులకు తమ జీవితభాగస్వామిని ఎన్నుకునే హక్కును కాపాడాలని, సహజీవనం చేస్తున్న జంట తమకు ప్రమాదం పొంచి ఉందని రాజ్యాంగ వ్యవస్థ దృష్టికి తీసుకువచ్చినందు వల్ల వారు ఎలాంటి దాడులకు,హింసకు గురికాకుండా సంబంధిత రాష్ట్ర అధికారులు పోలీసు రక్షణ కల్పించడం చట్టబద్ధమైన విధిగా భావించాలని కోరారు.
మహిళా హక్కుల దృక్కోణం నుండి చూసినప్పుడు ఈ తీర్పు తీవ్ర ఆందోళన కలిగించేదిగా ఉందని ఆమె పేర్కొన్నారు. సామాజికంగా ఉన్న నిబంధనల మేరకు ప్రజల ఆమోదాన్ని పొందేపేరుతో రాజ్యాంగబద్ధమైన హక్కులను న్యాయస్థానాలు, అధికారులు తలక్రిందులు చేయలేరని, వాటిని ఉల్లంఘించలేరని వహీదా నిజాం గుర్తుచేశారు.మహిళల స్వయంప్రతిపత్తికంటే కుటుంబ గౌరవానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేవిధంగా పంజాబ్‌–హర్యానా హైకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు దేశంలో మహిళ తన జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే హక్కు విషయంలో పితృస్వామ్య వ్యవస్థ ఆధిపత్యాన్ని చట్టబద్ధం చేసే ప్రమాదం కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వయోజనులైన స్త్రీ–పురుషుడు సహజీవనం చేస్తూ, తమకు రక్షణ కల్పించమని అడిగితే భారతీయ సంప్రదాయాన్ని పాశ్చాత్య సంప్రదాయాన్ని సరిపోల్చి చూస్తూ రాజ్యాంగపరమైన నిబంధనలకు అనుగుణంగా స్పందించకుండా, సామాజిక నైతిక నిబంధనలను సమర్థిస్తూ తీర్పుచెప్పడం కాలానుగుణంగా దిన దిన ప్రవర్థమానం చెందే న్యాయశాస్త్రానికి ప్రతీక కాబోదని వహీదా నిజాం తప్పుపట్టారు. మన చుట్టుపక్కల ఉండే సమాజం ఆమోదం పొందడంకోసం, వారి మెచ్చుకోలుకోసం రాజ్యాంగ పరంగా పౌరులకు ఇచ్చిన హామీలను తిరస్కరించకూడదని పేర్కొన్నారు.

## వనమహోత్సవానికి సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతం కోసం అటవీ శాఖ విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసింది. అటవీ దళాల అధిపతి వినయ్ కుమార్, సిసిఎఫ్ ప్రియాంక వర్గీస్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి గుగులోతు రవి తదితర ఉన్నతాధికారులు గుర్రంగూడ ఎకో పార్కును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక, పార్కింగ్, భద్రత, తాగునీటి సదుపాయాలు, సందర్శకుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ నేరేడు మొక్కను నాటనుండగా, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు కూడా మొక్కలు నాటి హరిత తెలంగాణ లక్ష్య సాధనలో భాగస్వాములు కానున్నారు.ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇందుకోసం 13,242 నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 6.18 కోట్ల మొక్కలు, హెచ్ఎండిఎ పరిధిలో 4.50 కోట్ల మొక్కలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో 89.59 లక్షల మొక్కలను నాటనున్నారు. మూడున్నర దశాబ్దాలుగా న్యాయ వివాదాల్లో చిక్కుకున్న గుర్రంగూడ ప్రాంతాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్తించిన అనంతరం అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పుడు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. రూ.11.57 కోట్లతో నిర్మించిన భద్రతా ప్రహరీ గోడ, అంతర్గత డ్రైనేజీ, సందర్శకుల సౌకర్యాలు, యోగా షెడ్ గెజిబోలు, ఎకో ట్రయిల్స్, కానోపీ వాచ్ టవర్ వంటి సదుపాయాలను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాలు, రహదారుల వెంట భారీ ఎత్తున మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించారు. నాటిన ప్రతి మొక్క మనుగడను నిర్ధారించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఇప్పటికే అధికారులను ఆదేశించింది.పర్యావరణ పరిరక్షణ, హరిత తెలంగాణ సాధన లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ మొక్కల పండుగలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని అటవీ శాఖ పిలుపునిచ్చింది.

## నాటకాలు ఆపండి

(మొదటి పేజీ తరువాయి)

కొత్త ఎత్తుగడ. అంటే, దొంగను పట్టుకోవడానికి బదులుగా, బాధితుడి ఇంటి తలుపుకు తాళం వేయడం లాంటిది' అని రాహుల్ గాంధీ ఎక్స్ వేదిగా పోస్టు చేశారు. లక్షలాది మంది విద్యార్థులు ఏళ్లుగా టెలిగ్రామ్‌లోనే చదువుకుంటున్నారని, నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, చర్చలు, ప్రిపరేషన్ అవుతున్నారని, ఇప్పుడు ఆ సౌకర్యాన్ని లాక్కోవడం పేపర్ లీక్‌లకు పరిష్కారం ఎలా అవుతుందని ప్రశ్నించారు. అంతేకాదు, ఇది కూడా పూర్తి సురక్షితం కాదు ఈ విషయం దేశంలోని ప్రతి విద్యార్థికి తెలుసు, పేపర్ లీక్ మాఫియాకు కూడా తెలుసునన్నారు. అలాంటప్పుడు, తదుపరి నిషేధం ఎవరిపై ఉంటుంది? వాట్సాప్‌పైనా?' అని రాహుల్‌గాంధీ నిలదీశారు. 'పరీక్ష రోజున, విద్యార్థులను తనిఖీ చేస్తారు. కత్తెరలతో జేబులు కోసేస్తారు. ప్రశ్నపత్రాలను వైమానిక దళం ద్వారా పంపిస్తారు. నాటకాలకు కొదవే ఉండదు. కానీ ఈ వ్యాధి మూలంపై ఒక్క దెబ్బ కూడా పడదు ఎందుకంటే ఈ పేపర్ లీక్ మాఫియా ఈ ప్రభుత్వ కళ్ల ముందే విజృంభిస్తూ, యువతతో రక్త కన్నీరు కార్పిస్తోంది. మోదీ జీ ఈ నాటకాలు ఆపండి. విద్యార్థులపై కాదు, మాఫియాపై దెబ్బ కొట్టండి' అని గాంధీ అన్నారు. విద్యార్థుల ప్రతిధ్వనిని వినండి.. లేకపోతే దేశ యువతకు తమ హక్కులను ఎలా సాధించుకోవాలో తెలుసు అని అన్నారు. నీట్‌యుజి 2026 పునః పరీక్షకు ముందు, మోసపూరిత ముఠాలు, తప్పుడు సమాచారాన్ని అరికట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం మంగళవారం టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్‌పై తాత్కాలికంగా ఆంక్షలు విధించింది. ఈనెల 21న జరిగే పునఃపరీక్ష ఎలాంటి అవకతవకలు లేకుండా జరిగేలా చూసే ప్రయత్నాలలో భాగంగానే, 22 వరకు టెలిగ్రామ్‌పై ఈ ఆంక్షలు విధించినట్లు ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ తెలిపారు. 'ఏ తప్పు జరగనివ్వము. ఎలాంటి అవకతవకలు లేకుండా పరీక్ష జరిగేలా చూసేందుకు సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటాము' అని ఈ చర్య గురించి అడిగినప్పుడు సింగ్ పిటిఐకి చెప్పారు.

## చైనా 'శ్వేతపత్రం'

(మొదటి పేజీ తరువాయి)

పాతుకుపోయిన సంఘర్షణలను వివాదాలు బయటకు తెస్తున్నాయి,పశ్చిమాసియాలో కుదిరిన ఒప్పందానికి సంబంధిత దేశాలు చిత్తశుద్ధితో కట్టుబడి ఉండాలి,ఈ ప్రాంతంలో సుస్థిర భద్రతా నిర్మాణానికి అవసరమైన పునాది వేయడానికి అన్నిదేశాలు కృషి చేయాలి'' అని వాంగ్ యీ పేర్కొన్నారు. ప్రపంచపాలనా వ్యవస్థ (ఐక్యరాజ్యసమితి)ను మరింత న్యాయబద్ధంగా,సమాన పాలనావ్యవస్థతో కూడిన ప్రాతినిధ్యం పెంపొందించడం ద్వారా మెరుగైనస్థాయిలో తీర్చిదిద్దడానికి వీలుగా ఒక శ్వేతపత్రాన్ని వాంగ్ యీ విడుదల చేశారు. ''మరింత న్యాయమైన–సమానమైన ప్రపంచపాలనఃచైనా సూత్రాలు, ప్రతిపాదనలు,చర్యలు'' అనే శీర్షికతో చైనా స్టేట్ కౌన్సిల్ ఇన్ఫర్మేషన్ ఆఫీస్ అందించిన ఒక శ్వేతపత్రాన్ని వాంగ్ యీ విడుదల చేశారు. ప్రపంచపాలనను మరింత న్యాయబద్ధంగా,సమానస్థాయిలో నడిపించేందుకు శ్వేతపత్రంలో చైనా పేర్కొన్న మార్గదర్శకాలను బుధవారం నిర్వహించిన ఒక అరుదైన పత్రికాగోష్ఠిలో ఆయన వివరించారు. పశ్చిమాసియా,ఉక్రేన్‌లలో పెరుగుతున్న ఉద్రిక్తతలు,పరిణామాలను ఆయన క్లుప్తంగా వివరించారు.

**శ్వేతపత్ర సారాంశం**

ప్రపంచ పాలనపై చైనా సూత్రాలు,ప్రతిపాదనలు,చర్యలను పరిచయం చేయడానికి అంతర్జాతీయంగా ఏకాభిప్రాయం సాధించడానికి వీలుగా ఈ శ్వేపత్రాన్ని చైనా విడుదల చేసింది.ఆధిపత్యవాదం మార్కెట్లపై బేరాసారాలు చేస్తోందని, ఈ సమయంలో సమానమైన ప్రపంచ పాలనను నిర్మించాల్సిన అవసరం ఉంది.ప్రపంచ పాలన అనేది మానవాళి శ్రేయస్సుకు సంబంధించిన ఒక ఉమ్మడి ప్రయత్నం. సమానమైన ప్రపంచపాలన నిర్మించడానికి ప్రజలు ఎన్నాళ్ళుగానో అనుసరిస్తున్న ఒక ఉమ్మడి పథకం.ఈ ఉమ్మడి పథకంలో చైనా ఎల్లప్పుడూ ఒక చురుకైన భాగస్వామిగా ఉంటూ వచ్చింది. విస్తృత సంప్రదింపులు, సంయుక్త సహకారంతో సార్వత్రిక ప్రయోజనాలతో కూడిన క్రమబద్ధమైన,బహుళధ్రువ, సమ్మిళిత ఆర్థిక ప్రపంచీకరణను పెంపొందించడానికి,నిజమైన బహుళ పాక్షిక వాదానికి ఈ శ్వేతపత్రం ద్వారా జీ జిన్‌పింగ్ పిలుపు ఇచ్చారు. ఇదేవిధంగా గత ఏడాది 2025లో కూడా జిన్‌పింగ్ ''గ్లోబల్ గవర్నెన్స్ ఇనీషియేటివ్'' (జిజిఐ)ని ప్రారంభించారు. ''ఏవిధమైన ప్రపంచ పాలనావ్యవస్థను నిర్మించాలి, ప్రనపంచ పాలనను (ఐక్యరాజ్య సమితి) ఏ విధంగా సంస్కరించి మెరుగుపరచవచ్చు'' అనే రెండు కీలకమైన ప్రశ్నలకు చైనా పరిష్కారాన్ని అందించేవిధంగా జిన్‌పింగ్ జి.జి.ఐని రూపొందించారు. ఈ జి.జి.ఐని ప్రతిపాదించిన వెంటనే 160 దేశాల నుండి, అంతర్జాతీయ సంస్థల నుండి ఆయనకు సత్వరమే మద్దతు లభించిందని చైనా వార్తాసంస్థ 'జిన్హువా' గుర్తుచేసింది. ''గ్రూప్ ఆఫ్ ఫ్రెండ్ అండ్ గ్లోబల్ గవర్నెన్స్''లో 60కి పైగా దేశాలు సభ్యులుగా చేరాయి.బహు పాక్షిక వాదాన్ని నిలబెట్టండి, ఏకాభిప్రాయ శక్తులను ఒకేచోటకు చేర్చండి, న్యాయమైన భవిష్యత్తును సాధించండి అనే సంకేతాన్ని జి.జి.ఐ సూచించిందని శ్వేతపత్రం పేర్కొంది.

## ప్రాజెక్టుల పూడికతీత

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రధాన జలాశయాల అసలు నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని తన కార్యా లయంలో జలాశయాలు, నీటి పారుదల ప్రాజెక్టులలో పూడిక తొలగింపు కార్యక్రమాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కడెం ప్రాజెక్టులో పూడిక తొలగింపు పనులు చేపడుతున్న సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి సమీక్షించారు. అలాగే లోయర్ మానేరు డ్యామ్ (ఎల్‌ఎండి), మిడ్ మానేరు రిజర్వాయర్ (ఎంఎంఆర్)లలో జరుగుతున్న పూడిక తొలగింపు పనుల పురోగతిని కూడా పరిశీలించారు. పనుల వేగాన్ని పెంచేందుకు, కార్యాచరణలో ఉన్న అడ్డంకులను తొలగించేందుకు ఆచరణాత్మక పరిష్కారాలను గుర్తించాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. జలాశయాల నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల నీటి భద్రత మెరుగుపడటంతో పాటు సాగునీటి విస్తీర్ణం పెరుగుతుందని, వరద ముప్పు కూడా తగ్గుతుందని ఆయన చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పూడిక తొలగింపు నమూనాలను సమగ్రంగా అధ్యయనం చేసి, తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయగల ఉత్తమ విధానాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్ జిల్లాలోని మంగళం ఆనకట్టలో 2017లో చేపట్టిన పూడిక తొలగింపు కార్యక్రమం ఒక విజయవంతమైన నమూనా అని, దీనిని శాస్త్రీయ పద్ధతిలో చేపట్టారని ఆయన వివరించారు. జలాశయంలో పేరుకుపోయిన పూడిక సమస్యను పరిష్కరించడంతో పాటు తవ్వి తీసినమట్టిని వినియోగించడం ద్వారా ఆర్థిక ప్రయోజనాలు కూడా సాధించారన్నారు. ఇలాంటి విజయ వంతమైన నమూనాలను అధ్యయనం చేసి, తెలంగాణలో కూడా అమలు చేసేందుకు మార్గాలను పరిశీలించాలని సూచించారు.

**జాతీయ మార్గదర్శకాలు..విధానాలను అధ్యయనం చేయండి..**

జలాశయాల్లో పూడిక నిర్వహణ,పూడిక తొలగింపుపై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జాతీయ మార్గదర్శకాలు, విధానాలను కూడా అధ్యయనం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచిం చారు. పూడిక తొలగింపు వంటి నివారణ చర్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది పంజాబ్ రాష్ట్రంలో సంబవించిన తీవ్ర వరదల కారణంగా 22 జిల్లాల్లో 16 జిల్లాలు ముంపునకు గురయ్యాయని, నష్ట పరిహారం, పునరుద్ధరణ చర్యల కోసం దాదాపు రూ.2వేల కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు.
సకాలంలో పూడిక తొలగింపు, డ్రైనేజీ వ్యవస్థలు, జలాశయాల నిల్వ సామర్థ్యాల పునరుద్ధరణ వంటి చర్యలు చేపడితే ఆ వ్యయంలో గణనీయమైన భాగాన్ని నివారించవచ్చని అభి ప్రాయపడ్డారు.

**''శ్రీరాం, నిజాం'' ప్రాజెక్టుల సామర్థ్య పునరుద్ధరణ చర్యలపై నివేదిక ఇవ్వండి ..**

శ్రీరాం సాగర్ ప్రాజెక్టు (ఎస్‌ఆర్‌ఎస్‌పి), నిజాంసాగర్ ప్రాజెక్టుల ప్రధాన ఇంజినీర్లు ఆయా ప్రాజెక్టుల్లో పూడిక పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి, కోల్పోయిన నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించే చర్యలపై నివేదిక సమర్పించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని జలాశయాల్లో పూడిక తొలగింపు కార్య క్రమానికి ఇంజినీర్‌ఇన్‌చీఫ్ (ఆపరేషన్, మెయింటనెన్స్) నేతృత్వం వహిస్తారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి ఇ. శ్రీధర్ ,గనుల శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, నీటిపారుదల శాఖ సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఇ.ఎన్.సి ఓ.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com